




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


రేవంత్ 'వ్యూహం'లో కెసిఆర్ ఉక్కిరిబిక్కిరి!

దళితులకు కొరవడిన సామాజిక న్యాయం... అందని ద్రాక్షగా నిలిచిపోయిన సంక్షేమ పథకాలు 06


సంపుటి 28, సంచిక: 192 | శనివారం | 03-01-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## నదీ జలాల వివాద పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీ

- నోటిఫికేషన్ జారీచేసిన కేంద్ర జలవనరుల శాఖ
- కమిటీలో తెలంగాణ, ఏపి ప్రత్యేక కార్యదర్శులు
- సభ్యులుగా కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల చైర్మన్లు



**న్యూఢిల్లీ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నదీ జలాల వినియోగానికి సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి కేంద్ర జల వనరుల మంత్రిత్వ శాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ కమిటీకి కేంద్ర జల వనరుల కమిషన్ చైర్మన్ నేతృత్వం వహిస్తారు. ఇందులో తెలంగాణ తరపున జలవనరుల శాఖ సలహాదారు, ప్రిన్సిపల్ సెక్రటరీ (నీటిపారుదల), ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి,ఇంజనీర్ ఇన్‌చీఫ్ ప్రతినిధులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ తరపున ప్రత్యేక కార్యదర్శి (జలవనరులు), సలహాదారు (జలవనరులు), ఇంజనీర్ ఇన్ చీఫ్ (నీటిపారుదల),ఒక చీఫ్ ఇంజనీర్ ప్రాతినిధ్యం వహిస్తారు. జాతీయ జల అభివృద్ధి సంస్థ, కేంద్ర జల సంఘం చీఫ్ ఇంజనీర్లతో పాటు ఈ కమిటీలో తరువాయి 2లో

## మూసీ అభివృద్ధి
# ఐదు దశల్లో..

### వచ్చే బడ్జెట్ సమావేశాల్లో మొదటి దశ డిపిఆర్ ప్రవేశపెడతాం

- అందరి అభిప్రాయాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని పనులు ప్రారంభిస్తాం
- హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు మొదటిదశ కింద చేపట్టే పనులను రెండేళ్లలో పూర్తిచేస్తాం
- రూ.7 వేల కోట్లతో హైదరాబాద్‌కు గోదావరి నీళ్లు తరలించేందుకు ప్రణాళికలు రూపొందించాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్

'మూసీ' ప్రాజెక్టును ఐదు దశలలో అభివృద్ధి చేయనున్నామని, ఇందులో మొదటి దశ డిపిఆర్‌ను రానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టి, అందరి అభిప్రాయాలను, సూచలను పరిగణలోకి తీసుకుని పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 21 కిలోమీటర్ల వరకు చేపట్టే మొదటి దశ పనులను రెండేళ్ల కాలంలో పూర్తి చేస్తామని, ఈ ప్రాజెక్ట్‌కు రూ.4100 కోట్ల రుణాన్ని ఇచ్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఎడిబి) అంగీకరించిందని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో నష్టపోయే ప్రజలకు అత్యధికంగా నష్టపరిహారాన్ని చెల్లిస్తామని, కాలనీలను నిర్మించి, పాఠశాల, ఆస్పత్రిని నిర్మిస్తామని, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రూ.450 కోట్లతో రెండేళ్లలో మీరాలం చెరువు అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. శాసనసభలో 'మూసీ నది పునరుజ్జీవం' అంశంపై శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలపై తరువాయి 2లో



# మహాత్మాగాంధీ పేరును పునరుద్ధరించాలి

### జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి


### కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ శాసనసభ తీర్మానం

- పేరు తొలగింపుతో గాంధీ స్ఫూర్తి నీరుగార్చినట్లయింది
- విబి–జీరామ్ జీ చట్టం పేదల హక్కులను దెబ్బతీసేలా ఉంది
- కొత్త చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర నిధుల వాటా 60; 40 శాతం మార్చడం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్

"కూలీ కుటుంబాల ఆకాంక్షల నెరవేర్చేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజిఎన్ ఆర్ఈజిఎస్) యధాతథంగా కొనసాగించాలి. మహాత్మా గాంధీ పేరును ఈ పథకం నుంచి తొలగించడంతో గాంధీ స్ఫూర్తిని నీరుగార్చినట్లయింది. మహాత్మా గాంధీ పేరును పునరుద్ధరించాలి" అని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ తీర్మానించింది. "కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రస్తుతం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం (విబి జీ రామ్ జీ ) 2025 చట్టం పేదల హక్కులను దెబ్బతీసేలా ఉంది. ఈ పథకంపై ప్రధానంగా ఆధారపడ్డ గ్రామీణ ప్రాంత మహిళలు, బలహీనవర్గాలకు ఉపాధి హామీ లేకుండా చేస్తుంది. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ ఉపాధి హామీ పథకం ఆత్మను దెబ్బతీసే కొత్త చట్టంలోని నిబంధనలు పేదల పాలిట శాపంగా మారనున్నాయి. మహాత్మా గాంధీ పేరును ఈ పథకం నుంచి తొలగించడంతో గాంధీ స్ఫూర్తిని నీరుగాచినట్లయింది. ఈ విషయాలన్నీ పరిగణలోకి తీసుకుని మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంలో నిర్దేశించిన ఉద్దేశాలు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని కూలీ కుటుంబాల ఆకాంక్షల తరువాయి 2లో

## మహాత్మాగాంధీ నరేగా
# పేరు మార్చడం దుర్మార్గం



- మహాత్ముడిని రెండోసారి హత్యచేసిన బిజెపి ప్రభుత్వం
- ఈ చట్టం రూపకల్పనలో కమ్యూనిస్టులదీ కీలక పాత్రే
- సిపిఐ శాసనసభాపక్ష నాయకుడు కూనంనేని

మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం యథాతథంగా అమలు చేయకపోతే కోట్లాది మంది నిరుపేదల కోపాగ్నిలో కేంద్ర సర్కార్ దగ్ధమైపోవడం ఖాయమని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం దేశంలోనే గొప్ప చట్టమని, దీనిని బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా మార్పులు చేసిందన్నారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధి హామీ పథకం పేరు ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలని తరువాయి 2లో

## ఫార్మా కంపెనీలు ప్రజల పాలిట శాపం

- చౌటుప్పల్, మునుగోడులోని ఫార్మా కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యంపై శాసనమండలిలో సిపిఐ ఎమ్మెల్సీ తీవ్ర ఆందోళన
- నివాస ప్రాంతానికి దగ్గరగా ఉన్న కంపెనీలను తక్షణమే తరలించాలి : నెల్లికంటి సత్యం

### కాలుష్యకారక ఫార్మా కంపెనీలపై కఠిన చర్యలు : మంత్రి కొండా సురేఖ హామీ



ప్రజాపక్షం/హైదరాబాద్

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని చౌటుప్పల్, మునుగోడు ప్రాంతాల్లో ఫార్మా కంపెనీల వల్ల జరుగుతున్న కాలుష్యంపై సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చని పొలాల మధ్య వెలుస్తున్న ఈ పరిశ్రమలు ప్రజల పాలిట శాపంగా మారుతున్నాయని ఆయన విమర్శించారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో చౌటుప్పల్, మునుగోడు ఫార్మా కాలుష్య ప్రభావంపై పలు కీలక అంశాలను ఆయన లేవనెత్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఫార్మా కంపెనీల వల్ల తీవ్ర స్థాయిలో కాలుష్యం తరువాయి 12లో

# మరో 2 ప్రైవేట్ వర్సిటీలు!

### శాసనసభలో బిల్లు ఆమోదం – తీవ్రంగా వ్యతిరేకించిన సిపిఐ

### తెలంగాణలో 12కు చేరుకోనున్న ప్రైవేట్ యూనివర్సిటీలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మరో రెండు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు రానున్నాయి. దీనికి సంబంధించిన తెలంగాణ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధం సవరణ 2025 బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో 10 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఉండగా, బిల్లు ఆమోదంతో కొత్తగా మరో రెండు విశ్వవిద్యాలయాలు రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని మామిడిపల్లిలో అమిటీ విశ్వవిద్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలో సెయింట్ మేరీస్ రిహాబిలిటేషన్ విశ్వవిద్యాలయానికి అనుమతించారు. శాసనసభలో శుక్రవారం ఈ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరుపున వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా సభలో ప్రవేశ పెట్టగా అన్ని పక్షాలు ఆమోదించగా, బిల్లును సిపిఐ పూర్తిగా వ్యతిరేకించింది.

**విద్యారంగం ప్రైవేటీకరణ సరికాదు : కూనంనేని సాంబశివరావు**

ప్రైవేట్ విశ్వవిద్యాలయాల ఏర్పాటును సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పాశ్చత్య దేశాల్లోనే విద్యారంగం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటే రాష్ట్రంలో మాత్రం విద్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రైవేటికరించడం సరైంది కాదన్నారు. సభలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తెలంగాణ ప్రైవేట్ తరువాయి 2లో



## 5 కీలక బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ శుక్రవారం ఐదు కీలక బిల్లులకు ఆమోద ముద్ర వేసింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తరపున శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ పురపాలికల(నాల్గవ సవరణ)చట్టం 2025 హైదరాబాద్ మహానగర పురపాలక కార్పోరేషన్ (సవరణ) చట్టం 2025, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పోరేషన్(రెండవసవరణ) చట్టం 2025 బిల్లులను ఆమోదానికి సభలో ప్రవేశ పెట్టారు. తెలంగాణ ప్రైవేట్ విశ్వవిద్యాలయముల స్థాపన, క్రమబద్ధము సవరణ చట్టం 2025 బిల్లును వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజ నర్సింహా, తెలంగాణ మోటార్ వాహనాలపై పన్ను విధింపు (సవరణ) చట్టం2025 రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సభ ముందు పెట్టగా ఈ బిల్లులన్ని ఆమోదం పొందాయి. హైదరాబాద్ మహానగరం రోజుకు రోజుకు శరవేగంగా విస్తరిస్తుండడం, ఈ మహానగరం పరిధిలో 2011 నాటికి 74 లక్షలుగా ఉన్న జనాభా 1.34 కోట్లకు పెరగడంతో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయలను తరువాయి 12లో

## అసెంబ్లీ సమావేశాలు బిఆర్‌ఎస్ బహిష్కరణ

### ప్రశ్నోత్తరాల సమయంలో తమకు అవకాశం ఇవ్వడంలేదని సభ నుంచి వెళ్లిపోయిన సభ్యులు

ప్రజాపక్షం/హైదరాబాద్



అసెంబ్లీ శీతాకాల సమావేశాలను పూర్తిగా బహిష్కరిస్తున్నట్లు బిఆర్‌ఎస్ శాసనసభా పక్షం ప్రకటించింది. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో తమకు అవకాశం ఇవ్వడంలేదని శుక్రవారం సభ నుంచి బిఆర్ఎస్ సభ్యులు వెళ్లిపోయారు. సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు గన్‌పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో బిఆర్‌ఎస్ శాసనసభా పక్షం ఉప నాయకులు టి.హరీష్‌రావు మాట్లాడుతూ తరువాయి 2లో

## శాసనసభకు కెసిఆర్ రావాలి

- సభలో బిఆర్‌ఎస్ అధిపతి మాట్లాడితేనే పార్టీకి మనుగడ
- పిల్లకాకులను సభకు పంపితే ఏం లాభం? : ఎమ్మెల్సీ కవిత

ప్రజాపక్షం/హైదరాబాద్



అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేత మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు హాజరుకావాలని ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత అన్నారు. శాసనమండలిలో మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆమె మాట్లాడుతూ సభకు వచ్చి ఆయన మాట్లాడితే బిఆర్‌ఎస్ పార్టీ బతికి బట్టకడుతుందని అన్నారు. కెసిఆర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు సమంజసం కాదని, ఉద్యమకారుడిని ఉరితీయాలని అంటే తన రక్తం మరుగుతోందన్నారు. పిల్లకాకులను సభకు పంపితే తరువాయి 2లో

## మంచినీరు కాదు..
# విషం సరఫరా



- ఇండోర్‌లో కలుషిత నీరు.. డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ధ్వజం
- గాఢ నిద్రలో యంత్రాంగం ఉన్నదని విమర్శ
- పేదలు మృత్యువాత పడినప్పుడల్లా ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారని మండిపాటు
- ప్రతి ఇల్లూ శోక సముద్రంలో మునిగిందని ఆవేదన

**న్యూఢిల్లీ :** కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెతిస్తోంది. కలుషిత నీటి కారణంగా 10 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటనపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే స్పందించారు. మధ్యప్రదేశ్‌లోని బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పేదలు చనిపోయినప్పుడల్లా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉంటారని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ దుర్పరిపాలనకు కేంద్రంగా మారిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. దగ్గు సిరప్‌లు, ప్రభుత్వ ఆసుపత్రులలో పరిశుభ్రత లోపం, ఇప్పుడు కలుషిత నీటి కారణంగా సంభవించిన మరణాల వంటి వివిధ ఘటనలను ఆయన ఉదహరించారు. 'ఇండోర్‌లో సరఫరా చేసింది నీరు కాదు, విషం, పరిపాలన గాఢ నిద్రలో ఉంది' అని ఆయన తరువాయి 12లో

అతిసారతో 10 మందిమృతి? ఇండోర్ మేయర్ పుష్పమిత్ర భార్గవ 05

## పిఎల్‌జిఎ కీలక నేత బర్సే దేవా లొంగుబాటు?



ప్రజాపక్షం/హైదరాబాద్

మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. పీపుల్స్ లిబరేషన్ గేరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ)లో కీలక స్థానం కలిగిన మావోయిస్టు నేత బర్సే దేవా తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బర్సే దేవా అలియాస్ దేవన్న , బర్సా సుక్కా చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాకి చెందిన మావోయిస్టు నేత. గిరిజన ప్రాంతానికి చెందిన అతను చిన్న వయసులోనే మావోయిస్టు సిద్ధాంతాల ప్రభావానికి లోనై అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లాడు. 2000ల ప్రారంభంలోనే సిపిఐ (మావోయిస్ట్) పార్టీలో చేరిన బర్సే దేవా, క్రమంగా ఆయుధ శిక్షణ పొందుతూ పిఎల్‌జిఎలో హార్డ్ కోర్ కేడర్‌గా ఎదిగాడు.

**పిఎల్‌జిఎలో కీలక పాత్ర..**

మావోయిస్టుల సైనిక విభాగమైన పిఎల్‌జిఎలో అత్యంత శక్తివంతమైన యూనిట్‌గా పేరొందిన బెటాలియన్–1 కు బర్సే దేవా కమాండర్‌గా వ్యవహరించాడు. ఈ బ్యాటాలియన్‌ను మావోయిస్టుల స్ట్రైక్ ఫోర్స్‌గా భావిస్తారు. భద్రతా బలాలపై దాడులు, తరువాయి 12లో



## బళ్లారిలో హింసాత్మక ఘటనలు

నలుగురిపై ఎఫ్‌ఐఆర్, విచారణకు సిఎం ఆదేశం

వివాహ సంబంధమైన కలహాలలో

## భర్త ఆర్థిక ఆధిపత్యం 'క్రూరత్వం' కాదు

05



# ప్రపంచం
WORLD NEWS

## అణు స్థావరాలు, ఖైదీల జాబితాలు
### పరస్పరం మార్చుకున్న భారత్‌-పాక్‌

**ఇస్లామాబాద్‌:** పాకిస్థాన్‌, భారత్‌ దేశాలు తమతమ అణు స్థావరాల జాబితాలను పరస్పరం మార్పిడి చేసుకున్నాయి. ఒక దేశ అణు సౌకర్యాలపై మరో దేశం దాడులు చేయకూడదని నిషేధించే ప్రత్యేక ఒప్పందం కింద ఈ మార్పిడి జరిగింది. అదే విధంగా, 2008 మే 21న కుదిరిన కాన్సులర్‌ యాక్సెస్‌ ఒప్పందం ప్రకారం రెండు దేశాలు ఖైదీల జాబితాలను కూడా పరస్పరం మార్చుకున్నాయి. 1988 డిసెంబర్‌ 31న కుదిరిన పాకిస్థాన్‌-భారత్‌ అణు స్థావరాలు, సౌకర్యాలపై దాడులను నిషేధించే ఒప్పందం ప్రకారం, రెండు దేశాలు తమ తమ అణు స్థావరాల జాబితాలను పరస్పరం మార్పిడి చేసుకున్నాయని పాకిస్తాన్‌ విదేశాంగ శాఖ ప్రతినిధి తాహిర్‌ ఆంద్రబీ వారపు ప్రెస్‌ బ్రీఫింగ్‌లో తెలిపారు. అణు స్థావరాలు, సౌకర్యాల జాబితాను విదేశాంగ శాఖలోని భారత హైకమిషన్‌ ప్రతినిధికి అందజేశామని ఆయన చెప్పారు. అలాగే, దౌత్య మార్గాల ద్వారా ఒకరినొకరి కస్టడీలో ఉన్న ఖైదీల జాబితాలను కూడా రెండు దేశాలు పరస్పరం మార్పిడి చేసుకున్నాయని ఆంద్రబీ తెలిపారు.

## అఫ్గానిస్థాన్‌లో ఆకస్మిక వరదలు
### కనీసం 17 మంది మృతి

**కాబూల్‌:** ఈ సీజన్‌లో తొలిసారిగా కురిసిన భారీ వర్షాలు, హిమపాతం దీర్ఘకాలంగా కొనసాగుతున్న తీవ్రమైన ఉష్ణోగ్రతలకు తెరదించాయి. అయితే, అదే సమయంలో అఫ్గానిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించి, కనీసం 17 మంది మరణించగా, మరో 11 మంది గాయపడ్డారని అఫ్గానిస్థాన్‌ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రతినిధి గురువారం తెలిపారు. మృతుల్లో హెరాత్‌ ప్రావిన్స్‌లోని కబ్కాన్‌ జిల్లాలో ఓ ఇంటి పైకప్పు కూలిపోవడంతో మరణించిన ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు సభ్యులు కూడా ఉన్నారని, హెరాత్‌ గవర్నర్‌ ప్రతినిధి మొహమ్మద్‌ యూసఫ్‌ సయీది తెలిపారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. వరదల బారిన పడిన జిల్లాల్లో ఎక్కువగా ప్రాణనష్టం సంభవించిందని, అలాగే ఈ తీవ్ర వాతావరణ పరిస్థితులు దేశంలోని మధ్య, ఉత్తర, దక్షిణ, పశ్చిమ ప్రాంతాలన్నింటిలోనూ సాధారణ జీవనాన్ని అస్తవ్యస్తం చేశాయని అఫ్గాన్‌ జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రతినిధి మొహమ్మద్‌ యూసఫ్‌ హమ్మద్‌ చెప్పారు. వరదల కారణంగా ప్రభావిత జిల్లాల్లో మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లిందని, పశువులు మృతి చెందాయని, సుమారు 1,800 కుటుంబాలు ప్రభావితమయ్యాయని వివరించారు. ఇప్పటికే సున్నితమైన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులు మరింత దిగజారాయని ఆయన అన్నారు. తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలకు తమ సంస్థ అంచనా బృందాలను పంపిందని, మరిన్ని అవసరాలను గుర్తించేందుకు సర్వే లు కొనసాగుతున్నాయని హమ్మద్‌ చెప్పారు. కాగా, పొరుగు దేశాలైన పాకిస్థాన్‌, భారత్‌ల మాదిరిగానే అఫ్గాన్‌ కూడా తీవ్రమైన వాతావరణ ఘటనలకు, ముఖ్యంగా సీజనల్‌ వర్షాల అనంతరం వచ్చే ఆకస్మిక వరదలు తరచు భారీ ఆస్తి నష్టాలకు, కొన్ని సందర్భాల్లో ప్రాణ నష్టాలకు కారణమవుతున్నాయి.

దశాబ్దాల పాటు సాగిన ఘర్షణలు, మౌలిక సదుపాయాల లేమి, అడవుల నరికివేత, అలాగే వాతావరణ మార్పుల ప్రభా వం పెరగడం వంటి కారణాలతో అఫ్గాన్‌ తరచు ఆకస్మిక వరదలకు గురవుతున్నాయి. ప్రత్యేకించి దూర ప్రాంతాల్లో, ఇలాంటి విపత్తుల ప్రభావం మరింత తీవ్రమవుతోంది. ఆ ప్రాంతాల్లో అనేక ఇళ్లు మట్టితో నిర్మిస్తుండడంతో, అకస్మాత్తుగా వచ్చే వరద నీటితో వీటికి తగిన రక్షణ లభించదు. 2026లో కూడా అఫ్గానిస్తాన్‌ ప్రపంచంలోనే అతిపెద్ద మానవతా సంక్షోభాల్లో ఒకటిగా కొనసాగుతుందని ఐక్యరాజ్యసమితి, ఇతర సహాయ సంస్థలు ఈ వారం హెచ్చరించాయి. దేశంలో అత్యవసర సహా యం అవసరమైన దాదాపు 1.8 కోట్ల మందికి మద్దతు అందించేందుకు, ఐక్యరాజ్యసమితి , దాని అనుబంధ సంస్థలు 1.7 బిలియన్‌ డాలర్ల సహాయ నిధుల కోసం పిలుపునిచ్చాయి.

## అమెరికాతో చర్చలకు సిద్ధం..
### వెనిజులా అధ్యక్షుడు మదురో స్పష్టం



**కారాకాస్‌:** అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు వెనిజులా అధ్యక్షుడు నికోలాస్‌ మదురో చెప్పారు. ప్రభుత్వ టెలివిజన్‌లో ప్రసారమైన ముందే రికార్డు చేసిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. అయితే గత వారం వెనిజువెలాలోని ఒక డాకింగ్‌ ప్రాంతంపై సిఐఎ నేతృత్వంలో జరిగిన దాడిపై మాత్రం వ్యాఖ్యానించేందుకు ఆయన నిరాకరించారు. ఆ ప్రాంతాన్ని మాదక ద్రవ్యాల రవాణాకు కొన్ని ముఠాలు ఉపయోగిస్తున్నాయని ట్రంప్‌ ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ దాడుల వెనుక రాజకీయ కోణం ఉందన్న వాదన బలంగా వినిపిస్తున్నది. కాగా, 'వెనిజువెలాలో ప్రభుత్వ మార్పును బలవంతంగా అమలు చేయడం, అదే విధంగా, ఆ దేశంలోని అపారమైన చమురు నిల్వలపై ఆధిపత్యం సంపాదించడమే అమెరికా లక్ష్యం' అని మదురో పునరుద్ఘాటించారు. ఇదంతా గత ఆగస్టులో కరీబియన్‌ సముద్రంలో భారీ సైనిక మోహరింపుతో ప్రారంభమై, కొన్ని నెలలుగా అమెరికా కొనసాగిస్తున్న 'ఒత్తిడి' ప్రయత్నాల్లో సిఐఎ దాడులు ఒక భాగమని వ్యాఖ్యానించారు. 'బెదిరింపులు, భయపెట్టడం, బలప్రయోగం ద్వారా తమ ఆధిపత్యాన్ని రుద్దాలని చూస్తున్నారన్నది స్పష్టంగా కనిపిస్తున్నది' అని మదురో అన్నారు. వెనిజులా శాంతిని కోరుకుంటున్నదని, కాబట్టి, అమెరికాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'నిజంగానే మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై చర్చించాలనుకుంటే, మేము సిద్ధంగా ఉన్నామనే అమెరికా ప్రభుత్వానికి తెలుసు. ఈ విషయాన్ని వారి ప్రతినిధులకు మేము పలుమార్లు చెప్పాం' అని కూడా మదురో తెలిపారు. ఒకవేళ అమెరికాకు ముడి చమురు కావాలనుకుంటే, చెవ్రాన్‌ మాదిరి, అమెరికా పెట్టుబడులను ఆహ్వానిస్తామని అన్నారు. చర్చల గురించి ప్రస్తావిస్తూ, 'ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏ విధంగానైనా సిద్ధమే' అన్నారు. ప్రపంచంలోనే అత్యధికంగా నిరూపిత చమురు నిల్వలు వెనిజువెలాకు ఉన్నాయి. ఆ కారణంగానే అమెరికా తన దృష్టి ఈ దేశంపై కేంద్రీకరించిందనే అనుమానాలు ఉన్నాయి. డ్రగ్‌ ట్రాఫికింగ్‌ నెపంతో సిఐఎ నేరుగా దాడికి దిగడం వెనిజులాను బెదరించే ప్రయత్నాల్లో భాగమేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అమెరికాకు డ్రగ్స్‌ ట్రాఫికింగ్‌ అనుమానాలు ఉంటే, వెనిజులాతో చర్చ లు జరిపి, సంయుక్తంగా నివారణ చర్యలకు ఉపక్రమించాలన్న సూచనలు కూడా ఉన్నాయి.

## దుర్మార్గం (మొదటి పేజీ తరువాయి)

డిమాండ్‌ చేశారు. నాడు మహాత్మాగాంధీని గాడ్సే హత్య చేస్తే నేడు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గాంధీని రెండవసారి హత్యచేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్‌) అంశంపై శుక్రవారం జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఈ పథకాన్ని యధాతథంగా అమలు చేయాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని చేసి కేంద్రానికి పంపించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారంటే అందుకు కారణం ఉపాధి హామీ పథకమేనన్నారు. కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఉపాధి హామీ పథకం పేరు ఎందుకు మార్చాల్సి వచ్చిందో కేంద్రం ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్‌ చేశారు. చట్టం లో మార్పులు చేర్పులు చేయాలనుకుంటే ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించాలి సవరించుకోవచ్చుని, కానీ చట్టం పేరు మార్చడంలో ఏదో మర్మం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ హక్కు చట్టం 2005లో కమ్యూనిస్టుల మద్దతుతో అప్పటి మొదటి యుపిఎ సర్కారు తీసుకువచ్చిందన్నారు. ఈ బిల్లు రూపకల్పనలో కమ్యూనిస్టు అగ్రనేతలు సురవరం సుధాకర్‌ రెడ్డి, గురుదాస్‌ దాస్‌గుప్తా, సీతారామ్‌ ఏచూరి లాంటి వారు పాలుపంచుకుని రూపుదిద్దారన్నారు. దేవుడు గుడిలో ఉండాలి, మహాత్ముడు ప్రజల్లో ఉండాలన్నారు. గతంలో వ్యవసాయనికి సంబంధించి నాలుగు నల్ల చట్టాలను తీసుకువచ్చిన కేంద్రం ప్రజా ఉద్యమంతో దేశానికే క్షమాపణ చెప్పాల్సిన వచ్చిందని, ఉపాధి హామీ పథకాన్ని యధాథతంగా అమలు చేయకపోతే తిరిగి అదే గతి పడుతుందని కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మైండ్‌ సెట్‌ మార్చుకోవాలని కూనంనేని సాంబశివరావు అన్నారు. లేకపోతే ఇంత గొప్ప చట్టం మార్పులు చేర్పులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం లోని బిజెపి ప్రభుత్వంలోని పెద్దలకు అదానీ, అంబానీల మీద ప్రేమ తప్ప ఏ ఒక్కరిపైనా లేదన్నారు. దేశంలో కేవలం 4.5 శాతం మాత్రమే పేదరికం ఉందని చెప్పడమేమిటన్నారు. గ్రామీణ ప్రాంతంలో రోజువారి ఆదాయం రూ.38, పట్టణ ప్రాంతాల్లో రూ.40లు ఉంటే వారు సంపన్నులని పేర్కొన్నడం అవివేకం అన్నారు. ఐక్య రాజ్య సమితి ఆకలి సూచి మన దేశం 117 స్థానంలో ఉందని దీనికి ఎవరూ బాధ్యులో చెప్పాలని డిమాండ్‌ చేశారు. జిఎస్‌టి పేరుతో రాష్ట్రాలను కొల్లగొట్టి ఇప్పటికే దివాళా తీయించిన కేంద్రం మళ్లీ ఉపాధి హామీ పథకం భారాన్ని రాష్ట్రాలపై మోపడం సరికాదన్నారు. బిల్లు రాకముందే ఉపాధి హామీ పథకం నుంచి 16లక్షలమంది పేర్లను తొలగించారని, అదేవిధంగా గత ఏడాది బడ్జెట్‌లో నరేగాకు రూ.1.30లక్షల కోట్లు కేటాయించి, రూ.80వేల కోట్లకు కుదించారని విమర్శించారు.

**బిజెపి ఎవరినైనా ఏమైనా అనవచ్చా :** బిజెపి నేతలు ఏ పార్టీ నేతనైనా, ఎవరినైనా ఏమైనా అనవచ్చా అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఇతరులు మాత్రం బిజెపి వారిని ఏమి అనకూడదా అన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి బిజెపి వ్యవహారం ఉల్టా చోర్‌ ... కోత్వాల్‌కో డాంటే ...అన్నట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. బిజెపి సభ్యులు సభతో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు యత్నించడంతో కూనంనేని సాంబశివ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపట్ల తను ఎలాంటి అగౌరవ వ్యాఖ్యలు చేయలేదని ఉపాధి హామీ పథకాన్ని మార్చడం కర్టెకేనా అని బిజెపి సభ్యు లు తమ మనుస్సును ప్రశ్నించుకోవాలని సూచించారు.

**అటవీ సంపదను కొల్లగొట్టేందుకే నక్సలైట్ల హననం**

కాంగ్రెస్‌ అటవి సంపదను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల హననానికి పునుకుందని కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న మార్చి నాటికి మావోయిస్టులను లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం అందులో భాగంగానే హిడ్మాను చంపివేసిందన్నారు. ఆ వెంటనే చత్తీస్‌గఢ్‌లో అటవి సంపదను ఆదానికి దార దత్తం చేయడంతో మైనింగ్‌ పేరుతో లక్షలాది చెట్లను నరికి వేస్తున్నారన్నారు. అదేవిధంగా ఆరావళి పర్వత శ్రేణులను సైతం ఆదానికి ఈ కేంద్ర ప్రభుత్వం అప్ప జెప్పడం దుర్మార్గమని చెప్పారు.

## మిమ్మల్ని గుర్తుచేసుకుంటున్నాం..
### ఖాలిద్‌కు న్యూయార్క్‌ సిటీ మేయర్‌ మమ్దానీ లేఖ

**న్యూయార్క్‌:** 'కాఠిన్యం మనల్ని మనమే నాశనం చేసుకునే పరిస్థితిని కల్పిస్తుంది. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి' అని సామాజిక కార్యకర్త ఉమర్‌ ఖాలిద్‌ చెప్పిన మాటలు తనకు తరచు గుర్తుకొస్తుంటాయని న్యూయార్క్‌ సిటీ మేయర్‌ జోహ్రాన్‌ మమ్దానీ పేర్కొన్నారు. ఖాలిద్‌కు రాసిన లేఖలో ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఖాలిద్‌ తల్లిదండ్రులను కలవడం ఆనందంగా అనిపించిందని, తామంతా ఆయనను గుర్తుచేసుకుంటున్నామని ఆ లేఖలో తెలిపారు. మమ్దానీ స్వదస్తూరీలో ఉన్న ఈ లేఖను ఖాలిద్‌ భాగస్వామి బనోజ్యోత్స్న లహిరి 'ఎక్స్‌' వేదికపై పోస్ట్‌ చేశారు. 2020 ఫిబ్రవరిలో జరిగిన ఢిల్లీ అల్లర్లకు సంబంధించి 'సూత్రధారులు' అన్న ఆరోపణలతో ఉమర్‌ ఖాలిద్‌పై యుఎపిఎ (ఉపా), ఐపిసి చట్టాల కింద కేసులు నమోదు అయ్యాయి. అప్పటి హింసలో 53 మంది మరణించగా, 700 మందికిపైగా గాయపడ్డారు. ఇదిలా ఉండగా, జిమ్‌ మెక్‌గవర్న్‌, జేమీ రాస్కిన్‌ సహా అమెరికా కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది శాసనసభ్యులు ఖాలిద్‌కు బెయిల్‌ మంజూరు చేయాలని కోరారు. న్యాయమైన విచారణను త్వరితగతి జరిపించాలని కోరుతూ భారత రాయబారి వినయ్‌ క్వాత్రాకు లేఖ రాశారు. ఖాలిద్‌పై ఐదేళ్లుగా బెయిల్‌ లేకుండా కొనసాగుతున్న నిర్బంధం అంతర్జాతీయ న్యాయ ప్రమాణాలకు విరుద్ధంగా ఉండొచ్చని మానవ హక్కుల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణలో ఉందని, సోదరి వివాహానికి హాజరయ్యేందుకు ఖాలిద్‌కు తాత్కాలిక బెయిల్‌ లభించడాన్ని స్వాగతిస్తున్నామని శాసనసభ్యులు తెలిపారు. విచారణ పూర్తయ్యే వరకు ఖాలిద్‌కు బెయిల్‌ మంజూరు చేయాలని వారు కోరారు.

**మమ్దానీ ప్రమాణస్వీకారం :** మాన్హాటన్‌లోని చారిత్రక, సేవల నుండి తొలగించిన సబ్‌వే స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి జోహ్రాన్‌ మమ్దానీ న్యూయార్క్‌ నగర మేయర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. డెమోక్రాట్‌ అయిన మమ్దానీ, ఖురాన్‌పై చేయి ఉంచి ప్రమాణం చేయడంతో అమెరికాలోని అతిపెద్ద నగరానికి తొలి ముస్లిం మేయర్‌గా నిలిచారు. 'ఇది నిజంగా నా జీవితంలో లభించిన అత్యున్నత గౌరవం, అపూర్వమైన అవకాశం' అని మమ్దానీ అన్నారు. న్యూయార్క్‌ నగరానికి తొలి ముస్లిం మేయర్‌ కావడమే కాకుండా, దక్షిణ ఆసి యా వంశావళి నుంచి వచ్చిన తొలి మేయర్‌ కూడా ఆయనే కావడం గమనార్హం. 34 ఏళ్ల వయస్సులో ఆయన రికార్డు సృష్టించారు. 'అందుబాటు ధరలు' అనే అంశాన్ని తన ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా పేర్కొన్న ఆయన, ఉచిత శిశు సంరక్షణ, ఉచిత బస్సులు, సుమారు 10 లక్షల గృహాలకు అద్దె పెంపును నిలిపివేయడం, నగర నిర్వహిత కిరా ణా దుకాణాల పైలట్‌ ప్రాజెక్టు వంటి అంశాలు తన ప్రణాళికలో చేర్చారు. ప్రజా ప్రతినిధిగా పోటీ చేయడానికి ముందు, నగరంలో డెమోక్రటిక్‌ అభ్యర్థుల రాజకీయ ప్రచారాల్లో మమ్దానీ పని చేశారు. 2020లో క్వీన్స్‌లోని ఒక ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర అసెంబ్లీ సీటును గెలుచుకున్నారు.

## జీవితకాలం టాక్స్‌ విధానం
### మంత్రి పొన్నం ప్రభాకర్‌

**ప్రజాపక్షం/హైదరాబాద్‌ :** రాష్ట్రంలో తేలికపాటి సరుకు రవాణా వాహనాలకు సంబంధించి ఉన్న త్రైమాసిక రోడ్డు పన్ను చెల్లింపు విధానాన్ని జీవిత కాల టాక్స్‌గా 7.5 శాతం మార్పు చేస్తూ చట్టం తీసుకు వచ్చామని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ తెలిపారు. అదేవిధంగా రోడ్‌ భద్రతా సెన్స్‌ను కూడ అమల్లోకి తీసుకువస్తున్నామని చెప్పారు. తెలంగాణ మోటారు వాహనాల పన్ను సవరణ 2025 బిల్లుపై శాసనసభలో జరిగిన చర్చకు మంత్రి పొన్నం ప్రభాకర్‌ సమాధానం ఇచ్చారు. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కి సంబంధించిన వాహనాలపై లైఫ్‌ టాక్స్‌ విధిస్తూ 7.5 శాతానికి చేయడం జరిగిందని, ఇది కొత్తగా రిజిస్ట్రేషన్‌ అయ్యే వాహనాలకు మాత్రమే వర్తిస్తుందన్నారు అదేవిధంగా సుప్రీం కోర్టు ఆదేశాలతో రోడ్‌ సేఫ్టీ పై సెస్‌ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్‌ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారు. దీనిని రాష్ట్రంలో కూడ అమలు చేయబోతున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు రూ. 2 వేలు, లైట్‌ మోటార్‌ వాహనాలకు రూ.5 వేలు , హెవీ వాహనాలకు రూ. 10 వేలు రోడ్‌ సేఫ్టీ సెస్‌ కింద వసూళ్లు చేయనున్నామని ఇది కూడ కొత్తగా రిజిస్టర్‌ అయ్యే వాహనాలకు మాత్రమే రోడ్‌ సేఫ్టీ సెస్‌ విధించడం జరుగుతుందని చెప్పారు.

ఆటోలు ,ట్రాక్టర్‌ ట్రైలర్లకు ఇది వర్తించదని వెల్లడించారు. చర్చలో భాగంగా బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలను బిల్లును పాస్‌ చేయించుకోవడం కోసం మాత్రమే నడుపుతున్నట్లు ఉంది ప్రజా సమస్యల చర్చించనట్లుగా లేదన్నారు. చర్చ అనంతరం ఈ బిల్లును శాసనసభ ఆమోదించింది.

## పునరుద్ధరించాలి (మొదటి పేజీ తరువాయి)

నెరవేర్చేందుకు మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా కొనసాగించాలి'' అని శాసనసభ తీర్మానించింది. ఈ మేరకు శుక్రవారం శాసనసభలో ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌ రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఈ అంశంపై చర్చ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ''కొత్త చట్టం పేదల హక్కులకు వ్యతిరేకంగా ఉంది. ఉపాధి హామీ చట్టం అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. డిమాండ్‌కు అనుగుణంగా పనుల ప్రణాళికను తయారు చేసే విధానానికి స్వస్తి పలికింది. డిమాండ్‌ ఆధారితపాత విధానాన్ని కొనసాగించాలి. కొత్త చట్టం మహిళా కూలీలకు వ్యతిరేకంగా ఉంది. ఇప్పుడు అమల్లో ఉన్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంలో దాదాపు 62 శాతం మహిళలు లబ్ధి పొందేవారు. కొత్త చట్టంలో పొందుపరచిన పరిమిత కేటాయింపుల విధానం వల్ల పని దినాలు తగ్గిపోతాయి. దీంతో పేద కుటుంబాల్లోని మహిళలు నష్టపోతారు. మహిళా సహకారిత సాధించాలంటే పాత విధానం పునరుద్ధరించాలి. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో పూర్తిగా కేంద్రమే నిధులు కేటాయించేది. కొత్త చట్టం ద్వారా కేంద్ర, రాష్ట్ర నిధుల వాటా 60: 40 శాతంగా మార్చడం సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతుంది. పాత విధానాల వాటా నమూనాను పునరుద్ధరించాలి. మహాత్మా గాంధీ పేరును ఈ పథకం నుంచి తొలగించడంతో గాంధీ స్ఫూర్తిని నీరుగాచినట్లయింది. మహాత్మా గాంధీ పేరును పునరుద్ధరించాల్సిందిగా ఈ సభ తీర్మానం చేస్తుంది. వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల విరామం తప్పనిసరిగా విధించడంతో భూమి లేని నిరుపేద కూలీలకు అన్యాయం జరుగుతోంది. ఉపాధి హామీ పథకాన్ని సంవత్సరం పొడవునా కొనసాగించాలి. ప్రస్తుతం ఉపాధి హామీ ద్వారా 2006 రకాల పనులు చేపట్టే వెసులుబాటు ఉంది. కొత్త చట్టంలో భూముల అభివృద్ధి అంటే శ్రమ ఆధారిత పనులను తొలగించడంతో చిన్న సన్నకారులు రైతులు దళితులు గిరిజనులు తీవ్రంగా నష్టపోతారు. ఇప్పుడున్న పనుల జాబితాను యధావిధంగా కొనసాగించాలి. గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించేందుకు డాక్టర్‌ మన్మోహన్‌ సింగ్‌ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం సోనియా గాంధీ యూపీఏ చైర్పర్సన్‌గా 2005లో 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' అమలులోకి తీసుకువచ్చింది. పేదరికం, నిరుద్యోగం, వలసలు, నైపుణ్యంలేని శ్రామికవర్గాల దోపిడీ, స్త్రీ, పురుషుల మధ్య వేతన సమానత్వలను తగ్గించి అన్ని వర్గాల అభివృద్ధి కోసం తెచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2006 ఫిబ్రవరి 2 నుంచి అమలులోకి వచ్చింది. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి కనీసం వంద రోజుల ఉపాధి కల్పించి కనీస వేతనం అందించే గ్యారెంటీ ఈ చట్టం ప్రధాన లక్ష్యం. గత 20 సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో లబ్ధి పొందిన వారిలో సుమారు 90 శాతం ఎసీలు, ఎస్‌టిలు, బిసిలు ఉన్నారు. వీరిలో 62 శాతం మహిళలు లబ్ధి పొందారు. దళితులు గిరిజనులు దివ్యాంగులు అత్యంత వెనుకబడిన తెగల చెందిన ఆదివాసీలు, చెంచులు, పేద వర్గాలు ఎక్కువగా ఈ పథకంలో ప్రయోజనం పొందారు'' అని వివరించారు.

## సమావేశాలకు రావాలి
(మొదటి పేజీ తరువాయి)

ఏం లాభం అంటూ కెటిఆర్‌, హరీష్‌రావుపై ఆమె పరోక్షంగా సెటైర్లు వేశారు. పార్టీని మోసం చేసిన వాళ్లకే డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌ పదవిలిచ్చారని ఫైర్‌ అయ్యారు. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు బిఆర్‌ఎస్‌దేనని, ఈ తప్పిదం కూడా బిఆర్‌ఎస్‌దేనని ఆమె స్పష్టం చేశారు. కెసిఆర్‌ తప్పు చేయకపోతే అసెంబ్లీకి ఎందుకు రావట్లేదు, ఆయన వల్లే ప్రాజెక్ట్‌ దెబ్బతిన్నది. పాలమూరులో ఆరోపణలు ఎదుర్కొన్న వారికే మళ్లీ పదవులు ఇచ్చారు. నా రాజీనామాను ఆమోదించే ముందు కౌన్సిల్‌లో నాకు అవకాశం ఇవ్వాలి' అని ఆమె అన్నారు. బిఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయంగా జాగృతియే నిలుస్తుందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును పక్కన పెట్టిన కెసిఆర్‌ను ఉరి తీయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కవిత స్పందిస్తూ కెసిఆర్‌ను ఒకసారి ఉరి తీయాలంటే, రేవంత్‌ రెడ్డిని పది సార్లు ఉరి తీయాలంటూ మండిపడ్డారు. బిఆర్‌ఎస్‌కు తనకు సంబంధం లేదని, ఇక ముందు కూడా ఉండబోదని కవిత స్పష్టం చేశారు.

## బిఆర్‌ఎస్‌ బహిష్కరణ
(మొదటి పేజీ తరువాయి)

స్పీకర్‌ ఏకపక్ష వైఖరి, ప్రభుత్వ అప్రజాస్వామిక ధోరణికి నిరసనగా అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బిఆర్‌ఎస్‌ పార్టీ బహిష్కరించిందన్నారు. మూసీ కంపు కంటే సిఎం మాటల కంపు ఎక్కువైందని ఆరోపించారు. మూసీ ప్రక్షాళన కాదని, ముందు సిఎం నోరు ప్రక్షాళన చేయాలన్నారు. రాహుల్‌ గాంధీ దేశమంతా రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరుగుతుంటే ఇక్కడ రేవంత్‌ రెడ్డి మాత్రం అసెంబ్లీ సాక్షిగా రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని, ఇదేనా కాంగ్రెస్‌ తీరు? అని ప్రశ్నించారు. శాసనసభ నడుస్తున్న తీరు ప్రజాస్వామ్య విలువలకు పూర్తిగా విరుద్ధంగా ఉందని, బిఎసి సమావేశానికి మమ్మల్ని గంటన్నర సేపు వెయిట్‌ చేయించి అవమానించారన్నారు. సభను 7 రోజుల పాటు నడపాలని, ఆ తర్వాత మళ్ళీ సమావేశమై తదుపరి షెడ్యూల్‌ నిర్ణయిద్దామని స్పష్టంగా అనుకున్నామని ఆయన తెలిపారు. అయితే సభలో ప్రవేశపెట్టిన బిఎసి మినిట్స్‌లో మాత్రం సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్‌ నిర్ణయానికే వదిలేస్తున్నామని, తప్పుడు సమాచారం పొందుపరిచారన్నారు. 'పార్లమెంట్‌లో ప్రధాని మోదీని రాహుల్‌ గాంధీ విమర్శించలేదా? మరి ఇక్కడ మేము సిఎంను ప్రశ్నిస్తే మైక్‌ ఎందుకు ఆపేస్తున్నారు? ముఖ్యమంత్రిని విమర్శించవద్దని స్పీకర్‌ మాకు రూల్స్‌ చెప్పడం ఎక్కడి పద్ధతి. ప్రతిపక్షం మాట్లాడకూడదంటే అసలు సభ ఎందుకు? మమ్మల్ని ఎందుకు పిలిచినట్లు? రేవంత్‌రెడ్డి ఒక ముఖ్యమంత్రిలా కాకుండా వీధి రౌడీలా ప్రవర్తిస్తున్నారు. అసెంబ్లీని సిఎల్‌పి మీటింగ్‌లా, గాంధీభవన్‌లా మార్చేశారు' అని హరీష్‌ రావు ఆరోపించారు.

## ఐదు దశల్లో... (మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్‌ రెడ్డి స్పందించారు. రూ.7 వేల కోట్ల వ్యయంతో 20 టిఎంసిల గోదావరి నీటిని హైదరాబాద్‌ నగరానికి తరలించాలని, ఇందులో హైదరాబాద్‌ ప్రజల దాహార్తి తీర్చేందుకు 15 టిఎంసిలు, మరో 5 టిఎంసిలు గండిపేటకు తరలించేందుకు ప్రణాళికను రూపొందించామని సిఎం తెలిపారు. మూసీనది అనంతగిరి హిల్స్‌ నుంచి వాడపల్లి వరకు 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందని, ఇందులో ఏడాది మొత్తం నీరు ప్రవహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోట బాపుఘాట్‌ను నిర్మించి, గాంధీ సరోవర్‌ ప్రాజెక్ట్‌ను చేపట్టామన్నారు. మూసీ ప్రాజెక్ట్‌ మొదటి దశ డిపిఆర్‌పై సంక్రాంతి పండగ వరకు ఒక స్పష్టత వస్తుందని, ఆ తర్వాత సిఎం కార్యాలయంలో ప్రతిపక్ష నాయకులను, ఎంఎల్‌ఎలను ఆహ్వానించి పవర్‌పాయింట్‌ ప్రజంటేషన్‌ ఇస్తామన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల వరకు ఎలివేటెడ్‌ కారిడార్‌ను నిర్మిస్తామని, నార్సింగి, బాపూఘాట్‌, చార్మినార్‌, చాదర్‌ఘాట్‌, నాగోల్‌ వద్ద జంక్షన్లను ఏర్పాటు చేస్తామని, ప్రతి జంక్షన్‌లో ట్రంపెట్ల ద్వారా ఒఆర్‌ఆర్‌ నుంచి సిటీలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మూసీ ప్రాజెక్ట్‌లో భాగంగా శివాలయాన్ని నిర్మిస్తామని, అంతర్జాతీయ స్థాయిలో మక్కా మసీదును, సిక్కు మందిరాన్ని, ఉప్పల్‌లో మెదక్‌ తరహా చర్చిని నిర్మించి మత సమ్మేళాన్ని చేపడుతామని ప్రకటించారు. గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలోని ఎంఎల్‌ఎలు విదేశాలలో పర్యటించి, తమ నియోజకవర్గాలలో ఎటువంటిఅభివృద్ధి చేపట్టాలి?, ప్రజలకు ఏం చేస్తే బాగుటుందో సలహాలు ఇవ్వాలని సిఎం సూచించారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలన్నదే తమ సంకల్పమని, అందుకు అందరూ సహకరించాలని సూచించారు. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేలు కుటుంబాలను ఆ ప్రాంతం నుంచి తరలించారని, యుపిలో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారని, నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బిజెపి తమ ఎన్నికల అజెండాగా మార్చిందని, ఈ విషయాలను బిజెపి నాయకులు ఎంతో గొప్పగా చెప్పుకుంటారని గుర్తు చేశారు. ఆ రాష్ట్రాలల్లో నదుల ప్రక్షాళనను కాంగ్రెస్‌ పార్టీ వ్యతిరేకించలేదని, నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపాలని మాత్రమే తాము అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలను కో రామని రేవంత్‌ రెడ్డి గుర్తు చేశారు. హైదరాబాద్‌లోని మురుగు కాలువలను మూసీ నదికి కలుపడంతో మూసీ నది కలుషితమై నల్లగొండ జిల్లా ప్రజలకు ఒక శాపంగా మారిందని సిఎం రేవంత్‌ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

**మనుషుల కడుపులో విషం మూసీ కంటే అత్యంత ప్రమాదం :** మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమని సిఎం రేవంత్‌ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలకు వాస్తవాలు తెలియకుండా, దీనిపై చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. వారి కళ్లకు ఒక వేళ శక్తి ఉంటే, ఆ విషం కళ్లతో చూస్తే మొత్తం కాలి బూడిదయ్యేలా చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇలాంటి వారిని చికిత్స నిమిత్తం 'వికారాబాద్‌కు (ఆస్పత్రి) తరలించి ఆ వాతావరణంలో చికిత్స అందించాలన్నారు. కొంతమంది తనను రియల్‌ ఎస్టేట్‌ బ్రోకర్‌ అంటున్నారని, రియల్‌ ఎస్టేట్‌ కూడా ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. నాటి సిఎం నెదురుమల్లి జనార్ధన్‌ రెడ్డి హైటెక్‌ సిటీ శంకుస్థాన చేసినప్పుడు రియల్‌ వ్యాపారం అంటూ ఇలాంటి విమర్శలే చేశారని గుర్తు చేశారు. నిత్యం పట్టణీకరణ పెరుగుతుందని, రానున్న 20 ఏళ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందన్నారు. పేదలకు మంచి వసతులు కల్పించి, పాఠశాలల, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తాము చెబుతుంటే, కాదు అలాగే ఉండాలని, వాళ్లు(బిఆర్‌ఎస్‌) అలాగే ఉండాలని, తాము అడ్డంగా పండుకుంటామని చెప్పారని, ఇటీవల వర్షాలు వస్తే ఎందుకు పండుకోలేదని ప్రశ్నించారు. ఐదేళ్లలో హైదరాబాద్‌ నగరంలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చుపెడుతామని, మూసీని ప్రక్షాళన చేస్తామని తాను చెబితే, రూ. 1.50 లక్షల కోట్ల ప్రాజెక్ట్‌ను కాంట్రాక్ట్‌కు ఇచ్చారని, రూ.25 వేల కోట్లు తినేశారని తప్పుడు ఆరోపణలు చేశారని సిఎం మండిపడ్డారు.

కాంట్రాక్టులు ఇచ్చుడు, కమీషన్లు కొట్టుడు, లిఫ్టులు, పంపులు పెట్టుడు, ఇండ్లలో కనక వర్షం కురిపించుకునుడు, అక్కడి నుంచి జెన్వాడ, మొయినాబాద్‌లో ఫామ్‌ హౌజ్‌లు కట్టుకునుడు తప్ప 'మీరు' (బిఆర్‌ఎస్‌ ప్రభుత్వం) చేసింది ఏముందని సిఎం ప్రశ్నించారు. ఆగర్భ శ్రీమంతులు కట్టుకున్న ఫామ్‌హౌస్‌లో ఉన్న డ్రైనేజీ కనెక్షన్లను గండిపేట, హిమాయత్‌సాగర్‌లో కలిపారని, వీటిపై తాము ఉక్కుపాదంమోపి, డ్రైనేజీలను కూలగొట్టి చర్యలు తీసుకున్నందుకు, జెన్వాడ, మొయినాబాద్‌ ఫామ్‌హౌస్‌లు నిర్మించుకున్న వారు లక్షలు, కోట్ల రూపాయల ఖర్చుతో తనపై సోషల్‌ మీడియా ద్వారా దాడి చేశారని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశా రు.

**మార్చిలో పనులు ప్రారంభం : మంత్రి శ్రీధర్‌బాబు**

మూసీ ప్రాజెక్టు పనులు ఫిబ్రవరి, మార్చి మాసంలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని శాసన సభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ మూసీ డిపిఆర్‌ రూపకల్పన జరుగుతోందన్నారు. డిపిఆర్‌ లేకుండానే అనేక ప్రాజెక్టులు నిర్మించారని మంత్రి ఎద్దేవా చేశారు.

## మరో 2 ప్రైవేట్‌ 'వర్సిటీ'లు! (మొదటి పేజీ తరువాయి)

విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధం సవరణ చట్టం 2025 బిల్లును సిపిఐ పూర్తిగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. విద్యా ప్రైవేటీకరణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ విశ్వవిద్యాలయాలకు ద్వారాలను బారులుగా తెరుస్తుండడంతో విద్య సామాన్యులకు అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్‌ విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ నిబంధనలను ఏమాత్రం పాటించడంలేదని ఇష్టారీతిలో ఫీజులు వసూలు చేస్తూ దోపిడికి తెగబడుతున్నాయన్నారు. విద్యా ప్రైవేటీకరణకు సిపిఐ పూర్తిగా వ్యతిరేకమని సాంబశివరావు స్పష్టం చేశారు.

**అన్ని పక్షాలు ఆమోదం తెలపాలి : మంత్రి దామోదర్‌ రాజ నర్సింహ్మా**

సభలో తొలుత బిల్లును మంత్రి దామోదర్‌ రాజనర్సింహా ప్రవేశపెడుతూ రాష్ట్రంలో కొత్తగా సెయింట్‌ మేరీస్‌ రీహబిలిటేషన్‌ విశ్వవిద్యాలయం, అమిటీ విశ్వవిద్యాలయాలకు చట్టబద్ధ అనుమతిని ఇస్తూ సవరణ బిల్లును తీసుకువచ్చామని తెలిపారు.

సెయింట్‌ మేరీస్‌ రిహాబిలిటేషన్‌ విశ్వవిద్యాలయం దక్షిణ భారతదేశంలోనే మొదటిదని ఈ బిల్లుకు అన్ని పక్షాలు ఆమోదం తెలపాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ఎంఐఎం శాసనసభాపక్ష నాయకులు అక్బరుద్దీన్‌ ఓవైసీ మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేస్తున్న విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు రిజర్వేషన్లకు కల్పించడంతోపాటు పేదవర్గాలకు చెందిన విద్యార్థలకు కొంతమేరకైనా ఫీజు రాయితీలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బిజెపి సభ్యులు అమిటీ విశ్వవిద్యాలయం పై ఇప్పటికే పలు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో విద్యార్థులు దోపిడికి గురి కాకుండ ప్రభుత్వం కచ్చితమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సేవా దృక్పతంతో ఉండాల్సిన విద్యా సంస్థలన్న రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా విద్యను వ్యాపారంగా మార్చి డబ్బు సంపాదన ధ్యేయంగా పనిచేయడం శోచనీయమన్నారు.

## ఉన్నతస్థాయి కమిటీ
(మొదటి పేజీ తరువాయి)

అదనంగా కృష్ణానదీ యాజమాన్య బోర్డు, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల చైర్మన్‌లు సభ్యులు గా ఉంటారు. కేంద్ర జలశక్తి మంత్రి సి.హెచ్‌. పాటిల్‌ అధ్యక్షతన 2025 జూలై 16న తెలంగా ణ, ఆంధ్రప్రదేశ్‌ ముఖ్యమంత్రులతో న్యూఢిల్లీలో అపెక్స్‌ కౌన్సిల్‌ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇరువురు ముఖ్యమంత్రులు పెండింగ్‌లో ఉన్న నీటి వివాదాలను ప్రస్తావించారు. దీని తరువాత అపెక్స్‌ కౌన్సిల్‌ సాంకేతిక పరిశీలన, చర్చల కోసం కేంద్రం, రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన ఒక సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

## అసెంబ్లీ సమావేశాలు



## ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై 'అసెంబ్లీలో' చర్చ జరపాలి

**తెలంగాణ మంత్రులకు ఆర్‌టిసి జెఎసి నాయకుల విజ్ఞప్తి**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించి, వెంటనే పరిష్కరించాలని ఆర్‌టిసి జెఎసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి ఆర్‌టిసి సమస్యలను క్షుణ్ణంగా వివరించడం జరిగిందన్నారు. తెలంగాణ మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వర రావు, జూపల్లి కృష్ణారావుతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ను కలిసి ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరారు. ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్‌రెడ్డి, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి, జె.రాఘవులు, ఎన్.కమలాకర్ గౌడ్, బి.జ్యోతి, ఎం.ఎ. మజీద్, బుద్ధ విశాల్, బి.రాములు, బి.శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



## ● అసెంబ్లీ మీడియా పాయింట్

### చర్చకు రాకపోతే హరీశ్ తప్పు చేసినట్టే: మంత్రి వాకిటి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిన్న చిన్న విషయాలపై అరిచి గగ్గోలు చేసే హరీశ్‌రావు తోక ముడిచి ఎందుకు వెళ్ళిపోయారో సమాధానం చెప్పాలి అని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... కృష్ణా జలాలపై అసెంబ్లీలో బిఆర్ఎస్ చర్చకు రావాలి .. హరీష్ రావు చర్చకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టేనన్నారు. బిఆర్ఎస్ వాళ్ళు వాళ్ళ ఇంట్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చుకుంటే ఏమి వస్తుంది అని ప్రశ్నించారు. ఎప్పుడు సందర్భం దొరుకుతుందో వెంటనే సభ బైకాట్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ వాళ్ళున్నారన్నారు. కృష్ణా జలాలపై బిఆర్ఎస్ పార్టీ తెలంగాణకు అన్యాయం చేస్తూ 299 టిఎంసిలు చాలు అని ఒప్పుకున్న విషయంపై సభలో మాట్లాడుతామోనని సభ బైకాట్ చేసారని తెలిపారు. సభలో మైక్ ఇస్తే ఎంతసేపు ముఖ్యమంత్రి తిడుదామనే తప్ప బిఆర్ఎస్ వాళ్లకు చర్చ చేయాలని మాత్రం లేదని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు చేయలేదా? : మంత్రి జూపల్లి**



2018లో అధికారంలో ఉన్న బిఆర్ఎస్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్ కుమార్‌లు అసెంబ్లీలో గొడవ చేశారని సభ్యత్వం రద్దు చేసిన విషయం హరీష్ రావు మరిచిపోయారా? అని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. ఆనాటి ప్రతిపక్షం మైక్ ఇవ్వకపోతే సెషన్ బహిష్కరణ చేయలేదు అని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి మాట్లాడిన నీటి వాటా అంశాలపట్ల చర్చ పెడదాం అని చెప్పిన తరువాత వారి బండారం బయట పడుతుందనే భయంతో బిఆర్ఎస్ బాయ్ కాట్ చేసిందని ఆరోపించారు. అసలు వాస్తవాలు, వారి సంతకాలు, బండారం బయట పడుతుందనే శాసన సభకు రాకుండా తప్పించుకోవడానికి చేసిన డ్రామా కనబడుతుందని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం లక్ష కోట్లు పెట్టి, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలు 25 శాతం కూడా పూర్తి చేయలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి కుమ్మక్కు అయినా మెజారిటీ స్థానాలు గెలవలేదని తెలిపారు. మూసీ రివర్‌పై మైక్ ఇవ్వకపోతే సెషన్ బాయ్ కాట్ చేయడం రాజకీయ పబ్బం గడుపుకోవడమేనని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ చేసిన అప్పులకు నెలకు రూ.6 వేల కోట్లు వడ్డీలు కడుతున్నామన్నారు.

**బిజెపి దోస్తీ వల్ల బిఆర్ఎస్ బాయ్‌కాట్: విప్ ఆది శ్రీనివాస్**



డిప్యూటీ ఫ్లోర్ లీడర్ చర్చలో పాల్గొనకుండా అసెంబ్లీ నుండి పారిపోయారని, ఎవరికి మైక్ ఇచ్చినా నేనే మాట్లాడతా అనే ధోరణిలో హరీష్ రావు వ్యవహరించారని ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరు తొలగించిన అంశంపై చర్చ ఉంది, బిజెపితో ఢిల్లీలో దోస్తీ ఉన్న కారణంగా అసెంబ్లీలో మాట్లాడాల్సి వస్తుందనే వారి బంధం పోతుందని బిఆర్ఎస్ బాయ్‌కాట్ చేసిందని ఆరోపించారు. కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి కృష్ణా జలాలపై అసెంబ్లీలో మాట్లాడాలి అని కూతురు కవిత అంటున్నదన్నారు. అవినీతి లేకపోతే అసెంబ్లీలో చర్చలో పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఎక్కడ వారు దోచుకున్న సొమ్ము, అవినీతి బయట పడుతుందనే శాసనసభ బాయ్‌కాట్ చేశారని ఆయన బిఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు.

**కెసిఆర్ కుటుంబ రాజకీయాలు శాసనసభకు పాకాయి: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

కెసిఆర్‌కు తెలియకుండా ఈరోజు బాయ్‌కాట్ జరిగింది అని నేను అనుకోను.. కృష్ణా జలాలపై దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టాలి అని అంటే పెట్టాం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిన్న విషయాలకు సెషన్ బాయ్ కాట్ చేయడం సమంజసం కాదన్నారు. కుటుంబ రాజకీయాలతో కాలం గడుపుతాం అనుకుంటే మీ ఇష్టం అంటూ బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. ఎవరు పాలమూరు–రంగారెడ్డి డిజైన్ మార్చారు. ఎవరి హయాంలో నీళ్ల వాటాలో ద్రోహం జరిగిందో చర్చ పెడదాం అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనండి అని అన్నారు.

**సిఎం మంచి ఉద్దేశంతో జిహెచ్ఎంసిపై నిర్ణయం తీసుకున్నారు: మల్‌రెడ్డి రంగారెడ్డి**

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంచి ఉద్దేశంతో ప్రజలను దృష్టిలో పెట్టుకుని జిహెచ్ఎంసిపై నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. వార్డులలో 510 శాతం లోపాలు ఉంటే సరిచేస్తాం అని స్పష్టం చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధికోసం తీసుకున్న నిర్ణయం తమ ఎమ్మెల్యేలు హర్షిస్తున్నారన్నారు.

**డ్రామాలు చేస్తున్నారు: కెపి వివేకానంద**



ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడు దగ్గరికి వెళ్ళి వీడియోలు తీయించి అసెంబ్లీ ప్రారంభం కాకముందే వీడియో రిలీజ్ చేసి డ్రామాలు చేస్తున్నారని బిఆర్ఎస్ విప్ కెపి వివేకానంద అన్నారు. ప్రతిపక్ష నాయకుడిపై ఇష్టానుసారంగా బయట మాట్లాడుతారు, లోపల డ్రామాలు ఆడుతున్నారన్నారు. ఇన్ని రోజుల సభలో ప్రతిపక్షం అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పలేదన్నారు. అధికార మదంతో కాంగ్రెస్ పార్టీ నేతలకు కళ్ళు నెత్తికెక్కాయన్నారు. మేము మాట్లాడుతుంటే మైకులు కట్ చేస్తున్నారని తెలిపారు. మా పార్టీ తరుపున ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

**సబ్జెక్ట్ లేదు-సంగతీ లేదు: కల్వకుంట్ల సంజయ్**



సిఎం రేవంత్‌రెడ్డి వద్ద నీటిపారుదలకు సంబంధించి సబ్జెక్ట్ లేదు సంగతి లేదని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లేదు.. గానీ బూతులు ఎక్కువ ఉన్నాయని సిఎంను విమర్శించారు. కేసీఆర్‌ను ఇష్టానుసారంగా మాట్లాడారన్నారు. ఉరి తీయాలి అంటాడు, సలహాలు ఇవ్వాలని అంటాడు ఇదెక్కడి న్యాయమన్నారు. తెలంగాణ ప్రజల నుంచి మీకు పూర్తి స్థాయి వ్యతిరేకత ఉంది, జూరాలలో ఇవాళ కూడా క్రాప్ హాలిడే ప్రకటించింది, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌లో నీటి విడుదల జరుగుతుంది, పక్క రాష్ట్రంతో ఉన్న సమస్యలు తెలంగాణ పట్ల సోయి ఉన్నోళ్లు, అవగాహన ఉన్నవాళ్ళు సలహాదారుగా ఉండాలి, కానీ ఆదిత్య నాద్ దాస్ సలహాల తీసుకుని ఏపికి నీళ్ళు దోచిపెడుతున్నారన్నారు.

## ఉద్యమకారులను గుర్తించాలి

**ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని ఎమ్మెల్సీ, టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన కింద ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. వారికి ప్రత్యేకంగా వెల్ఫేర్ కార్డులు మంజూరు చేయాలన్నారు. 1969 తొలిదశ ఉద్యమంలో మూడువేల మంది ఉన్నారని, మూడు వందలకు పైగా కాల్పులలో మరణించారని, వారి కుటుంబాలకు న్యాయం చేయాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ సూచించారు. యాదాద్రి లక్ష్మి నర్సింహ్మా స్వామి దేవాలయం అభివృద్ధి పనులలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కోరారు. ఔట్‌సోర్సింగ్ అధికారుల ద్వారా పనులు చేయించారని తెలిపారు. ఒక సంస్థ రూ.17 లక్షల పనులు చేస్తే రూ.4 కోట్ల 70 లక్షలు ఇచ్చారని, అలాగే మరో సంస్థ రూ.27 లక్షల పనులు చేస్తే, రూ.3.96 కోట్లు ఇచ్చారని, రూ.11 లక్షల పనులు చేస్తే, రూ. 2.28 కోట్లు మంజూరు చేశారని, సాయిపావని సన్‌షైన్ ఇన్‌ఫ్రా రూ.45 కోట్ల పనులు చేస్తే, రూ.140 కోట్లు ఇచ్చారని తీన్మార్ మల్లన్న వివరించారు. ఈ పనులకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. యదాద్రి దేవాలయం అభివృద్ధి పనులలో వందలాది కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. సిట్టింగ్ జడ్జితో పూర్తి స్థాయి విచారణ జరపించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 30 లక్షల జనాభా ఉన్న సచార జాతులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ గొరేటి వెంకన్న కోరారు. వారిని సాంస్కృతికంగా సామాజికంగా వారిని ఆదరించాలని కోరారు. సాహిత్య అకాడమీ ఉండాలని, దాని ద్వారా వారిని గుర్తించాలన్నారు. కళాకారులకు ప్రతినెల వేతనాలు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగిస్తే ఎవరూ స్పందించకపోవడం దౌర్భగ్యమని అసహనం వ్యక్తం చేశారు. సచార జాతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ సభ్యుడు నవీన్ కుమార్ రావు కోరారు.

## హైదరాబాద్ మహానగరంపై బ్లూ ప్రింట్‌తో ముందుకెళ్లాలి

**క్రెడిట్ కోసం ప్రయత్నిస్తే భవిష్యత్ ప్రమాదకరం**

**మౌలిక సమస్యలను ఎలా పరిష్కరిస్తారో ప్రభుత్వం ఆలోచించాలి**

**అసెంబ్లీ మున్సిపల్ బిల్లుపై జరిగిన చర్చలో కూనంనేని**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర విస్తరణ నేపథ్యంలో భవిష్యత్‌లో డ్రైనేజీ, కాలుష్యం, రహదారుల సమస్యల పరిష్కారాలు, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్ ప్రణాళికలపై నిపుణులతో చర్చించి, ఒక బ్లూప్రింట్‌తో ముందుకు వెళ్లాలని సిపిఐ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. గంపగుత్తగా కలిపి ప్రపంచ మహానగరాలలో హైదరాబాద్ నగరం ఉన్నదనే క్రెడిట్ కోసం ప్రయత్నిస్తే భవిష్యత్ ప్రమాదకరంగా ఉంటుందన్నారు. బహుముఖంగా ఆలోచించి, బహుముఖ పద్ధతులతో అన్నింటినీ పరిష్కరిస్తూ, కొత్త విధానం వైపు వెళ్లాలని అన్నారు. తెలంగాణ పురపాలిక (నాల్గవ సవరణ) బిల్లు 2025, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్ (సవరణ) బిల్లు 2025, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పొరేషన్ (రెండవ సవరణ) బిల్లులపై శాసనసభలో శుక్రవారం జరిగిన చర్చలో కూనంనేని సాంబశివ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే హైదరాబాద్ నగరంలో డ్రైనేజీ, ట్రాఫిక్, రహదారులు లాంటిలో ఇప్పటికే అనేక సమస్యలు ఉన్నాయని, మౌలిక సమస్యలను ఎలా పరిష్కరిస్తారో కూడా ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న రహదారులను చూస్తే, కొత్తగూడెం రహదారులే బాగున్నాయని అనిపిస్తుందన్నారు. గ్రామాలు, పట్టణాలుగా, పట్టణాలు నగరాలుగా, నగరాలు మహానగరాలుగా మారకుండా ఉండవని, కానీ ఈ క్రమంలోనే సమతుల్యతను పాటించాలని, చిన్న వికేంద్రీకరణ వల్ల నిధులు, రాబడులు తదితర అంశాలను జాగ్రత్తగా పరిశీలిస్తారని, పారిశుధ్యం, రోడ్ల అంశంపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందని, కానీ కేంద్రీకరణ వల్ల పరిపాలన సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుందని కూనంనేని సాంబశివ రావు చెప్పారు. అరగంట పాటు వర్షం పడితే హైదరాబాద్‌లో ట్రాఫిక్ జామ్ అవుతుందని, ఇలాంటివి చాలా సమస్యలు ఉన్నాయని వివరించారు. చార్మినార్ లాంటి అనేక పురాతన కట్టడాలు, సాఫ్ట్‌వేర్ వల్ల హైదరాబాద్‌కు మంచి పేరు ఉన్నదని, గతంలో వాతావరణంలో సమతుల్యత ఉండేదని, ప్రస్తుతం ఉష్ణోగ్రతలో వస్తున్న మార్పులతో వాతావరణ ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో మూడవ వంతు భాగం మహానగరం పరిధిలోకి వచ్చిందని, ఇది ఒకవైపు సంతోషాన్ని, మరోవైపు భవిష్యత్ ఎలా ఉంటుందనే ఆతృత కూడా ఉంటుందని కూనంనేని సాంబశివరావు అన్నారు. దేశంలో నాలుగైదు నగరాలలో కొద్ది రోజుల్లోనే హైదరాబాద్ మొదటి నగరంగా, భౌగోళికంగా, జనాభా, అభివృద్ధి, సాఫ్ట్‌వేర్ ఇలా అన్ని రంగాలలో అగ్రస్థానంలో నిలిచేలా, ప్రపంచంలోనే అతి కొద్ది నగరాల సరసన హైదరాబాద్ చేరడం హర్షదాయకమని కూనంనేని సాంబశివ రావు అన్నారు.

# ప్రాధాన్యతా క్రమంలో పెండింగ్ బిల్లులు ఇస్తున్నాం

**ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి పథకం ద్వారా నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల కార్యక్రమం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మొదటగా కాంగ్రెస్ సభ్యురాలు విజయశాంతి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానంగా ఉపముఖ్యమంత్రి ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 52,82,498 కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. వీరి తరఫున ప్రభుత్వం రూ.3,593.17 కోట్లు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించిందన్నారు. ఎస్‌పిడిసిఎల్ పరిధిలో: 25,35,560 కుటుంబాలు, ఎన్‌పిడిసిఎల్ పరిధిలో 27,46,938 కుటుంబాలు ఈ పథకం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గిందని, వారు సామాజికంగా, ఆరోగ్యపరంగా, ఆర్థికంగా ముందుకు సాగేందుకు ఇది ఎంతో దోహదపడుతోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ముఖ్యంగా పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు గృహ జ్యోతి పథకం ఉపయోగపడుతోందని ఆయన స్పష్టం చేశారు.

**ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, గత ప్రభుత్వంతో గాడి తప్పిన ఆర్థిక విధానాలను సరిదిద్దుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రాధాన్యత క్రమంలో క్లియర్ చేస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఏ.వి.ఎన్ రెడ్డి తదితరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సవివరంగా సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో 18వ తేదీ వరకు జీతాలు రాని పరిస్థితి ఉండేదని, దానివల్ల ఉద్యోగులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని భట్టి గుర్తుచేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్నారు.



పెండింగ్‌లో ఉన్న రూ.200 కోట్లకు పైగా మెడికల్ బిల్లులను పూర్తిస్థాయిలో క్లియర్ చేశామన్నారు. ఇకపై ప్రతి నెలా వీటిని ఎప్పటికప్పుడు చెల్లిస్తామన్నారు. రూ. 560 కోట్ల సప్లిమెంటరీ శాలరీ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించామన్నారు. పెండింగ్ బిల్లుల కోసం ప్రతి నెలా రూ.700 కోట్లకు తగ్గకుండా విడుదల చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఆర్థిక భారాన్ని వాయిదా వేసేందుకే ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచిందని ఉపముఖ్యమంత్రి విమర్శించారు. 2021–2023 మధ్య కాలంలో 26,854 మంది రిటైర్ కావాల్సి ఉండగా, వయోపరిమితి పెంపు వల్ల కేవలం 6,354 మంది మాత్రమే రిటైర్ అయ్యారని, ఇది కేవలం చెల్లింపులు తప్పించుకోవడానికేనని అన్నారు. 2023 డిసెంబర్ నాటికి గత ప్రభుత్వం రూ.43,154 కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టిందని, అందులో ఉద్యోగులకు సంబంధించిన బకాయిలే రూ. 4,575 కోట్లు ఉన్నాయని తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక రూ. 1,752 కోట్ల పెన్షన్ బెనిఫిట్స్ చెల్లించినట్లు వివరించారు. ఆరోగ్య పథకం: ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం మెరుగైన హెల్త్ స్కీమ్‌ను వారే డిజైన్ చేసుకునే అవకాశం కల్పించామని, సమస్యల పరిష్కారానికి 'జాయింట్ స్టాఫ్ కౌన్సిల్' ఏర్పాటు చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లోనూ ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడమే తమ లక్ష్యమని తెలిపారు.

**రాష్ట్రంలో యూరియా కొరత లేదు : మంత్రి తుమ్మల**

రాష్ట్రంలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులకు అవసరమైనంతమేర సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మండలి ప్రశ్నోత్తరాల్లో సభ్యులు బిఆర్ఎస్ సభ్యులు దాసోజు శ్రవణ్ కుమార్, తక్కళ్ళపల్లి రవీందర్ రావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.



ప్రస్తుత 2025–26 యాసంగి సీజన్‌లో అక్టోబర్ నుంచి డిసెంబర్ 31 వరకు మొత్తం 4.04 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, ఇది గత 8 సంవత్సరాల్లో అత్యధికమని మంత్రి వెల్లడించారు. డిసెంబర్ వరకు కేంద్రం కేటాయించిన 5.60 లక్షల మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటికే 5.78 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి తెప్పించుకున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,000 యూరియా సెంటర్లలో కేవలం కొన్ని చోట్ల మాత్రమే వరుసలు కనిపిస్తున్నాయని, వాటిని చూపి యూరియా కొరత అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆరోపించారు. రైతుల్లో భయం సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదన్నారు. ఈ ఏడాది కేంద్రం తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్‌ను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని, అదే విధంగా యూరియా యాప్‌ను 5 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని చెప్పారు. యాప్ ద్వారా డిసెంబర్ 20 నుంచి ఇప్పటివరకు 1.18 లక్షల మంది రైతులు 3.36 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేశారని తెలిపారు. యాప్ అమలుపై రైతులు సంతృప్తిగా ఉన్నారని మంత్రి వెల్లడించారు. కౌలు రైతులు, పట్టాలు లేని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాను స్వయంగా రైతు వేదికల ద్వారా జిల్లాల రైతులతో మాట్లాడగా వారు సంతృప్తి వ్యక్తం చేశారని మంత్రి చెప్పారు. డిసెంబర్ 20 నుంచి ఇప్పటివరకు యాప్ ద్వారా 1.18 లక్షల మంది రైతులు 3.36 లక్షల యూరియా బస్తాలు కొనుగోలు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

## త్వరలోనే 'ఆత్మగౌరవ భవనాల'పై స్పష్టమైన నిర్ణయం

**మంత్రి పొన్నం ప్రభాకర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, బిసి సంక్షేమంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శాసనమండలిలో ఎమ్మెల్సీ బండా ప్రకాష్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సుదీర్ఘంగా సమాధానమిచ్చారు. రాష్ట్రంలో మొత్తం 42 కుల భవనాలకు గతంలో స్థలాలు కేటాయించారని, అయితే వాటిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలంటే కోట్ల రూపాయల నిధులు అవసరమన్నారు.



ప్రస్తుతం మూడు భవనాల పనులు ప్రారంభమైనప్పటికీ, అవి మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. కేటాయించిన స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ఆయా కులాల ప్రతినిధులు అప్రమత్తంగా ఉండి కాపాడుకోవాలన్నారు. కురుమ భవనం నిర్మాణం పూర్తయినప్పటికీ, దాని వినియోగంపై ఆ కుల సంఘాల మధ్య విభేధాలు తలెత్తాయని మంత్రి చెప్పారు. ఆ భవనాన్ని ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా వాడాలా లేక హాస్టల్ అవసరాలకు కేటాయించాలా అన్న విషయంలో సయోధ్య లేదని, ఇలాంటి సమస్యలను పరిష్కరించి త్వరలోనే ఆత్మగౌరవ భవనాలపై ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. రాబోయే శాసనసభ సమావేశాలలోపు బిసి ప్రజాప్రతినిధులతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత సంవత్సరం ప్రతిపాదించిన బిసి సబ్ ప్లాన్ నిధులను సంక్షేమ పథకాలకు వినియోగిస్తామన్నారు. ఉన్నత చదువులు ఉన్న కుటుంబాలే ఆర్థికంగా, సామాజికంగా త్వరగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అందుకే బలహీన వర్గాల విద్యకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని, బిసిల అభివృద్ధి కోసం ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గత పదేళ్ల కాలంలో బలహీన వర్గాల సంక్షేమాన్ని గత ప్రభుత్వం విస్మరించిందని, నిధుల కేటాయింపు కేవలం కాగితాలకే పరిమితమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు, మధుసూదనచారి, తీన్మార్ మల్లన్న అడిగిన ప్రశ్నకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. గత పదేళ్లలో బలహీన వర్గాల సమస్యలపై ఏనాడూ సరైన చర్చ జరగలేదన్నారు. గతంలో 13 కార్పొరేషన్లు ఉండగా, తాము అదనంగా 8 కార్పొరేషన్లు, ఒక ఈబిసి బోర్డును ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం స్థలాల సేకరణ చేసినప్పటికీ, వాటి అభివృద్ధికి పైసా నిధులు కేటాయించలేదని ధ్వజమెత్తారు. చివరకు గొల్ల కురుమ భవనాన్ని మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం తన సొంత నిధులతో నిర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, గత పాలనలో నిధుల విడుదల ఏ స్థాయిలో ఉందో దీనిని బట్టే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం ప్రస్తుతం కొన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, బలహీన వర్గాల అభివృద్ధి కోసం విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు త్వరలోనే సమగ్ర ప్రణాళికతో శాశ్వత సిబ్బంది నియమిస్తామన్నారు. ధోబీ, కుమ్మరి సంఘాల కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, గీత కార్మికుల భద్రత కోసం 'కాటమయ్య రక్షణ కవచాలను' పంపిణీ చేస్తున్నామన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

పిఆర్‌సి సిఫార్సులతో పాటు చెయిల్డ్ కేర్ సెలవులపై చర్చించాలని సూచించామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శాసనమండలి ప్రశ్నోత్తరాలలో సభ్యులు శ్రీపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం 90 రోజులు మెటర్నిటి సెలవులు ఇస్తున్నామని తెలిపారు. చెయిల్డ్‌కేర్ సెలవులు పిల్లలు 18 సంవత్సరాలలోపు సర్వీసులో 15 రోజులకు మించకుండా వినియోగంలోకి తీసుకరావాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించినట్లు చెప్పారు.

ఎన్నికల ముందు గత ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయాల పనులకు కేవలం జి.ఓలను మాత్రమే జారీ చేసిందని, నిధులు విడుదల చేయాలని మంత్రి కొండా సురేఖ అన్నారు.



ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్ఎస్ సభ్యులు ఎల్.రమణ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కొండగట్టు అంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి రూ.500 కోట్లతో జి.ఓ ఇచ్చారని, కానీ నిధులు విడుదల చేయలేదన్నారు. కొండగట్టు అంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి మాస్టర్ రూపొందిస్తున్నామని మంత్రి చెప్పారు. సుమారు రూ.350 కోట్ల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన యాదగిరిగుట్ట అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో చేయలేదని, తాము వచ్చాక పూర్తి స్థాయిలో భక్తులకు సౌకర్యాలు కల్పించామని చెప్పారు. భద్రాచలం నుంచి బాసర వరకు దేవాలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, టెంపుల్ టూరిజం అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తుందన్నారు. కొమురవెల్లిలో అమ్మవార్లకు బంగారు కిరీటాలు చేయించామని,సమ్మక్క, సారక్క దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. దేవాలయాలను మొత్తం సెంట్రలైజేషన్ చేశామని, వెబ్ సైట్ ఏర్పాటు చేశామని తెలిపారు.

## గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తి చేయండి

**శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వ హయాంలో మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ప్రారంభమైన గొర్రెల పంపిణీ పథకం ప్రస్తుతం లబ్ధిదారులకు పెద్ద సమస్యగా మారిందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలిలో శుక్రవారం గొర్రెల పంపిణీ అంశంపై ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. నగదు బదిలీ పేరుతో చేపట్టిన ఈ పథకంలో భాగంగా డిడిలు కట్టిన వేలాది మంది యాదవ, కురుమ సోదరులు నేటికీ గొర్రెలు అందక, మరో వైపు కట్టిన డబ్బులు వాడుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ పథకం నిబంధనల ప్రకారం, లబ్ధిదారుడు రూ.43,000 తన వాటాగా చెల్లిస్తే, ప్రభుత్వం రూ.1,20,000 సబ్సిడీ కలిపి మొత్తం రూ.1,50,000 విలువైన గొర్రెలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో కొంత మందికి పంపిణీ పూర్తయినప్పటికీ, మెజారిటీ లబ్ధిదారులు ఇంకా నిరీక్షిస్తూనే ఉన్నారని తెలిపారు. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత ఈ పథకానికి సంబంధించిన బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేసిందన్నారు. దీని వల్ల రైతులు పండించిన పత్తి, వరి ధాన్యానికి సంబంధించిన సొమ్ము అదే ఖాతాలలో జమ అవుతున్నా, వాటిని విత్ డ్రా చేసుకునే వీలు లేకుండా పోయిందని, తమ సొంత డబ్బులు కూడా వాడుకోలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని సత్యం చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఫ్రీజ్ అయిన ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని సత్యం కోరారు. మునుగోడు నియోజకవర్గంలో ఇప్పటికే డిడిలు కట్టి వేచి ఉన్న లబ్ధిదారులందరికీ తక్షణమే గొర్రెల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. చేనేత, గీత కార్మికుల తరహాలోనే, కష్టజీవులైన యాదవ, కురుమ సోదరులకు కూడా 50 ఏళ్లు నిండిన వెంటనే వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలన్నారు. గొర్రెల కాపరులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. గొర్రెలు మరణించిన సందర్భంలో కాపరులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు, చనిపోయిన గొర్రెలకు కూడా ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా ప్రత్యేక పథకాన్ని రూపొందించాలని కోరారు.

**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్ : సిద్దిపేట్ సర్కిల్
**టెండర్ నోటీస్**
టెండర్ స్పెసిఫికేషన్ నెం. T-37/25-26, T-74/25-26, T-93/25-26, T-98/25-26 (ఎక్స్‌టెండెడ్), T-102 నుండి T-105/2025-26 (కొత్తది) వరకు సిద్దిపేట్ సర్కిల్‌లోని వివిధ ఎలక్ట్రికల్ & సివిల్ పనుల కోసం SE/OP/సిద్దిపేట్ యొక్క టెండర్ నోటీస్. టెండర్ల ఓపెన్ కోసం బిడ్స్ అమ్మకాలు తేదీ: 03.01.2026 నుండి ప్రారంభమై తేదీ: 12.01.2026న 17:00 గంటలకు ముగియనున్నాయి. బిడ్‌లను సమర్పించడానికి చివరి తేదీ: 13.01.2026 సమయం 14:00గంటల వరకు. తేదీ: 13.01.2026న 15:00 గంటలకు ఓపెన్‌చేయబడును. ఇ-టెండర్ల కోసం బిడ్ డౌన్ లోడింగ్ 03.01.2026 నుండి స్టార్ట్ అవుతుంది. కాగా, బిడ్ డౌన్‌లోడింగ్ 12.01.2025న 17:00 గంటలకు ముగియనుంది. బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ: 13.01.2026న 14:00 గంటల సమయం వరకు. అదేరోజు 13.01.2026న 15:00 గంటలకు ఓపెన్ చేయబడును. టెండర్ వివరాలను www.tssouthernpower.com, మరియు http://telangan.gov.inలో చూడవచ్చు. ఫోన్ నెం.8712471034లో సంప్రదించవచ్చు.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, ఆపరేషన్ సర్కిల్ : సిద్దిపేట్, TGSPDCL.
DIPR R.O. No. : 12956-PP/CL/ADVT/1/2025-26, Date: 02-01-2026



# జనరల్

STATE & REGIONAL NEWS

## 'ఎగ్జిబిషన్ సొసైటీ' స్టాల్ కేటాయింపుల అవకతవకలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: కోదండరామ్

ప్రజాపక్షం/హైదరాబాద్: 'నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ' స్టాళ్ల కేటాయింపులలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకల అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వ పెద్దలదృష్టికి తీసుకెళ్తానని,రానున్న కాలంలో స్టాల్స్ ఎంపికలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించే విధంగా కృషి చేస్తామని టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. 'ఎగ్జిబిషన్ సొసైటీ'లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై హైదరాబాద్‌లోని టిజెఎస్ కార్యాలయంలో శుక్రవారం రౌం డ్ టేబ‌ుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిజెఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం. నరసయ్య అధ్యక్షత వహించగా, సిపిఐ (ఎం) నగర నాయకులు సత్తార్, సిపిఐ (ఎం.ఎల్.) న్యూడెమోక్రసీ నాయకురాలు అనురాధ, సిపిఐ (ఎం.ఎల్.) మాస్ లైన్ నాయకుడు సదానంద్, గాంధీ దర్శన్ సెక్రటరీ ప్రసాద్, స్టాల్ బాధితుల కమిటీ కన్వీనర్ అబ్రార్, టిజెఎస్ నాయకులు పల్లె వినయ్‌కుమార్, బట్టల రామచందర్, మహమ్మద్ అఫ్జల్, జస్వంత్,తదితరులు పాల్గొన్నారు.

# 'మూసీ' అభివృద్ధి ఖర్చు ఎంత?

### రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేయాలనుకుంటుందో స్పష్టం చేయాలి: హరీశ్ రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ ప్రాజెక్ట్ అభివృద్ధికి ఎంత ఖర్చవుతుందో స్పష్టం చేయాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. శాసనసభలో 'మూసీనది పునరుజ్జీవం' అంశంపై శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ మూసీ సుందరీకరణపైన రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేయాలనుకుంటుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణలో ఇప్పటివరకు ఎన్ని నివాసాలు కూల్చారు? కూల్చిన నివాసాలకు భూసేకరణ చట్టం 2013 ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లించారా? లేదా కెసిఆర్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారా? అని ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌లో భాగంగా ఇంకా కూల్చాల్సిన ఇండ్లను ఇప్పటి వరకు ఎన్ని గుర్తించారు?, ఇందులో ప్రభుత్వ, ప్రైవేటు కట్టడాలు ఎంత? అని అన్నారు. మూసీనదిలో రెండున్నర టిఎంసిల గోదావరి జలాలను ఎక్కడి నుంచి తెస్తున్నారని?, కాళేశ్వరంలో భాగమైన మల్లన్న సాగర్ నుండి ఆ గోదావరి నీళ్లను తెస్తున్నారా? లేదా ఎక్కడి నుంచైనా గాలిలో నుండి తెస్తున్నారా? అని ప్రశ్నించారు. ఖాళీ స్థలాలు చాలా ఉన్నాయని,ఆ ఖాళీ స్థలాల్లో మూసీ సుందరీకరణ పనులు చేపట్టాలని,మూసీ పేరుతో పేదల ఇండ్లు కూలిస్తే మాత్రం బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోబోదని హరీశ్ రావు తెలిపారు.

**తెల్లవారుజామున ఎజెండా పంపిస్తే ఎలా ప్రిపేర్ అవుతాం: హరీశ్ రావు**

శాసనసభ సమావేశ అజెండా కాపీలను తెల్లవారుజామున రెండు, మూడు గంటలకు పంపిస్తున్నారని, సభ్యులు ఎప్పుడు నిద్రలేవాలి?, సబ్జెక్ట్‌పైన తాము ఎప్పుడు ప్రిపేర్ అవ్వాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. శాసనసభలో అంగన్‌వాడి వర్కర్లకు సవరించిన జీతాల చెల్లింపు అంశంపై జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో హరీశ్‌రావు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు కనీసం ఏడు రోజుల పాటు నిర్వహించాలని నిర్ణయించామని, కానీ బిఎసి మినిట్స్ లో ఆ ఏడు రోజుల ప్రస్తావన ఎందుకు పొందుపర్చలేదని, సభలో తీసుకున్న నిర్ణయానికి మినిట్స్‌లో పొంతన లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. సభ ప్రారంభానికి కనీసం 24 గంటల ముందు ఎజెండాను సభ్యులకు పంపించకపోతే అర్థవంతమైన చర్చకు ఆస్కారం లేకుండా పోతుందన్నారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం లేదని, తమ గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. దీంతో స్పీకర్ జోక్యంచేసుకుని ప్రశ్నకు సంబంధించిన అంశంపైన మాట్లాడాలని సూచించారు. మరోసారి హరీశ్‌రావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సిఎం మాట్లాడిన భాష బాగాలేదన్నారు. దీంతో స్పీకర్ ప్రశ్నకే పరిమితం కావాలని సూచించగా, తమకు మైక్ ఇవ్వడం లేదని హరీశ్‌రావుతో పాటు బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వెళ్లిపోయారు.

# సుస్థిరమైన సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా జిహెచ్ఎంసి విస్తరణ : శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుస్థిరమైన సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ కార్పోరేషన్‌ను ప్రభుత్వం విస్తరించిందని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శాసనసభలో శుక్రవారం తెలంగాణ పురపాలికల (నాల్గవ సవరణ) బిల్లు 2025 హైదరాబాద్ మహానగర పురపాలక కార్పోరేషన్ (సవరణ) బిల్లు 2025, హైదరాబాద్ మహానగర పురపాలక కార్పోరేషన్ (రెండవసవరణ) బిల్లు2025పై జరిగిన చర్చకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2026 జనవరి నుంచి కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రారంభించన్న నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ విస్తరణ ప్రక్రియను డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ జిహెచ్ఎంసిలో 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పోరేషన్ల విలీనం మొదలుకుని, గ్రేటర్ హైదరాబాద్‌ను 12 జోన్లు, 60 సర్కిళ్లను ఏర్పాటు చేస్తూ 300 వార్డులకు పెంచడం పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ మూడు బిల్లులకు ఆమోదం తెలపాలని సభ్యులను కోరారు. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్‌ను ఒక్కటిగా కొనసాగించడమా లేక మరిన్ని కార్పొరేషన్లు విభజించడమా అనే అంశాన్ని ప్రభుత్వ పరిశీలిస్తోందని, ఈ ప్రక్రియను కూడా ప్రజలందరి ఆమోదంతోనే చేపడుతామని వెల్లడించారు. అనంతరం సభ ఈ మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. అంతకు ముందు జరిగిన చర్చలో బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా జరిగిందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచినీరు, ట్రాఫిక్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. స్వపరిపాలనను ధ్వంసం చేశారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార వికేంద్రీకరణ చేపట్టాలని సూచించారు. ఎంఐఎం శాసనసభాపక్ష నాయకులు అక్బరుద్దీన్ మాట్లాడుతూ హైదరాబాద్ వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే ఢిల్లీ తరహాలో కష్టాలు తప్పవన్నారు. ప్రభుత్వం వెంటనే కాలుష్యాన్ని నివారించాలన్నారు. గ్రేటర్‌ను విస్తరించినంత మాత్ర హైదరబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరగదని, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు పారదర్శక సేవలను అందించిప్పడే అది సాధ్యమని ఆదీశ ప్రభుత్వ చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ విస్తరణను స్వాగతిస్తున్నామని అయితే రంగారెడ్డి జిల్లా అస్తిత్వం కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మరో సభ్యులు టి.రాంమెహన్ రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని ఇంద్రేశం, ఐలోన్ గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేయాలని కోరారు.

## 'మూసీ' పరివాహక పేదలపరిస్థితి ఏమిటి : అక్బరుద్దీన్ ఒవైసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'మూసీ'నది పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదల పరిస్థితి ఏమిటని ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసి ప్రశ్నించారు. శాసనసభలో శుక్రవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో 'మూసీ నది పునరుజ్జీవం' అంశంపైన అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ ప్రాజెక్ట్‌ను ఎప్పటి వరకు పూర్తి చేస్తారని, చెక్‌డ్యాముల పరిస్థితి ఏమటని, ఉన్నవాటిని తొలగిస్తారా? నిర్మిస్తారా? అని ప్రశ్నించారు. నది పరివాహక ప్రాంతంలో ఎక్కువగా ముస్లింలు, పేదలు నివాసం ఉంటున్నారని, వారికి పునరవాసం కల్పిస్తారా? లేదా? అక్కడే ఉంటారా? అని అన్నారు. కాంగ్రెస్ సభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ నుంచి మూసీ ప్రక్షాళన చేపట్టాలని, చెక్‌డ్యాములను నిర్మించాలని కోరారు. బిఆర్ఎస్ సభ్యులు కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని నాలాలను ప్రక్షాళన చేపట్టాలని కోరారు. బిజెపి సభ్యులు పాయల శంకర్ మాట్లాడుతూ మూసీ ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు.

## 'తెలంగాణ ఉద్యమకారుల' హామీల అమలుకు కృషి

### మహేష్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన 'తెలంగాణ ఉద్యమకారుల హామీ'లను అమలు చేసేందుకు కృషి చేస్తామని టి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్యమకారులకు హామీ ఇచ్చారు. టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల సంఘాల ప్రతినిధులు శాసనమండలి ఆవరణలో టిపిసిసి అధ్యక్షుడు, మహేష్ కుమార్ గౌడ్, మంత్రులను కలిసి, వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. దీనిపైన మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటామని, ఈ అంశాలపై ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘాల ప్రతినిధులు ప్రపోల్ రాంరెడ్డి, చీమ శ్రీనివాస రావు, సుల్తాన్ యాదగిరి, పాండు, యాదగిరి, టిజెఎస్ నాయకుడు ఎం.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఆటో డ్రైవర్ల 'చలో అసెంబ్లీ'

### ఆటో కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదా?

### తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెండింగ్‌లోఉన్న ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి, వాటిని అమలు చేయడంలో విఫలమైనందుకు నిరసిస్తూ వేలాదిమంది ఆటో రిక్షా డ్రైవర్లతో నేడు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి ప్రకటించింది. హైదరాబాద్, హిమాయత్ నగర్ ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఎసి కన్వీనర్ బి. వెంకటేశం, జెఎసి నేతలు వేముల మారయ్య (బిఆర్‌టియు), ఎం.ఎ. సలీం (తెలంగాణ జాగృతి), ఈ. ప్రవీణ్ (టియుసిఐ), ఎ. సత్తి రెడ్డి (టిఎడిఎస్), ఫి.యాదగిరి (టిఎన్‌టియుసి), శివానందం (టిఎఎండియు) ఎండి. బాబా (సిఐటియు)లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ గత 13 సంవత్సరాల నుండి ఇప్పటివరకు ఆటో మీటర్ చార్జీలు పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మి పథకం) వలన బేరాలు లేకపోవడంతో ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, దీనితోపాటు 100 శాతం పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలతో ఆటో కార్మికులు ఆకలి బాధలతో నానా అవస్థలు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్. అశోక్, సిహెచ్. జంగయ్య, ఎం.కృష్ణ, ఎం.నరసింహ, శ్రీనివాస్, (ఎఐటియుసి), లింగం గౌడ్ (టియుసిఐ), ఫయాజ్ (తెలంగాణ జాగృతి)లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### టియుడబ్ల్యుజె డైరీని ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, తన పరిధిలో పరిష్కారమయ్యే సమస్యలను తన దృష్టికి తెస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ప్రతినిధి బృందం గురువారం సచివాలయంలో సిఎంను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది. యూనియన్ రూపొందించిన 2026 మీడియా డైరీని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవిష్కరింపజేసింది. ఈ సందర్భంలో జర్నలిస్టులకు నూతన సంవత్సర కానుకగా సంక్షేమ పథకాలు అందించాలని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ ముఖ్యమంత్రిని కోరగా, ఆయనపై విధంగా స్పందించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఐజెయు మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్, టియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, ఐజెయు కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, కార్యదర్శులు వి.యాదగిరి, కె. శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. కిరణ్ కుమార్, అజిత, చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్. హరి, ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియుద్దీన్, వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హరీష్‌లు ఉన్నారు. అనంతరం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని యూనియన్ ప్రతినిధి బృందం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపింది.

**ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్ రెడ్డి**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# బిసి రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో చర్చ జరపాలి

### అఖిలపక్ష నేతలతో బిసి జెఎసి నేతల భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ జరిపి, బిసి రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బిసి జెఎసి డిమాండ్ చేసింది. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్, బిజెపి శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కౌసర్ మోయినుద్దీన్ లతో బిసి జెఎసి నేతలు భేటీ అయ్యారు. బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక చర్చ జరిపి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. బిసి రిజర్వేషన్లపై చేసిన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించాలనే ప్రధాన డిమాండ్‌తో సిఎం నేతృత్వంలో అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీతో కలవాలని, అసెంబ్లీ వేదికగా అఖిలపక్షం ఢిల్లీకి వెళ్లే తేదీని కూడా ప్రకటించాలని వారు అఖిలపక్ష నేతలకు విన్నవిస్తూ వినతిపత్రం అందజేశారు. బిసి రిజర్వేషన్ల విషయంలో అఖిలపక్ష పార్టీల నేతలు సానుకూలంగా స్పందించారని, అసెంబ్లీలో చర్చించే విధంగా చర్యలు తీసుకొనడమే కాకుండా బిసి రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలు నిర్వహించేలా కృషి చేస్తామని, బిసి జెఎసి చేస్తున్న ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అఖిలపక్ష నేతలు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ భేటీలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి జెఎసి నాయకులు శేఖర్ సగర, యువజన సంఘాల జెఎసి చైర్మన్ కనకాల శ్యామ్ కురుమ, జెఎసి అధికార ప్రతినిధి విక్రమ్ గౌడ్, మహిళా సంఘం ఆశా అధ్యక్షులు మని మంజరి, వీరస్వామి గూడూరు భాస్కర్ , తారకేశ్వరి, నరసింహ, జాజుల లింగం గౌడ్, వెంకటేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ రూపొందించాలి

### ముఖ్యమంత్రికి ఎస్‌టియుటిఎస్ వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న సర్వీసు రూల్స్‌ను వెంటనే రూపొందించాలని కోరుతూ ఎస్‌టియుటిఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సచివాలయంలో మాజీ ఎంఎల్‌ఎ చాడ వెంకట్ రెడ్డితో కలిసి సంఘ నాయకులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌టియుటిఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సదానందం గౌడ్, జుట్టు గజేందర్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయ సర్వీసు రూల్స్ లేకపోవడం వల్ల పాఠశాల విద్యాశాఖలో పర్యవేక్షణాధికారుల వ్యవస్థ లేక తీవ్ర సంక్షోభం ఏర్పడిందని ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. దీని కారణంగా ఉపాధ్యాయులకు పదోన్నతి ఛానెల్ నిలిచిపోయిందని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ కమిటీ చైర్మన్ కె. కేశవ రావుతో చర్చిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు వారు వివరించారు. దీంతో పాటు డిఎస్సి 2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరగా, ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ సాబేర్ అలి, ఎవి. సుధాకర్, కరుణాకర్ రెడ్డి, మాతంగి శంకర్, ప్రవీణ్ కుమార్, వెంకటేశ్వరరావు, ఇఫ్తెకారుద్దీన్ పాల్గొన్నారు

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం

### పార్లమెంట్‌లో వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ)బిల్లు సిగ్గుచేటు

### ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్.ఎ.స్టాలిన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి(ఎన్‌డిఎ) ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని, దానిలో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానంను తీసుకువచ్చి పార్లమెంట్ లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(విబిఎస్ఎ) బిల్లు 2025ని ప్రవేశపెట్టిందని, వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఎ స్టాలిన్ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ విద్యవ్యవస్థను భ్రష్టు పట్టుస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని ఆరోపించారు. దానిలో భాగంగానే ఇటీవల జరిగిన పార్లమెంట్‌లో వికాసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఎ)బిల్లును తీసుకురావడం జరిగిందని, ఈ బిల్లు సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ యొక్క లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసే విధంగా ఉందన్నారు. జాతీయ నూతన విద్యా విధానంతో పాటు విబిఎస్ఎ బిల్లు రద్దుకై విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ. 9,300 కోట్ల బకాయిల విడుదల విషయంలో, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, దీని కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదలపై ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి కూడా గ్యారంటీ లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బానోతు రఘురాం, గ్యార నరేష్, రహమాన్, గ్యార క్రాంతి, సోతుకు ప్రవీణ్, సి. రాజు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ రమేష్, ముదిగొండ మురళీకృష్ణ, భాషబోయిన సంతోష్, ల్యాదల్ల శరత్, రేణుకుంట్ల ప్రీతమ్, దిడ్డి పార్థసారథి, ఎండి అన్వర్, వంశీ కృష్ణ, చైతన్య యాదవ్, బి. ప్రేమ్ కుమార్, నేరళ్ల జోసెఫ్, అక్రమ్ మాలిక్, కైలాష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



## 'ఉద్యాన పంట సాగు విస్తీర్ణం' పెంచేందుకు ప్రణాళికలు రూపొందించండి

### వ్యవసాయ, రైతు కమిషన్‌కు సూచించిన సిఎం రేవంత్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని, పంట మార్పిడి విధానం, సేంద్రియ వ్యవసాయం చేసే విధంగ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ రైతులలో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సూచించారు.అవసరమైతే కమిషన్‌కు అదనపు నిధులను కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డితో పాటు సభ్యులు సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కాగా కోదండరెడ్డి జన్మదినం సందర్భంగా సిఎం ఆయకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సిఎంను కలిసిన వారిలో కోదండ రెడ్డితో పాటు సభ్యులు కెవిఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్, భవాని రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ ఉన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ పని తీరు పట్ల సిఎం రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా కమిషన్ చైర్మన్, సభ్యులు పని చేస్తున్నారని కితాబిచ్చారు. తెలంగాణలో తృణధాన్యాలు, పప్పుదినుసుల సాగుతగ్గుతోందని,దీనిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంప్రదాయ పంటల విషయంలో కూడా రైతులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తుందని, వరి తరహాలోనే అవసరమైతే ఇతర పంటల వైపు వెళ్లే రైతులకు కూడా ప్రోత్సహకాలు ఇవ్వడాన్ని ఆలోచిస్తున్నామని వివరించారు.

## టూరిజం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తా

### యూనియన్ నేతలకు సిఎం హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పర్యాటక అభివృద్ధి సంస్థలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని సిఎం ఎ.రేవంత్‌రెడ్డి హామి ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని టూరిజం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టూరిజం లోని కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, గతంలో ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా పదవి విరమణ వయసు 61 సంవత్సరాలకు పెంచాలని ముఖ్యమంత్రిగారీ దృష్టికి సబ్బు రాజమౌళి తీసుకెళ్లారు. ఈ మేరకు ఒక వినతిపత్రం కూడా అందించారు. టూరిజం కార్పొరేషన్ లో ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు సబ్బు రాజమౌళి ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## 78 ఏళ్ల తర్వాత గ్రామానికి రోడ్డు

**సిమ్లా:** దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 78 ఏళ్ల తర్వాత ఒక గ్రామానికి రోడ్డు అందుబాటులోకి వచ్చింది. దీంతో ఆ గ్రామానికి రవాణా సౌకర్యం కూడా కలిగింది. రాజకీయ నేతలు, అధికారులతో కూడిన ట్రయల్ రన్ బస్సు రావడంతో గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చావాసి ప్రాంతంలోని తుమాన్ గ్రామానికి 78 ఏళ్లుగా ఎలాంటి రోడ్డు మార్గం లేదు. దీంతో దశాబ్దాలుగా ఆ గ్రామానికి ఎలాంటి రవాణా సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా, షకెల్డ్ నుంచి తుమాన్ వరకు 2.7 కిలోమీటర్ల రహదారిని పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్మించింది. స్థానిక రాజకీయ నేతలు ఇటీవల ఆ రోడ్డును ప్రారంభించారు. దీంతో డిసెంబర్ 29న హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (హెచ్‌ఆర్టీసీ) తొలిసారి ట్రయల్ రన్ బస్సు నడిపింది.కర్సోగ్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ గౌరవ్ మహాజన్ జెండా ఊపి షకెల్డ్ నుంచి తుమాన్‌కు బస్సును ప్రారంభించారు. రాజకీయ నేతలు, అధికారులు ఆ బస్సులో ప్రయాణించారు.

## అతిసారతో 10 మందిమృతి?

• ఇండోర్ మేయర్ పుష్పమిత్ర భార్గవ

**ఇండోర్ :** మధ్యప్రదేశ్ ఇండోర్ నగరంలోని భాగీరత్‌పురా ప్రాంతంలో కలుషిత నీటి కారణంగా వ్యాపించిన అతిసార వ్యాధి వల్ల 10 మంది మరణించినట్లు సమాచారం అందిందని ఇండోర్ మేయర్ పుష్పమిత్ర భార్గవ శుక్రవారం తెలిపారు.అయితే, ఈ ఆరోగ్య సంక్షోభం కారణంగా ఆరు నెలల పసికందుతో సహా 14 మంది మరణించారని స్థానిక నివాసితులు పేర్కొన్నారు. కాగా, ఈ వాదనను ఆరోగ్య శాఖ ధృవీకరించలేదు. ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం, భాగీరత్‌పురాలో అతిసార వ్యాధి ప్రబలడం వల్ల నలుగురు మరణించారు. అయితే, ఈ వ్యాప్తి కారణంగా 10 మంది మరణించినట్లు సమాచారం అందిందని భార్గవ పిటిఐకి తెలిపారు. భాగీరత్‌పురా నుండి సేకరించిన తాగునీటి నమూనాల ప్రాథమిక పరీక్ష నివేదికల ఆధారంగా ఆ ప్రాంతంలో కలరా వ్యాపించిందనే అనుమానంపై అడిగిన ప్రశ్నకు ఈ విషయంపై ఆరోగ్య శాఖ మాత్రమే సమాచారం ఇవ్వగలదని మేయర్ అన్నారు. ప్రధాన వైద్య, ఆరోగ్య అధికారి (సిఎంహెచ్ఒ) డాక్టర్ మాధవ్ ప్రసాద్ హసాని గురువారం మాట్లాడుతూ, నగరంలోని ఒక వైద్య కళాశాల నుండి వచ్చిన ప్రయోగశాల పరీక్ష నివేదికలు పైప్‌లైన్‌లో లీకేజీ కారణంగా ఆ ప్రాంతంలోని తాగునీరు కలుషితమైందని ధృవీకరించాయని తెలిపారు. అయితే, సిఎంహెచ్ఒ నివేదికలోని వివరణాత్మక వివరాలను పంచుకోలేదు. పరిపాలనా అధికారులు కూడా దీని గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. భాగీరత్‌పురాలోని ఒక పోలీసు అవుట్‌పోస్ట్ సమీపంలో, ఒక మరుగుదొడ్డి నిర్మించిన ప్రదేశంలో ప్రధాన తాగునీటి సరఫరా పైప్‌లైన్‌లో లీకేజీ గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ లీకేజీ కారణంగా నీటి సరఫరా కలుషితమైందని వారు పేర్కొన్నారు. గత తొమ్మిది రోజులుగా భాగీరత్‌పురాలో 1,400 మందికి పైగా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. గురువారం రాత్రి వరకు ఉన్న పరిస్థితిని ఉటంకిస్తూ ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ, ఆ ప్రాంతంలోని ఆసుపత్రులలో 272 మంది రోగులు చేరారని, వారిలో 71 మంది డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న 201 మంది రోగులలో 32 మంది ఇంటెన్సివ్ కేర్ యూనిట్లలో చికిత్స పొందుతున్నారని ఆ అధికారి తెలిపారు.

# దేశంలో 'వైట్ కాలర్ టెర్రరిజం'

ఆవిర్భావం ఆందోళనకరం: రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడులో వైద్యులే నేరస్థులుగా తేలిందని వెల్లడి



**ఉదయ్‌పూర్:** దేశంలో వైట్‌కాలర్ టెర్రరిజం ఆందోళనకర ధోరణిగా ఉద్భవిస్తున్నదని, ఉన్నత విద్యావంతులైన వ్యక్తులు సంఘ, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం శోచనీయమని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం ఇక్కడి భూపాల్ నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. 2025 నవంబరు 10న ఢిల్లీలోని ఎర్ర కోట సమీపంలో చోటుచేసుకున్న కారు బాంబు పేలుడును ఆయన ఈ సందర్భంగా ఎత్తి చూపుతూ అక్కడి నేరస్థులు వైద్యులని తేలారని చెప్పారు. ఢిల్లీ బాంబు పేలుడుకు పాల్పడిన వారు ప్రిస్క్రిప్షన్లపై 'ఆర్ఎక్స్' అని రాసుకునే వైద్యులన్నారు. అయినప్పటికీ వారి చేతుల్లో 'ఆర్‌డిఎక్స్' ఉందని, ఇది జ్ఞానం, విలువలతో కూడిన వ్యక్తిత్వం అవసరాన్ని హైలెట్ చేస్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. విద్య ఉద్దేశం వృత్తిపరమైన విజయం మాత్రమే కాదని, నైతికత, నీతి, మానవ స్వభావాన్ని అభివృద్ధి చేయడం కూడా అని రాజ్‌నాథ్ చెప్పారు. 2025 నవంబరు 10న ఎర్రకోట బయట పేలుడు పదార్థాలతో నిండిన ఐ20 కారును నడిపిన డాక్టర్ ఉమర్‌ఉన్‌నబీ 15మంది మృతికి కారకుడయ్యాడు. దర్యాప్తులో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ బయటపడటంతో ముగ్గురు డాక్టర్లు ముజమ్మిల్ గనై, అదీల్ రాథర్, షాహినా సయీద్ అరెస్టులు జరిగాయి. దేశంలో రక్షణ రంగంలోని చిన్న స్టార్టప్‌లు అద్భుతంగా పనిచేస్తున్నాయని రక్షణమంత్రి చెప్పారు. 'రాబోయే 15 నుంచి 20 సంవత్సరాలలో భారతదేశం ఆయుధాలలో పూర్తిగా స్వావలంభన చెందుతుందనే నమ్మకం నాకున్నది' అని తెలియజేశారు. కృత్రిమ మేధస్సు, మెషీన్ లెర్నింగ్, ఇతర సాంకేతికతలు ప్రజల జీవితాలను, పనిని మారుస్తున్నాయని, వాటిని భారతదేశ అభివృద్ధిని నడిపించడానికి సానుకూలంగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. భారతదేశం ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని, 2030నాటికి అది మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని రక్షణమంత్రి తెలిపారు. ఈ ప్రస్థానంలో విశ్వవిద్యాలయాలు పెద్ద పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. ఆత్మగౌరవం, అహంకారం మధ్య సున్నితమైన సమతుల్యతను అర్థం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను కూడా రాజ్‌నాథ్ సింగ్ నొక్కిచెప్పారు.ఈ రెండింటి మధ్య ఉన్న సన్నని గీతను దాటవద్దని ఆయన ప్రజలను కోరారు. ఆత్మగౌరవ భావన ముఖ్యమైనదే అయినప్పటికీ అది ఎప్పుడూ అహంకారంగా మారకూడదని సింగ్ సూచించారు.

## ఫుడ్ పాయిజనింగ్‌తో 200 చిలుకలు మృతి

**భోపాల్:** కలుషిత ఆహారం వల్ల సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే చిలుకల మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. బద్వా ప్రాంతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న అక్విడక్ట్ వంతెన సమీపంలో గత నాలుగు రోజుల్లో సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. బర్డ్ ఫ్లూ సోకడం వల్ల చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. కాగా, వందలాది చిలుకలు మరణించిన సమాచారం తెలుసుకుని పశువైద్యులు, వన్యప్రాణుల సంరక్షణ శాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. చిలుకల కళేబరాలకు పోస్ట్ మార్టం నిర్వహించారు. వాటి మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు. బర్డ్ ఫ్లూ వైరస్ ఆనవాళ్లు కనిపించలేదన్నారు. మరింత పరీక్ష కోసం చిలుకల నమూనాలను జబల్పూర్ ల్యాబ్‌కు పంపినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు పొలాల్లో పురుగు మందులు స్ప్రే చేసిన ఆహార గింజలు తినడం, నర్మదా నదిలోని కలుషిత నీరు, సందర్శకులు వదిలేసిన మిగిలిన ఆహారం తినడం వల్ల చిలుకలకు ఫుడ్ పాయిజనింగ్ జరిగి ఉంటుందని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్విడక్ట్ వంతెన సందర్శించే వారు పక్షులకు ఆహారం ఇవ్వడాన్ని నిషేధించారు. దీనిని కఠినంగా అమలు చేసేందుకు ఆ ప్రాంతంలో సిబ్బందిని నియమించారు.


## కిష్త్వార్‌లో అగ్నిప్రమాదం

5 ఇళ్లు దగ్ధం, ఇద్దరికి గాయాలు

**జమ్మూ :** జమ్మూ కశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలోని ఒక మారుమూల గ్రామంలో ఎల్పీజీ సిలిండర్ పేలుడు కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయని, ఇద్దరికి గాయాలయ్యాయని అధికారులు శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి పొద్దుపోయాక థాచ్నా గ్రామంలోని ఒక ఇంట్లో మంటలు చెలరేగి, వేగంగా సమీపంలోని ఇళ్లకు వ్యాపించాయని వారు చెప్పారు. జిల్లా యంత్రాంగం, పోలీసులు, సైన్యం, అగ్నిమాపక సిబ్బంది బృందాలు, స్థానిక నివాసితుల సహాయంతో మంటలను ఆర్పడానికి ఆపరేషన్ను ప్రారంభించాయి. మారుమూల ప్రాంతానికి అగ్నిమాపక వాహనాలను పంపించామని, మంటలు మరింత వ్యాపించకుండా నిరోధించడానికి సమీపంలోని ఇళ్ల నుండి ఎల్పీజీ సిలిండర్లను తొలగించామని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన కిష్త్వార్ డిప్యూటీ కమిషనర్ పంకజ్ శర్మ, చాలా గంటల తర్వాత మంటలు అదుపులోకి వచ్చాయని చెప్పారు. 'ఈ ఘటనలో నాలుగు నుంచి ఐదు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. మంటలను ఆర్పే ప్రయత్నాల్లో పాల్గొన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి మరియు వారికి ప్రథమ చికిత్స అందించబడింది' అని ఆయన పిటిఐకి తెలిపారు.

# చివరి దశలో పర్వత సొరంగం పనులు

వర్చువల్‌గా పర్యవేక్షించిన రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ:** మహారాష్ట్రలోని పాల్ఘార్ జిల్లాలో బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన 1.5 కిలోమీటర్ల పొడవైన పర్వత సొరంగం చివరి దశ పనులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ శుక్రవారం న్యూఢిల్లీలోని రైల్ భవన్ నుండి వర్చువల్‌గా పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేడు ఒక పెద్ద మైలురాయిని సాధించామన్నారు. ఈ విజయం పర్వత సొరంగం 5 బ్రేక్‌త్రూ అని అన్నారు. 'ఈ 1.5 కిలోమీటర్ల పొడవైన పర్వత సొరంగం పాల్ఘార్ జిల్లాలోని పొడవైన సొరంగాలలో ఒకటి. విరార్, బోయిసర్ బుల్లెట్ రైలు స్టేషన్ల మధ్య ఉంది. ఇది మహారాష్ట్రలో రెండవ సొరంగం బ్రేక్‌త్రూ, ఎందుకంటే థానే, బికెసి మధ్య ఉన్న మొదటి 5 కిలోమీటర్ల పొడవైన భూగర్భ సొరంగం సెప్టెంబర్ 2025లో పూర్తయిందని' రైల్వే మంత్రిత్వ శాఖ పత్రికా ప్రకటనలో తెలిపింది. గుజరాత్, మహారాష్ట్ర, దాద్రా నగర్ హవేలీ మీదుగా వెళ్లే ముంబయి, అహ్మదాబాద్‌లను కలిపే 508 కిలోమీటర్ల రైల్వే ప్రాజెక్ట్, గంటకు 320 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైళ్లను నడపడానికి రూపొందించిన భారతదేశపు ఏకైక హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, ముంబయి, అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయాన్ని కేవలం 1: 58 గంటలు తగ్గిస్తుంది, ప్రధాన వాణిజ్య కేంద్రాల ఆర్థిక వ్యవస్థలను కలుపుతుందని, ఏకీకృతం చేస్తుందని వైష్ణవ్ అన్నారు. ఈ ప్రాజెక్టును జపాన్ ప్రభుత్వం నుండి సాంకేతిక, ఆర్థిక సహాయంతో అమలు చేస్తున్నారు. అధికారుల వివరాల ప్రకారం ఇందులో ఎనిమిది పర్వత సొరంగాలు ఉన్నాయి. మహారాష్ట్రలో ఏడు సొరంగాలు సుమారు 6.05 కిలోమీటర్ల మొత్తం పొడవుతో, గుజరాత్‌లో 350 మీటర్ల పొడవు గల ఒక సొరంగం ఉన్నాయి. 'ముంబయి–అహ్మదాబాద్ హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ మొత్తం 508 కిలోమీటర్ల పొడవును కలిగి ఉంది. ఇందులో మొత్తం సొరంగాల పొడవు 27.4 కిలోమీటర్లు. 21 కిలోమీటర్లు భూగర్భ సొరంగాలు, 6.4 కిలోమీటర్లు ఉపరితల సొరంగాలు ఉన్నాయని అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ కారిడార్ సబర్మతి, అహ్మదాబాద్, ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, విరార్, థానే, ముంబయి వంటి ప్రధాన నగరాలను కలుపుతుంది. భారతదేశ రవాణామౌలిక సదుపాయాలలో ఒక పరివర్తనాత్మక అడుగు అని అది పేర్కొంది. బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ గణనీయమైన ఉపాధిని సృష్టిస్తోందని, కార్యకలాపాల సమయంలో అదనపు అవకాశాలను అందిస్తుందని వైష్ణవ్ అన్నారు. జపాన్ తదుపరి తరం హైస్పీడ్ బుల్లెట్ రైలు అయిన ఈ 10 షింకన్‌సెన్, 508 కిలోమీటర్ల ముంబయి–అహ్మదాబాద్ కారిడార్‌లో నడపగలదా అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆ మార్గం ఈ10 రైళ్ల వేగాన్ని కూడా తట్టుకోగలదని ఆయన అన్నారు.

## ద్రోహులను వదిలిపెట్టం

హిడ్మా మృతికి దుర్గాప్రసాద్ కారణం

విప్లవ పేరిట మావోయిస్టుల లేఖ

**ప్రజాపక్షం/ఖమ్మం:** విప్లవ ద్రోహులను వదిలిపెట్టేది లేదని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) హెచ్చరించింది. హిడ్మా మృతికి అధికార పార్టీకి చెందిన చర్ల మండల వాసి నల్లపు దుర్గాప్రసాద్ కారణమని అతనిని వదిలిపెట్టేది లేదని లేఖలో మావోయిస్టులు హెచ్చరించారు. విప్లవ పేరుతో మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను అంతమొందించి వేల ఎకరాల భూమిని మిట్టల్, రుంగ్టా స్టీల్, లాయిడ్ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆ లేఖలో ఆరోపించారు. ఇది గిరిజనులు, మావోయిస్టుల సమస్య కాదని దేశ సమస్యగా పరిగణించాలని లేఖలో మావోయిస్టులు కోరారు. ఈ మధ్య కాలంలో మావోయిస్టుల చేతిలో హతమైన కాంట్రాక్టర్ పార్టీని మోసం చేశాడని తప్పు ఒప్పుకున్నాడని అందుకే శిక్షించామన్నారు. హిడ్మాను మరికొందరు సభ్యులను మోసం చేసి మాయ మాటలు చెప్పి ఆసుపత్రికి తీసుకెళ్లిన కాంట్రాక్టర్ ఎవరో తమకు తెలిసిపోయిందని ఆ కాంట్రాక్టర్ వాయిస్ రికార్డు సైతం తమ దగ్గర ఉన్నాయని మావోయిస్టులు లేఖలో వెల్లడించారు. చర్లకు చెందిన నల్లపు దుర్గాప్రసాద్ హిడ్మాను డోకుపాడు మీదుగా కొండవాయి మార్గ మధ్యలో వాహనం ఉంచి ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి శత్రువులకు అప్పగించాడని అటువంటి దుర్గాప్రసాద్‌ను వదిలిపెట్టబోమన్నారు. ప్రజల కోసం పనిచేసే మావోయిస్టు పార్టీకి ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు, జర్నలిస్టులు, పౌర హక్కుల సంఘాలు మద్దతు ఇవ్వాలని మావోయిస్టులు ఆ లేఖలో కోరారు.

## పట్టణ ప్రాంతాల్లో నెమ్మదిగా గణన ఫారాల సేకరణ

ఓటర్లు ఇంట్లో అందుబాటులో లేకపోవడమేనని కారణమని ఇసి భావన




**న్యూఢిల్లీ :** తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాలలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో, గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల నుండి గణన ఫారాల సేకరణ చాలా తక్కువగా ఉంది. పని లేదా వృత్తిపరమైన బాధ్యతల కారణంగా ఓటర్లు ఇంట్లో అందుబాటులో లేకపోవడం, వారు నింపిన గణన ఫారాలను తిరిగి ఇవ్వకపోవడానికి అత్యంత సంభావ్య కారణమని అందుబాటులో ఉన్న గణాంకాలను ఉటంకిస్తూ ఎన్నికల సంఘం అధికారులు శుక్రవారం తెలిపారు. నిరంతర వలసలు కూడా తక్కువ ఫారాల సేకరణకు మరో కారణంగా పరిగణనిస్తున్నారు. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో బూత్ స్థాయి అధికారులతో గణన ఫారాల సేకరణ చాలా ఎక్కువగా ఉందన్నారు. లక్నో, కాన్పూర్, నోయిడా వంటి నగరాల్లో ఫారాల సేకరణ చాలా తక్కువగా ఉందని అధికారులు తెలిపారు. గతేడాది బీహార్‌లో ఓటర్ల ప్రక్షాళన కార్యక్రమం జరిగినప్పుడు పాట్నాతో సహా నగరాల్లో కూడా ఇలాంటి ధోరణే కనిపించిందని వారు చెప్పారు. ఎస్ఐఆర్ రెండవ దశ నవంబర్ 4న అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లలో ప్రారంభమైంది. ఉత్తరప్రదేశ్ మినహా మిగిలిన అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ముసాయిదా ఓటర్ల జాబితాలు ప్రచురించారు. అసోంలో, ఓటర్ల జాబితాకు సంబంధించి ప్రత్యేక 'ప్రత్యేక సవరణ' జరుగుతోంది. సమగ్ర సవరణ కోసం బీహార్ 2003 ఓటర్ల జాబితాను ఉపయోగించినటే సరిగ్గా ఎన్నికల సంఘం రాష్ట్రాల్లో చివరిగా జరిగిన ఎస్ఐఆర్ కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంటోంది. చాలా రాష్ట్రాలు 2002–2004 మధ్య ఓటర్ల జాబితా చివరి ఎస్ఐఆర్‌ను నిర్వహించాయి. అవి తమ సంబంధిత రాష్ట్రాల్లో జరిగిన చివరి ఎస్ఐఆర్ ప్రకారం ప్రస్తుత ఓటర్ల మ్యాపింగ్‌ను దాదాపు పూర్తి చేశాయి. ఎస్ఐఆర్ యొక్క ప్రాథమిక లక్ష్యం వారి జన్మస్థలాన్ని తనిఖీ చేయడం ద్వారా విదేశీ అక్రమ వలసదారులను ఏరివేయడం. బంగ్లాదేశ్, మయన్మార్ నుండి వచ్చిన వారితో సహా అక్రమ వలసదారులపై వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అణచివేత నేపథ్యంలో ఈ చర్య ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## మానవ-జంతు సంఘర్షణల నివారణకు 'ఎఐ' టూల్స్

విజయవంతంగా మొహరించాం

తమిళనాడు అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు



**చెన్నై :** మానవ–జంతు సంఘర్షణలను నివారించడానికి తమిళనాడు విజయవంతంగా ఎఐ సాధనాలను మోహరించింది. ఈ చర్య అడవి ఏనుగులకు సంబంధించిన సంఘటనలను గణనీయంగా తగ్గించిందని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి (వాతావరణ మార్పు, అడవులు) సుప్రియా సాహు అన్నారు. పిటిఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సాహు మాట్లాడుతూ వన్యప్రాణుల రక్షణ నుండి వాతావరణ మార్పు, వ్యర్థాల నిర్వహణ వరకు సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం సాంకేతికత, సమాజ భాగస్వామ్యాన్ని పొందుపరుస్తోందని అన్నారు. మదుక్కరాయ్‌లో, రైల్వే ట్రాక్‌లపై అడవి ఏనుగుల ప్రమాదవశాత్తు మరణాలను నివారించడానికి తాము కృత్రిమ మేధస్సు (ఎఐ), యంత్ర అభ్యాస (ఎంఎల్) సాంకేతికతలను మోహరించామని, దుర్బలమైన ప్రాంతాలలో ఎఐ, థర్మల్ సెన్సార్‌లతో కూడిన కెమెరాలను ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. ఈ చొరవ, వ్యవస్థ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఆటోమేటెడ్ హెచ్చరికలు స్థానిక సంఘాలు, రైలు డ్రైవర్లు, అటవీ బృందాలతో నిజ సమయంలో భాగస్వామ్యం చేయబడినందున, ఈ ప్రాంతంలో సున్నాకి దగ్గరగా ఉన్న ఏనుగుల మరణాలను సాధించడంలో సహాయపడిందని ఆమె అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను నీలగిరితో సహా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇటీవల 2025 యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ (యుఎన్ఇపి) అవార్డును అందుకున్న సాహు, రాష్ట్రం 'క్లైమేట్ స్టూడియో' ద్వారా దీర్ఘకాలిక వాతావరణ నమూనాలను కూడా నిర్మిస్తోందని అన్నారు. తాము వాతావరణ మార్పుల దశాబ్ద నమూనాలను సృష్టిస్తున్నామని, ఐఐటి మద్రాస్, అన్నా విశ్వవిద్యాలయం, గాంధీ దేవదాసన్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలు, సిఇఇడబ్ల్యు, డబ్ల్యుఆర్ఐ, ఐసిఎల్ఇఐ వంటి సంస్థలతో భాగస్వామ్యం కలిగి ఉన్నామని చెప్పారు. నగరాల్లో శీతలీకరణ మార్గదర్శకాలు, కూల్ రూఫ్ సొల్యూషన్‌లను అమలు చేయడంపై కూడా తాము యుఎన్ఇపితో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. తీరప్రాంత రక్షణపై, రాష్ట్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకుతో కలిసి, బయోషీల్డ్‌ను అభివృద్ధి చేయడానికి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీరప్రాంత సమాజాలను రక్షించడానికి తమిళనాడు బలపరిచే తీర స్థితిస్థాపకత, ఆర్థిక వ్యవస్థ (టిఎన్‌షోర్) ప్రాజెక్ట్‌ను అమలు చేస్తోందని ఆమె చెప్పారు. కొత్త మడ అడవుల ప్రాంతాలను విస్తస్తున్నామని, ఉన్న వాటిని పునరుజ్జీవింపజేస్తున్నామన్నారు.మన్నార్ గల్ఫ్‌లో సముద్ర గడ్డి, పగడపు దిబ్బలను పునరుద్ధరిస్తున్నామని, మునిగిపోయే ప్రమాదం ఉన్న ద్వీపాలను పునరుద్ధరించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడిచారు. స్థానిక సమాజాల ప్రమేయంతో పెద్ద ఎత్తున ప్రకృతి ఆధారిత పరిష్కారాలను అమలు చేస్తున్నామని చెప్పారు. పల్లపు పేరుకుపోవడాన్ని తగ్గించడానికి గృహ వ్యర్థాలను వేరు చేయడాన్ని నిర్ధారించే ప్రయత్నాలను రాష్ట్రం ముమ్మరం చేస్తోందని సాహు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో, 70 నుండి 75 కంటే ఎక్కువ ప్రదేశాలలో వారసత్వ వ్యర్థాల బయోమైనింగ్ పూర్తయిందని చెప్పారు. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కోవడానికి దీర్ఘకాలిక సుస్థిర పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో, ప్రభుత్వం పట్టణ, గ్రామ పంచాయతీల సామర్థ్యాన్ని పెంపొందించడానికి, వాటిని రీసైక్లర్లతో అనుసంధానించడానికి కృషి చేస్తోందని ఆమె తెలిపారు.

## ఆర్మీ క్యాంప్‌లో భారీ అగ్నిప్రమాదం

**చమోలి :** ఉత్తరాఖండ్ (లో ప్రమాదం చోటుచేసుకుంది. చమోలి జిల్లాలోని జోషిమఠ్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఔలి రోడ్డులో గల ఆర్మీ క్యాంప్ లో మంటలు చెలరేగాయి. క్యాంప్ లోపల ఓ దుకాణంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగ వ్యాపించింది. ప్రమాద సమయంలో ఆర్మీ క్యాంప్‌లో దాదాపు 100 మంది జవాన్లు ఉన్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టింది. మంటలను అదుపుచేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అధికారులు స్పాట్‌లో ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# బళ్లారిలో హింసాత్మక ఘటనలు

నలుగురిపై ఎఫ్ఐఆర్, విచారణకు సిఎం ఆదేశం



**బళ్లారి :** కర్నాటకలోని బళ్ళారిలో ఉన్న వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముందు బ్యానర్ల ఏర్పాటు విషయంలో హింస చెలరేగింది. ఈ ఘర్షణలకు సంబంధించి నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గురువారం జరిగిన ఈ ఘర్షణల్లో ఒకరు మరణించారు. ఈ ఘర్షణలకు సంబంధించి కేసు నమోదైన వారిలో బిజెపి ఎమ్మెల్యే జనార్దన రెడ్డి కూడా ఉన్నారు.ఈ ఘటనపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారణకు ఆదేశించారు. బిజెపి ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యే భరత్ రెడ్డి మద్దతుదారుల మధ్య బ్యానర్ల ఏర్పాటు విషయంలో ఘర్షణలు చెలరేగినట్లు ఆరోపణలు వచ్చిన మరుసటి శుక్రవారం పరిస్థితి ప్రశాంతంగా ఉన్నప్పటికీ, బళ్లారిలో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘర్షణలకు సంబంధించి బిజెపి ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వాల్మీకి విగ్రహావిష్కరణకు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో గురువారం హవంబవి ప్రాంతంలోని జనార్దన్ రెడ్డి నివాసం ముందు జనార్దన్ రెడ్డి, శ్రీరాములు మద్దతుదారులకు, స్థానిక ఎమ్మెల్యే భరత్ రెడ్డి, ఆయన మద్దతుదారుడు సతీష్ రెడ్డి మద్దతుదారులకు మధ్య గొడవ జరిగిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఇన్‌చార్జ్) రంజిత్ కుమార్ బండారు తెలిపారు. 'రాళ్ల దాడి జరిగింది. ప్రమాదవశాత్తు కాల్పులు జరగడంతో ఒక వ్యక్తి మరణించాడు. ఇదంతా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆ తర్వాత పోలీసులు గుమిగూడిన ప్రజలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు' అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉందని పేర్కొంటూ 'అదనపు బలగాలను రప్పించాము. పది కర్ణాటక రాష్ట్ర రిజర్వ్ పోలీస్ (కెఎస్ఆర్‌పి), 12 జిల్లా సాయుధ రిజర్వ్ (డిఎఆర్) బృందాలు వచ్చాయి. చిత్రదుర్గ, కొప్పళ, విజయనగర జిల్లాల నుండి అధికారులు, బలగాలను పిలిపించి, బందోబస్తు ఏర్పాటు చేశాము, మరణించిన రాజశేఖర్ రెడ్డి మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించాము.ఆయన అంత్యక్రియల కోసం అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశాము' అని ఆయన చెప్పారు. పోలీసుల వైఫల్యం ఆరోపణను ఖండిస్తూ, ఎస్‌పి మాట్లాడుతూ, పోలీసులు పరిస్థితికి వెంటనే స్పందించారని, అయితే సంఘటనలు ఆకస్మికంగా జరగడం, ప్రజలు వేగంగా గుమిగూడటంతో మొదట పరిస్థితి అదుపులోకి రాలేదని, కానీ ఆ తర్వాత పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, బాధితుడికి తగిలిన బుల్లెట్ పోలీసుల ఆయుధం నుండి వచ్చినది కాదని ఆయన అన్నారు, రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత భరత్ రెడ్డి మద్దతుదారుల ఫిర్యాదు ఆధారంగా హత్య కేసుతో సహా నాలుగు కేసులు నమోదు అయ్యాయని, సతీష్ రెడ్డి తరఫున హత్యాయత్నం కేసు నమోదు అయిందన్నారు. ఒక వ్యక్తి జనార్దన రెడ్డిపై ఎస్సీ/ఎస్టీ కేసు పెట్టాని, ఈ ఘటనలో ఉన్న, పాల్గొన్న వారందరిపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన అన్నారు. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (శాంతిభద్రతలు) ఆర్ హితేంద్ర మాట్లాడుతూ, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని చెప్పారు. ఇప్పటివరకు ఐదు తుపాకులను స్వాధీనం చేసుకున్నాని, మరిన్ని తుపాకులను స్వాధీనం చేసుకుంటామని, ఎవరెవరికి లైసెన్సులు ఉన్నాయి, ఎవరికి లైసెన్సులు లేవు, ఎవరు నిబంధనలను ఉల్లంఘించారు అనే దానిపై కూడా విచారణ జరుగుతోందని ఆయన చెప్పారు. పోలీసుల వైఫల్యంపై కూడా విచారణ జరుపుతామని ఆయన చెప్పారు. కాగా, బెంగళూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విలేకరులతో మాట్లాడుతూ 'బుల్లెట్ ఎవరి తుపాకీ నుండి పేల్చబడిందో మనం తెలుసుకోవాలి..... నేను విచారణకు ఆదేశించాను..... గాలిలోకి కాల్చిన బుల్లెట్ రాజశేఖర్ రెడ్డికి తగిలింది. అతను మరణించాడు. నివేదిక సమర్పించాలని నేను అధికారులను కోరాను' అని ఆయన అన్నారు.

## వివాహ సంబంధమైన కలహాలలో భర్త ఆర్థిక ఆధిపత్యం 'క్రూరత్వం' కాదు

•'సుప్రీంకోర్టు' స్పష్టీకరణ • వేధింపులకు పాల్పడ్డాడన్న భార్య ఫిర్యాదుపై నమోదైన క్రిమినల్ కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ :** వైవాహిక సంబంధం చెడిపోయినప్పుడు తన విడిపోయిన భార్యపై భర్త ఆర్థికంగా ఆధిపత్యం చెలాయించడం క్రూరమైన చర్య కాదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. క్రిమినల్ వ్యాజ్యం 'వ్యక్తిగత కక్షలను పరిష్కరించడానికి, కోపం తీర్చడానికి ఒక మార్గం కాదు' అని హితవు పలికింది. భార్య విడిపోయిన తన భర్త క్రూరత్వం ప్రదర్శించడం సహా వరకట్న వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ దాఖలు చేసిన క్రిమినల్ కేసును న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కొట్టివేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కనపెడుతూ, ఫిర్యాదుదారుప్రతివాది నెంబర్ 2 ఆరోపించినట్లుగా నిందితుడిఅప్పీలెంట్ ద్రవ్య, ఆర్థిక ఆధిపత్యం ముఖ్యంగా ఎలాంటి మానసిక లేదా శారీరక హాని జరగనపుడు క్రూరత్వానికి ఒక ఉదాహరణగా పరిగణించబడదని న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. 'వారు మాట్లాడుతూ ఇంటి పురుషులు తరచుగా మహిళల ఆర్థిక వ్యవహారాలపై ఆధిపత్యం చెలాయించడానికి, వారిపై నియంత్రణ సాధించడానికి ప్రయత్నించే భారతీయ సమాజానికి పరిస్థితి అద్దం పడుతుందని వారు చెప్పారు. కానీ నేరారోపణలు పరిష్కారానికి వ్యక్తిగత కక్షలు రేకెత్తించడానికి ఒక ద్వారం లేదా సాధనంగా ఎట్టిపరిస్థితులలో మారకూడదు' అని ధర్మాసనం తరపున తీర్పు రాసిన జస్టిస్ నాగరత్నం విడిపోయిన భర్త పంపించిన డబ్బు ఖర్చుల వివరాలను కోరే చర్యను క్రూరమైన చర్యగా పరిగణించడానికి నిరాకరించారు. 'ఫిర్యాదులను పరిష్కరించడంలో కోర్టులు చాలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. వివాహ కేసులను ప రి ష్కరించేటప్పుడు ఆచరణాత్మక వాస్తవాలను పరిగణనలోనికి తీసుకోవాలి.ఇక్కడ ఆరోపణలను మరింత జాగ్రత్తగా, వివేకంతో పరిశీలించాలి. తద్వారా న్యాయం తప్పిపోకుండా, చట్ట ప్రక్రియ దుర్వినియోగం కాకుండా నిరోధించవచ్చు'అని ధర్మాసనం పేర్కొంది. ఖర్చులకు సంబంధించిన విభేదాలను 'వివాహంలో దైనంది న కష్టాల' ప్రతిబింబంగా పేర్కొంది. అటువంటి చర్యలను భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 498 (వివాహిత స్త్రీని భర్త లేదా అతడి బంధువులు క్రూరత్వానికి గురిచేయడం) కింద క్రూరత్వంగా వర్గీకరించలేమని పేర్కొంది. గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను చాలా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత నిందితుడైనభర్తపై ఆరోపించబడిన నేరాలేవీ బయటపడలేదని ధర్మాసనం పేర్కొంది.'వాస్తవానికి ఇక్కడ నిందితుడుఅప్పీల్‌దారుడిపై క్రూరత్వం, మానసిక వేధింపులు, స్వచ్ఛందంగా హాని కలిగించడం వంటి ఆరోపణలు అస్పష్టమైన, సాధారణ ఆరోపణలతో దురుద్దేశంతో చేసినటు కనుగొన్నాం' కోర్టు పేర్కొంది.

ప్రజాపక్షం
శనివారం, 03 జనవరి

# ప్రశ్నించటం నేరమా?

ప్రజా ప్రయోజనం రీత్యా అధికారులను, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులను ప్రశ్నించటం ప్రతికా స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన రక్షణ నుంచి పాత్రికేయులకు లభించిన హక్కు. అయితే కొందరు రాజకీయ నాయకులు తమను ఇబ్బందిపెట్టే ప్రశ్నలను సహించరు. ఆ ప్రశ్న అడిగిన పాత్రికేయుడికి రాజకీయాలు అంటగడతారు. అధికారం చేతిలో ఉన్న నాయకులైతే కేసులు బనాయిస్తారు. అటువంటి రెండు ఘటనలను చూదాం. స్వచ్ఛతకు పేరుపొందిన మధ్యప్రదేశ్‌లో కలుషితమైన నీరుతాగి 10 మంది పిల్లలు చనిపోయారు. ఒక విలేకరి ఈ విషయమై బిజెపి సీనియర్ నాయకుడు, మంత్రి కైలాస్ విజయవర్గీయను ప్రశ్నించగా ఆయనకు ఒళ్లు మండినట్లుంది– చెత్తప్రశ్నలు అడక్కు అని వారించారు. అయితే విలేకరి మంత్రి జవాబుకోసం మళ్లీ ప్రశ్నించగా, ఏ విషయాన్నైనా త్రోసిపుచ్చటానికి సర్వసాధారణంగా ఉపయోగించే ''ఘంటా'' (''నాన్సెన్స్ లేదా చెత్త'') పదం ఉపయోగించారు. ఆ వీడియో వైరల్ అయింది. 'సార్ సంస్కారవంతమైన భాష ఉపయోగించండి' అని విలేకరి అనటం కూడా ఆ వీడియోలో వినిపించిందట!

అటువంటి ప్రశ్నలు మన దేశంలో అరుదుకాదు. మంత్రులు, రాజకీయ నాయకులు సాధారణంగా తమ అనుకూల ప్రచారాన్నే కోరుకుంటారు. ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎదురైనప్పుడు కొందరు ముఖం ముడుచుకుని తప్పుకుని వెళ్లిపోతారు. కొందరు లౌక్యంగా కోపాన్ని చిరునవ్వుతో దాచుకుంటూ మాట్లాడకుండా వెళ్లిపోతారు. మరికొందరు విలేకరులపై కోపం వెళ్లగక్కుతారు. అధికార దుర్వినియోగానికి పాల్పడి కేసులు బనాయిస్తారు. ఈ తరహా ఘటన ఒకటి 'మార్పు మా తీర్పు' అని గొప్పలకు పోయే ఆమ్ ఆద్మీపార్టీ (ఆప్) ఏలుబడిలోఉన్న పంజాబ్‌లో జరిగింది. ''పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ దేశంలో లేనప్పుడు ఆయన హెలికాప్టర్‌ను ఎవరు ఉపయోగించారు?'' ఇదీ ప్రశ్న. ఇది కొందరు పంజాబ్ పాత్రికేయులు, సోషల్ మీడియా యాక్టివిస్టులను ఇబ్బందుల్లో పడేసింది. వారుపెట్టిన పోస్ట్ 'వక్రీకరణలతో కూడినదని, రూఢి చేసుకోని వాస్తవాలపై ఆధారపడిందని' ఆరోపిస్తూ పంజాబ్ పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. 'ఈ తప్పుదారి పట్టించే సమాచారం పెద్దగా సర్క్యులేట్ కావటం వ్యవస్థ నిజాయితీని దెబ్బతీసేదిగా ఉందని, సామాజిక విభజన తెచ్చే ప్రమాదం ఉందని, సున్నితమైన సరిహద్దు రాష్ట్రం పంజాబ్‌లో శాంతి–భద్రతలను, పరిపాలనా సామరస్యాన్ని దెబ్బతీసేదిగా ఉందని' కూడా ఎఫ్ఐఆర్ పేర్కొన్నది.

''సిఎం భగవంత్ మాన్ లేనప్పుడు ఆయన ఉపయోగించే ప్రభుత్వ హెలికాప్టర్లను ఎవరు ఉపయోగించారు అని ప్రశ్నించినందుకు నాపై, జర్నలిస్ట్ మింటో గురుసారియా, మనీందర్‌జిత్ సిధు తదితరులపై ఆప్ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది'' అని ఎఫ్ఐర్‌లో పేరు కలిగినటువంటి వ్యక్తులలో ఒకరైన మాణిక్ గోయల్ తన ట్విట్టర్ అకౌంట్ @Manik Goyal/ రాశారు. మరీ చిత్రమేమంటే, హెలికాప్టర్, విమానం ఉపయోగించటం, దానికైన వ్యయం గూర్చిన సమాచారాన్ని ఆర్‌టిఐ కింద నాలుగేళ్ల నుంచి అడుగుతున్నా ప్రభుత్వం సమాచారమివ్వలేదట! ఇప్పుడు సోషల్ మీడియాలో న్యాయమైన ప్రశ్నలు లేవనెత్తగానే ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఇదేనా ప్రజాస్వామ్యం? ''ఇదేనా మీరు వాగ్దానం చేసిన మార్పు–అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వకుండా గొంతు నొక్కటమేనా?''అని మాణిక్ గోయల్ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను, ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌ను ప్రశ్నించారు.

ప్రభుత్వ చర్యను పత్రికా స్వేచ్ఛపై, వాక్ స్వాతంత్ర్యంపై ప్రత్యక్షదాడిగా పేర్కొంటూ పంజాబ్–చండీఘడ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆందోళనకు పిలుపు ఇచ్చింది. ప్రభుత్వ చర్య విమర్శనాత్మక రిపోర్టింగ్‌పట్ల అసహనాన్ని ప్రతిబింబిస్తున్నదని చండీఘడ్ ప్రెస్‌క్లబ్ విమర్శించింది. ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులు ఆప్ ప్రభుత్వ చర్యను అప్రజాస్వామికంగా, బెదిరింపు చర్యగా ఖండించారు. ప్రభుత్వం ఎఫ్ఐఆర్‌ను ఉపసంహరించుకుని ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి. ప్రత్యామ్నాయ రాజకీయంతో అధికారంలోకి వచ్చిన ఆప్ ప్రభుత్వం ప్రజలు తనలో ఉంచిన విశ్వాసాన్ని సంరక్షించుకుంటుందని ఆశించుదాం!

# రేవంత్ 'వ్యూహం'లో కెసిఆర్ ఉక్కిరిబిక్కిరి!



ఎస్.కె.జకీర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహం ఫలించింది. ఎట్టకేలకు కెసిఆర్‌ను అసెంబ్లీకి రప్పించగలిగారు. మాజీ సిఎం, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్‌కు పరిమితమైపోయారు. ఇటీవల బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపిలు, పార్టీ నాయకుల సమావేశంలో కెసిఆర్ పాల్గొని మళ్ళీ ఫార్మ్‌హౌజ్‌కు వెళ్లిపోయారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ఆయన హాజరయ్యేది, లేనిదీ చివరి నిమిషం వరకు బిఆర్ఎస్ పార్టీ నాయక త్వం సస్పెన్సుగా ఉంచింది. కెసిఆర్ వచ్చినంత వేగంగా అసెంబ్లీ నుంచి వెనక్కి వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒక విలన్‌గా చూపడానికి, రైతాంగంలో ఆయన పట్ల పెద్ద ఎత్తున వ్యతిరేకతను సృష్టించడానికి బిఆర్ఎస్ పార్టీ ఒక ప్రణాళిక ప్రకారం పని చేస్తున్నది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి సమస్యలపై ఈ సమావేశాల్లో చర్చ జరగనుంది. బిఆర్ఎస్ తరపున కేటీఆర్,హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పలు సందర్భాల్లో ఇరుకున పెట్టేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అయితే వాళ్ళిద్దరినీ తనకు సమ ఉజ్జీ కాదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. కెసిఆర్‌తోనే అమీతుమీ తేల్చుకోవాలనుకుంటున్నారు. కెసిఆర్‌తో తలపడితే ఆ కిక్కు వేరని ముఖ్యమంత్రి భావన. తన బద్ధ విరోధి రేవంత్ సిఎం కావడం కెసిఆర్‌కు బొత్తిగా సహించని అంశం.ఆయన సపరివారం కూడా అదే ధోరణిలో వ్యవహరిస్తున్నది.

ప్రజల్ని తమ యాస, భాషలతో ఆకట్టుకోవడం అనే 'కళ' లో కెసిఆర్ పరివారంతో ఎవరూ పోటీ పడలేరు. రైతులకు అన్యాయం జరిగిపోయిందని ఆ పార్టీ నాయకులు ఇంచుమించు కన్నీళ్లు పెట్టుకోవడం, శ్రోతల్ని ఏడిపించడం ఆ 'పరివారానికి సులువైన పని. పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మరికొన్ని ప్రాజెక్టులు, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావలసిన వాటా వంటి అంశాలలో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు వాదించే తీరు పరిశీలిస్తే వాళ్ళ వాదనే నిజమేమో అనే భ్రమ కలుగుతుంది.

''ముఖ్యమంత్రి కెసిఆర్ ఫాంహౌస్‌ను మేం చూడాలనుకుంటున్నాం. దేశంలోనే ఆయన ఆదర్శ రైతు. తనకు ఎకరానికి కోటి రూపాయలు ఆదాయం వస్తుందని కెసిఆర్ ప్రకటించారు. తక్కువ పొలంలో ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్న కెసిఆర్, తన ఫాంహౌస్‌ను రైతులకు, ఎమ్మెల్యేలకూ చూపించాలి. ఆయన పాటించే వ్యవసాయ పద్ధతులను మేం కూడా నేర్చుకుంటాం''. 2015 సెప్టెంబర్‌లో తెలంగాణ అసెంబ్లీలో రైతు ఆత్మహత్యలపై చర్చ సందర్భంగా కెసిఆర్ పై నాటి టిడిఎల్‌పి నేత ఎర్రబెల్లి దయాకర్ రావు సెటైర్ వేశారు. దయాకరరావు ఆ తర్వాత బిఆర్ఎస్ పార్టీలో చేరిపోయారు. అది వేరే సంగతి. కాని ఒక ఎకరం పంటకు కోటి రూపాయల ఆదాయం వస్తున్నట్టు కెసిఆర్ చెప్పిన విషయం చాలాకాలం కిందట ఒక సంచలనం. తెలంగాణలోని మిగతా రైతులకు కూడా ఆ 'ఫార్ములా' తెలిస్తే, ఇక సంక్షోభం, ఆత్మహత్యలు ఉండకపోవచ్చు.

కాగా ''కెసిఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డి వ్యవసాయరంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. భూములు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారు. ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రోజుకొక రైతు రాలిపోతున్నాడు'' అని మాజీమంత్రి హరీశ్‌రావు గతంలో ఆరోపించారు. 2023 డిసెంబర్ వరకు తొమ్మిదిన్నర ఏండ్లపాటు అధికారంలో ఉన్న పార్టీ బిఆర్ఎస్. కెసిఆర్ హయాంలో చేసిన అప్పులు ఇప్పుడు రైతుల పాలిట 'యమపాశం' గా మారినట్టు కాంగ్రెస్ పార్టీ నాయకులు అంటున్నారు.

బిఆర్ఎస్ ప్రాపగాండాను నమ్మినవారు సులభంగా 'ఇంద్రజాలం'లో చిక్కుకుంటారు. బిఆర్ఎస్ మాటలు వింటుంటే అదివరకు కరెంటు లేదని, సాగులేదని, నీళ్ల లేవని కెసిఆర్ సిఎం అయిన తర్వాతే ఆయన దూరదృష్టితో తెలంగాణను సుసంపన్నం చేశారని మనకు అనుమానం కలుగుతుంది. రేవంత్ రెడ్డి రాగానే ఒక్కసారిగా పరిస్థితులు తలకిందులయి, రైతులు 'అన్నమో రామచంద్రా' అంటూ అలమటిస్తున్నట్లు, గత్యంతరం లేక బలవన్మరణాలకు పూనుకుంటున్నట్లు బిఆర్ఎస్ నాయకుల ఆరోపణ. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేబట్టి రెండేండ్లు గడిచాయి. ''ఇప్పుడిప్పుడే గడ్డకు పడినం. ఇంకో పదేండ్లలో తెలంగాణ రైతు, దేశంలోనే గొప్ప రైతుగా గుర్తింపును పొందుతాడు.''!అని కెసిఆర్ నాలుగేండ్ల కిందట చెప్పిన ముచ్చట. కెసిఆర్ పదేండ్ల హయాంలో కేవలం 'గడ్డకు' పడడ మే జరిగింది. రైతును రాజు చేయడానికి మరో పదేళ్లు పడుతుందని మనం అర్థంచేసుకోవాలి.'' ఈసారి అధికారంలోకి వస్తే పదిహేనేళ్ళ పాటు బిఆర్ఎస్‌కు తిరుగుండదు'' అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ శాసనసభాపక్షం ఉపనాయకుడు హరీశ్ రావు తరచూ అంటున్నారు.

''తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సిఎం పదవి అనేది పెద్ద విషయం కాదు. తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేదాకా, కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో ఆగమైతున్న తెలంగాణను గాడిలో పెట్టేదాకా పోరాటం కొనసాగుతూ ఉంటుంది. తెలంగాణలో అద్భుతమైన ప్రగతిని సాధించుకున్నాం. ఇటువంటి కీలక సమయం లో ప్రజలు ఊహించని తీర్పునిచ్చారు. కొన్నికొన్ని సార్లు ఇట్లాంటి తమాషాలు జరుగుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అలవిగాని హామీలను నమ్మి ప్రజలు మోసపోయారు. పాలిచ్చే బర్రెను వొదిలి దున్నపోతును తెచ్చుకున్నట్లు ప్రజలు బాధపడుతున్నారు'' అని కెసిఆర్ అధికారం కోల్పోయాక ఒక సందర్భంలో తనను కలిసిన నాయకులతో అన్నారు.

'తెలంగాణ సాధించిన ఘనత కన్నా నాకు సిఎం పదవి అనేది పెద్ద విషయం కాదు' అని కెసిఆర్ అంటున్నప్పుడు అధికారం చేజారిపోగానే ఫార్మ్ హౌజ్‌కు ఎందుకు పరిమితమైనట్లు? తెలంగాణ సాధించినందున తానే శాశ్వత సిఎంగా తనను తాను ఊహించుకున్నారేమోనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యమంత్రిగా కెసిఆర్ చేసిన విన్యాసాలు అన్నీ, ఇన్నీ కావు. దేశంలో వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు, రైతుల స్థితిగతులను మెరుగుపరచడానికి గాను ఒక సదస్సు నాటి 'గడీ భవన్' లో నిర్వహించారు. రైతులు, రైతు సంఘాల నేతలకు వ్యవసాయం, నీటిపారుదల, ఇతర రంగాల్లో తెలంగాణ సాధించిన విజయాల డాక్యుమెంటరీని కెసిఆర్ ప్రదర్శించారు.

''కేంద్రప్రభుత్వం దిక్కుమాలిన పాలన సాగిస్తోంది. పౌరుల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైంది దీనికి గల కారణాలను పరిశోధించాలి''అని ఆయన అన్నారు. కెసిఆర్‌తో జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 100 మంది సీనియర్ రైతు నాయకులు పాల్గొన్నారు. కానీ కెసిఆర్ అధికారం కోల్పోగానే వాళ్ళందరూ మాయమైపోయారు.

అప్పటికప్పుడు అల్లిన పిట్ట కథలు చెప్పడంలో, ఏ రంగంలోని వారినయినా మెస్మరైజ్ చేయడంలో కెసిఆర్‌ను మించిన వారు ఈ దేశంలో మరెవరూ ఉండరు అని ఢిల్లీకి చెందిన సీనియర్ జర్నలిస్టు ఒకరు వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 25 లక్షల మంది రైతు కుటుంబాలకు 21వేల కోట్ల రూపాయల మేరకు రుణమాఫీ చేసిన చరిత్ర దేశంలోనే తెలంగాణ ప్రథమం అని రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పలకు పోయి అనర్హులకు ఆయాచిత లబ్ధి చేకూర్చిందన్న అధికారపార్టీ విమర్శలకు బిఆర్ఎస్ దగ్గర సరైన జవాబు లేదు. రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు, రాజీవ్ రహదారి, శ్రీశైలం హైవే, క్రషర్లు, మైనింగ్ భూములు, కోళ్ల ఫారాలు తదితర వ్యవసాయేతర భూములకు కూడా రైతు బంధు ఇచ్చారు. సాగుచేయని భూములకు రూ.22,606 కోట్లు రైతుబంధు ద్వారా అందిన మాట నిజం. దానికి కెటిఆర్ దగ్గర సరయిన జవాబు లేకపోవచ్చు.

కాగా ''తుమ్మిడిహెట్టి వద్ద కాదంటూ మేడిగడ్డకు బ్యారేజీని తరలించారు. జూరాలలో కాకుండా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును శ్రీశైలానికి మార్చారు. ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ మోటార్లు, పంపుల్లో కమీషన్లే బిఆర్ఎస్ కు ప్రామాణికంగా మారాయి. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 100 మీటర్ల ఎత్తులో ఉన్న తుమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత లేదంటూ 100 మీటర్ల దిగువన ఉన్న మేడిగడ్డకు బ్యారేజీని తరలించారు. అలాగే జూరాల ప్రాజెక్టులో నీళ్ల లేవంటూ 100 మీటర్ల కింద ఉన్న శ్రీశైలం ప్రాజెక్టుకు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మార్చారు. ఈ రెండింట్లోనూ కమీషన్ల కోసం కక్కుర్తి పడ్డారు. 2014కు ముందు ప్రతిపాదించిన పాలమూరు–రంగారెడ్డికి పునర్వ్యవస్థీకరణ చట్టం రక్షణ ఉండేది. ఈ ప్రాజెక్టును మార్చడం వల్ల రక్షణలు కోల్పోయింది.

తుమ్మిడిహెట్టి లాగే జూరాలకూ కెసిఆర్ అన్యాయం చేశారు. బిఆర్ఎస్ ఈ ప్రాజెక్టును 7.15 టిఎంసిలతో తాగునీటి అవసరాలకే కట్టాలని ప్రయత్నిస్తే.. మేం తొలివిడతలో 45 టిఎంసిలు, మలి విడతలో కృష్ణా జలాల పంపిణీ జరిగిన తర్వాత మరో 45 టిఎంసిలు కలిపి 90 టిఎంసిలతో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కృష్ణా జలాల విషయంలో బిఆర్ఎస్ ఘోర తప్పిదాలు చేసింది. మేం వాటిని సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై బిఆర్ఎస్‌కు శ్రద్ధ లేదు. కక్షతోనే నిధులు కేటాయించలేదు'' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

''శ్రీశైలం ప్రాజెక్టును పూర్తిగా ఏపీకి కట్టబెట్టాలని నిర్ణయించిందే బీఆర్ఎస్.శ్రీశైలం ప్రాజెక్టులో 797 అడుగుల కింది నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా రాయలసీమ ఎత్తిపోతల పథకం బీఆర్ఎస్ సహకారంతో ముందుకు కదిలింది జగన్తో కుమ్మక్కై శ్రీశైలం ప్రాజెక్టును ఏపీకి అప్పగించే కుట్రలు చేశారు.రాయలసీమ ఎత్తిపోతలపై పాలమూరుకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ కేసు వేశాకే ప్రభుత్వం ఇంప్లీడ్ అయింది.జూరాల ప్రాజెక్టు నుంచి 70 టీఎంసీల నీటిని తరలించి 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడానికి వీలుగా 2013 ఆగస్టు 8న ఉమ్మడి ఏపీలో జీవో ఇచ్చారు.నిజంగా కృష్ణా జలాలను మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డికి తరలించాలనే చిత్తశుద్ధి ఉంటే.. తొలి దశలో జూరాల నుంచి ప్రాజెక్టును చేపట్టి, మలిదశలో శ్రీశైలం నుంచి చేపట్టాల్సి ఉండేది.ఇక రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయించింది కాంగ్రెస్ పార్టీయే'' అని కూడా మంత్రి చెప్పారు.

పోలవరం–బనకచర్లను నిలుపుదల చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం వేసిన పిటిషన్ ఈ జనవరి 5న విచారణకు రానున్నది. పోలవరం–బనకచర్లను అడ్డుకోవడానికి నిరంతరం ప్రభుత్వం పోరాటాలు చేస్తుండగా బిఆర్ఎస్ నేత హరీశ్ రావు ఈ ప్రాజెక్టుపై కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు పలుమార్లు ప్రభుత్వం లేఖలు రాసింది. 'సిడబ్ల్యుసి, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా బోర్డులకు ఫిర్యాదు చేసింది.

మొత్తంమీద పాలమూరు జిల్లాకు రావలసిన కృష్ణా జలాల వాటాపై కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య అసెంబ్లీ సమావేశాల్లో భీకర సమరమే జరగనుంది.

# గ్రామ స్వరాజ్యానికి చరమగీతం?

భారతీయ గ్రామీణ పేదల పాలిట సంజీవనిగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MGNREGA) ఇప్పుడు తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ్)' (VBG RAM G) బిల్లు, కేవలం పేరు మార్పుకే పరిమితం కాకుం డా, రెండు దశాబ్దాలుగా పేదవాడికి అండగా ఉన్న 'ఉపాధి హక్కు'ను ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే 'పథకం'గా మార్చివేసింది. 2005 చట్టం ద్వారా లభించిన చట్టబద్ధమైన హక్కులను కాలరాస్తూ, అధికారాలను కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకోవడంపై ఇప్పుడు దేశవ్యాప్తంగా మేధావులు, ఆర్థికవేత్తలు మరియు రాష్ట్ర ప్రభుత్వాలు గళమెత్తుతున్నాయి. పాత MGNREGA చట్టంలోని సెక్షన్ 4(3) మరియు షెడ్యూల్-I నిబంధనలు ఇప్పటికే 60 శాతం పనులు ఆస్తుల సృష్టికే ఉండాలని స్పష్టం చేశాయి. అయితే, క్షేత్రస్థాయిలో గుంతలు తవ్వడం వంటి తాత్కాలిక పనులకే నిధులు వృధా అవుతున్నాయనే సాకుతో, కొత్త బిల్లులో పనుల ఎంపిక ప్రక్రియను కేంద్రం పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంది. ఇకపై గ్రామ పంచాయతీలు తమ ఊరికి ఏది అవసరమో నిర్ణయించే స్వేచ్ఛను కోల్పోతాయి. పనులు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన 'జాతీయ ఎజెండా'కు అనుగుణంగానే ఉండాలి. ప్రతి గ్రామానికి ఉండే భౌగోళిక, సామాజిక అవసరాలు భిన్నంగా ఉంటాయనే వాస్తవాన్ని విస్మరించి, ఢిల్లీ నుంచి పనులను రుద్దడం 'గ్రామ స్వరాజ్యం' ఆశయానికే విరుద్ధమని విమర్శకులు మండిపడుతున్నారు. ఇది రాజ్యాంగంలోని 73వ సవరణ ద్వారా పంచాయతీలకు కల్పించిన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని మేధావుల సంతకాలతో కూడిన విజ్ఞప్తి పత్రాలు హెచ్చరిస్తున్నాయి.

**రాష్ట్రాలపై ఆర్థిక భారం :పేదవాడి పొట్ట కొట్టే 40 శాతం నిబంధన**

ఆర్థికపరంగా చూస్తే, ఈ బిల్లు రాష్ట్ర ప్రభుత్వాల మెడకు ఉరితాడులా మారింది. గతంలో నైపుణ్యం లేని కార్మికుల వేతనాల కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు 90 శాతం నిధులను భరించేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యయంలో 40 శాతాన్ని భరించాల్సి ఉంటుంది. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉండి, ఆదాయ వనరులు లేక అల్లాడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలకు ఇది పెను భారంగా మారనుంది. 'కేంద్రం పథకాలకు పేర్లు మార్చుకుంటూ, భారాన్ని మాత్రం రాష్ట్రాలపై వేస్తోంది' అని పలువురు రాష్ట్ర ఆర్థిక మంత్రులు తీవ్రంగా నిరసిస్తున్నారు. రాష్ట్రాలు తమ వాటా నిధులను విడుదల చేయడంలో ఒక్క రోజు ఆలస్యం చేసినా, అది నేరుగా కూలీల వేతనాలపై ప్రభావం చూపుతుంది. నిధుల భారం పెరగడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనులను నిరుత్సాహపరిచే ప్రమాదం ఉంది, ఇది అంతిమంగా పేదవాడి ఆకలి కేకలకు దారితీస్తుంది.

మరో అత్యంత వివాదాస్పద మార్పు ఉపాధి దినాల పెంపు మరియు 'పని సెలవు' నిబంధనలో కనిపిస్తోంది. MGNREGAలో ఉన్న 100 రోజుల పరిమితిని 125 రోజులకు పెంచినట్లు కనిపిస్తున్నా, దాని వెనుక ఉన్న షరతులు భయం గొల్పుతున్నాయి. వ్యవసాయ పనుల సమయంలో 'పని సెలవు' ప్రకటించే నిబంధన నేరుగా గ్రామీణ పేద కార్మికులను దెబ్బతీస్తుంది. ఉపాధి పనులు లేని సమయంలో కార్మికులు తక్కువ కూలీకి వ్యవసాయ భూస్వాముల వద్ద పని చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది ఆహార ధరల స్థిరత్వానికి ఉపయోగపడవచ్చు కానీ, నైపుణ్యం లేని కార్మికుల బేరసారాల శక్తిని (Bargaining Power) పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. 'రైతులకు కూలీలు దొరకడం లేదనే సాకుతో మమ్మల్ని తక్కువ కూలీకి వ్యవసాయ పనుల్లోకి నెట్టాలని ప్రభుత్వం చూస్తోంది' అని వ్యవసాయ కూలీల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

**హక్కుల హరణం..చట్టబద్ధత నుంచి ప్రభుత్వ దయ వరకు**

ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనపై చూపిస్తున్న శ్రద్ధ, గ్రామీణ పేదల కనీస ఆదాయ భద్రతపై చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. MGNREGA అనేది ఒక 'చట్టబద్ధమైన హక్కు' (Legal Right), కానీ RAMG బిల్లు దానిని ప్రభుత్వ ప్రణాళికాబద్ధమైన కేటాయింపుల (Normative Allocation) వైపు మళ్ళిస్తోంది. అంటే, బడ్జెట్లో నిధులు ఉంటేనే పని దొరుకుతుంది తప్ప, పని అడిగితే ఇవ్వాలనే నిబంధన బలహీనపడింది. దీనిపై దేశంలోని ప్రముఖ ఆర్థికవేత్తలు మరియు 'నైరెక్' (NREGA Sangharsh Morcha) వంటి సంస్థలు బహిరంగ లేఖ ద్వారా తమ నిరసనను వ్యక్తం చేశాయి. జాతిపిత పేరును తొలగించడం వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాల కంటే, ఆయన ఆశించిన గ్రామ స్వయం సమృద్ధిని దెబ్బతీయడమే ప్రధాన ఆందోళనగా మారింది.

**సమాఖ్య స్ఫూర్తికి పరీక్షా సమయం**

గత 20 ఏళ్లలో దాదాపు ₹10 లక్షల కోట్లు ఖర్చు చేసినా మన్నికైన ఆస్తులు రాలేదనే నెపంతో తెచ్చిన ఈ మార్పులు, నిజంగా గ్రామాల రూపురేఖలు మారుస్తాయా? లేక రాష్ట్రాలపై భారం వేసి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఈ బిల్లు విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే, రాష్ట్రాలు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. అభివృద్ధి పేరిట అధికారాలను కేంద్రీకరించడం వల్ల గ్రామీణ పేదల బతుకులు మరింత దుర్భరంగా మారుతాయనేది విశ్లేషకుల హెచ్చరిక. ప్రధాని మోదీ ప్రభుత్వం తన నిర్ణయం సరైనదని నిరూపించుకోవాలంటే, నిధుల విడుదల, పనుల అమలులో రాజకీయ ప్రయోజనాలకు తావులేకుండా చూడాల్సి ఉంటుంది.

**వెంకగారి భూమయ్య**

# దళితులకు కొరవడిన సామాజిక న్యాయం

## అందని ద్రాక్షగా నిలిచిపోయిన సంక్షేమ పథకాలు



చాడ వెంకటరెడ్డి
మాజీ ఎమ్మెల్యే,
సిపిఐ సీనియర్ నాయకులు

ప్రపంచంలో దాదాపుగా చిన్న, పెద్ద దేశాలు 200 వరకు ఉన్నప్పటికీ భారతదేశంలో వర్ణ వ్యవస్థ వేలాది సంవత్సరాలుగా వేళ్లానుకొని ఉన్నది. దీనితో మతాలు, కులాలుగా విభజింపబడి అణచివేతలకు గురవుతూ, అంటరానితనంతో వెలివేయబడుతూ మానసిక వ్యధకు లోనై తలరాత ఇలానే రాసి ఉన్నదనే చింతనలో దళితులు బ్రతుకు వెళ్లదీస్తున్నారు.

దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది త్యాగధనులు ప్రాణాలు త్యాగాలు చేసి, ఆనాడు ఎస్.సి., ఎస్.టి.,బి.సి. ఉన్నతవర్గాలనే తేడా లేకుండా ''స్వాతం త్ర్యం మా జన్మ హక్కు'' అని నినదించి బ్రిటీషు వలస పాలనను అంతం చేశారు.

ఆనాడు అనేక మంది దళితులు ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వాతంత్ర్య ఉద్యమంలో తమపాత్రను పోషించారు. దళితులు శరీరాన్ని దాచుకోవడానికి చొక్కాలు లేనప్పుడు నేనెందుకు వేసుకోవాలని మహాత్మా గాంధీ తనకుతానే ప్రశ్నించుకొని చొక్కా వేసుకోవడం మానేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చదువుకున్న రోజులలో అనేక అవమానాలను గుర్రై, ఎన్నో చీత్కారాలను చవి చూసి వాటిని ఎదుర్కొని,గమనంలో పెట్టుకొని,సామాజిక కోణంలో ఆలోచించి ఎస్.సి. ఎస్.టి.,లకు కనీస న్యాయం కావాలని ప్రత్యేక చట్టాలలో పొందుపరిచారు. దళితులు అనే పదమే నేర పూరితమైనది గా షెడ్యూల్‌లులో పేర్కొన్నారు.

78 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత కూడా అది ఇంకా కొనసాగుతూనే ఉన్నది. పుట్టుకతో ఎవరు ఏ కులం,ఏ మతం వారు కాదు. ఊహ తెలిసిన తర్వాత సమాజ విభజననుసరించి గుర్తించబడుతున్నారు. ఆర్థికంగా,సామాజికంగా, వందలాది సంవత్సరాలుగా జీవచ్ఛవాలుగా బ్రతుకు వెళ్లదీస్తున్న దళిత వర్గానికి రాజ్యాంగంలో రక్షణ కవచాన్ని రూపొందించినా అమలుకు రావడంలో అనేక సంవత్సరాలు గడచిపోయాయి.

30 సంవత్సరాల క్రితం వరకు రంగారెడ్డి జిల్లా లాంటి చోట హోటల్‌లో దారుణంగా రెండు గ్లాసుల విధానం కొనసాగింది. ఎస్.సి. ప్రజల కోసం రూపొందించిన సామాజిక, సాంఘిక చట్టాలు అమలులలో వైఫల్యం చెందుతునే వచ్చా యి.

స్వాతంత్ర్యం తర్వాత దేశ వ్యాపితంగా ఎస్.సి., బిసి వర్గాలకు, దారిద్ర్యరేఖకు దిగువనున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులోకి తేబడ్డాయి. ఆ పథకాలలో అవినీతి,అక్రమాలు చోటు చేసుకోవడంతో లక్ష్యాలు సాధించబడలేదు. ఇప్పటికీ ఎస్.సి.,ఎస్.టి.ల కుటుంబాలు పేదరికంలో కొనసాగడానికి ప్రభుత్వాల ఉదాసీనతే ప్రధాన కారణం.

దీనిని గమనించిన మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ ఎస్.సి., ఎస్.టి., యాక్షన్‌ప్లాన్‌లు తెచ్చి బడ్జెట్‌లో 15శాతం ఎస్‌సి, 6శాతం ఎస్‌టిలకు కేటాయించాలని నిర్దేశించారు. కాని అమలు కావడం లేదు. పేదరికానికి నిర్వచనాన్ని పాలకులు గుర్తించడం లేదు. పేదలు, ఎవరు దారిద్ర్య రేఖకు దిగువనున్నారు, ఎవరు పైనున్నారు అనేది లెక్కలను తీసి గుర్తించడంలో రాజకీయ జోక్యం ఎక్కువై నిరుపేదలను,పేదలను గుర్తించడంలో పాలకుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతుంది.

భారత రాజ్యాంగంలో పొందుపరిచిన అందరికీ కూడు, గూడు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను సక్రమంగా అమలు చేస్తే సమాజంలో ఉన్న దళితులకు న్యాయం జరిగేది.

పాలకులు సంక్షేమ పథకాలను ఓట్ల పథకాలుగా గుర్తించి అందరిని ఒకే గాడిన కడుతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో పరిశీలిస్తే పేదలకిచ్చే రేషన్ కార్డుల సంఖ్య 80శాతం పైబడి ఉన్నవంటే పేదరికాన్ని గుర్తించడంలో రాజకీయ జోక్యంతో వైఫల్యం జరిగింది. ప్రభుత్వ అధికారులు కూడా యధా రాజా,తధా ప్రజా అనే సామెతలాగా ఉన్నారు. గత 10 సంవత్సరాలుగా ఎస్.సి., ఎస్.టి. యాక్షన్‌ప్లాన్ నిర్వీర్యమైంది.

గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో దళిత బంధు పేరుతో 10 లక్షల పథకం తెరపైకి వచ్చింది. అంతకంటే ముందు దళితులకు మూడెకరాలు భూమి కొనుగోలు పథకం, గృహాల కేటాయింపులో, అన్ని సంక్షేమ పథకాలలో కూడా 15శాతం అమలు చేస్తామని చెప్పిన పాలకుల మాటలు నీటి మూటలైనాయి. ఆ పథకాలు అభాసు పాలైనాయి.

ఇప్పటికైనా పాలకులు ఎస్.సి., ఎస్.టి., బిసిలలో నిజమైన పేదలను గుర్తించడానికి సాహసించగలరా అనేది ప్రధానమైన ప్రశ్న? విద్యలో ఎస్.సి.; ఎస్.టిలకు ప్రత్యేకంగా 15శాతం అమలువుతున్నదా? ఎస్.సి., ఎస్.టి., బిసిలలో పారిశ్రామికవేత్తలు,కాంట్రాక్టర్లు, ఉద్యోగస్థులు ఉన్నారు. వారు కూడా ఈ వర్గాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్.సి, ఎస్.టిల అభివృద్ధి గురించి మాటలు వల్లించకుండా చేతులలో చూపించాలి.

ఇప్పటి ప్రభుత్వం వృత్తి, ఉపాధి పథకాలలో ఎస్.సి., ఎస్.టి లకు సముచితమైన న్యాయం చేయడానికి సన్నద్ధం కావాలి. మార్క్స్ ప్రవచించినట్లుగా ఉన్నవా రు, లేనివారిని ఆర్థికంగా ఎదిగించకలిగితే సమాజంలో గుర్తింపు పొందకలుగుతారు. ఆర్థిక సమానత్వం, సమాజంలో గుర్తింపు కొలమానంగా మారాయి. అందుకని దళితులకు న్యాయం జరగాలంటే తక్షణం పాలకులు అన్ని సంక్షేమ పథకాలలో ప్రత్యేక స్థానం కల్పించాలి.

దళితులకు సామాజిక న్యాయం అందాలంటే ప్రభుత్వాలు ప్రస్తుత సంక్షేమ పథకాల అమలును నిత్యం సమీక్షించి కొత్త పథకాల అమలుకై ప్రత్యేక దృష్టి పెట్టి వారిలో మనోధైర్యాన్ని నింపగలగాలి.

# టెట్ కష్టాలు ఇంతింత కాదయా...

టీచర్స్ ఎలిజిబులిటి టెస్ట్ (టెట్) పరీక్షను జనవరి 3 వ తేదీ నుండి జనవరి 20 వ తేదీ వరకు ఆన్ లైన్ విధానంలో నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.డిసెంబర్ 27 వ తేదీ మధ్యాహ్నం నుంచి టెట్ కు సంబంధించిన హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవడానికి వెబ్ సైట్ లో పెట్టారు.పరీక్ష కేంద్రాలను చూసుకొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు బెంబేలెత్తి పోతున్నారు. తమ జిల్లాలో కాకుం డా దూర దూర ప్రాంతాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించడం వలన దాదాపు నూట యాభై రెండు వందల కిలో మీటర్ల ప్రయాణం ఉండడం వల్ల ఒక్కరోజు ముందు గానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పదవ తరగతి పరీక్షల తేదీలు సమీపిస్తుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పదవ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారు.సంబంధం లేని విషయాల మీద టెట్ పరీక్షను నిర్వహిస్తూ ప్రిపరేషన్ కోసం సమయం ఇవ్వకపోవడంతో టెట్ కష్టాలు ఇంతింత కాదయ్యా? అంటూ నిట్టుర్పులు విడుస్తున్నారు. టెట్ పరీక్షలకు హాజరయ్యే ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ఆన్ డ్యూటీ సదుపాయం (ఒ.డి )కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు,ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా సంబంధిత అధికారులను కోరుతున్నారు. డిసెంబర్ మాసంలో సెలవులన్ని అయిపోవడం టెట్ పరీక్ష కోసం మెడికల్ సెలవులను అడిగితే అధికారులు ఇవ్వడం లేదని పాఠశాలు నడవడం కష్టమని అధికారులు అంటున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయులకు సెలవులు పెట్టడం వల్ల పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడింది.

ఉపాధ్యాయులుగా ఇరవై ఐదు, ముప్పై సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు టెట్ (టీచర్స్ ఎలిజిబులిటి టెస్ట్) ఉత్తీర్ణత సాధించాలని చెప్పడం విచిత్రంగానూ, విడ్డూరంగానూ, ఆశ్చర్యంగానూ ఉందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎంతోమంది విద్యార్థులను డాక్టర్‌లుగా, ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా, ఉపాధ్యాయులుగా, పోలీసు అధికారులుగా ఉన్నతోన్నత ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన తమకు ఇప్పుడు ఉపాధ్యాయులుగా మీకు మీరు టెట్ ఉత్తీర్ణత సాధించి నిరూపించుకోవాలని అనడం ఉపాధ్యాయుల వృత్తి ధర్మాన్ని శంకించినట్లు అవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ఇరవై ఐదు, ముప్పై సంవత్సరాలు బోధిస్తున్న పాఠాల్లో టెట్ పరీక్షను నిర్వహించకుండా భాషోపాధ్యాయులకు (తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ ఇతర భాషలు) సాంఘిక శాస్త్రం, ఇంగ్లీష్, మానసిక శాస్త్రము (సైకాలజీ) తెలుగులో ఉత్తీర్ణత సాధించాలని ముఖ్యంగా ఏ సంబంధంలేని సాంఘిక శాస్త్రా నికే 60 మార్కులు కేటాయించడంలో అర్థం ఏమిటో అర్థం కావడం లేదని టెట్ టెన్షన్‌కు గురౌతున్నారు. బయోలజీ ఉపాధ్యాయులకు గణితం, ఇంగ్లీష్, భౌతిక శాస్త్రంలో పరీక్షను నిర్వహించి రెండు సంవత్సరాలలోపు ఉత్తీర్ణత సాధించాలని లేదా ఉద్యోగం వదులుకోవాల్సి వస్తుందని మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఉత్తర్వులను జారీ చేయడంతో దేశవ్యాప్తంగా డెబ్బై వేలకు పైగా ఉపాధ్యాయుల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది.

2011 నుండి టెట్ పరీక్షను నిర్వహిస్తున్నారు. గతంలో 1992,1994,1996, 1998, 2000, 2001, 2002, 2006, 2008, 2010 కంటే ముందు డి.ఎస్సీ పోటీ పరీక్షల్లో ఎంపికై ఇంటర్వ్యూలలో విజయం సాధించి ఉపాధ్యాయులు గా ఎంతో నిబద్ధతతో పనిచేసి ఉత్తమ ఉపాధ్యాయులుగా జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేత, స్వచ్ఛంద సంస్థల చేత సన్మానింపబడి సంబంధంలేని సబ్జెక్టులో పరీక్షరాసి ఉత్తీర్ణత సాధించకుంటే అవమానాలకు గురికావాల్సి వస్తుందని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులందరికి యాభై సంవత్సరాలు దాటిన వారే ఎక్కువమంది ఉన్నారని ఆరోగ్య సమస్య లు, కంటి సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న వారు ఇప్పుడు చిన్నప్పుడు చదువుకున్న సబ్జెక్టులలో టెట్ పరీక్ష రాయాలని ఉత్తీర్ణత సాధించాలనడం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పార్లమెంటు సమావేశాల్లో అనేక రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు టెట్ గురించి ప్రస్తావిస్తూ ఏ ఉద్యోగస్తులకు లేని అర్హత పరీక్ష ఉపాధ్యాయులకు పెట్టడం సమంజసం కాదని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అంటూ మన దేశం అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ను పునఃసమీక్షించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపుకోసం రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. దేశవ్యాప్తంగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపుకోసం పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టి.ఆర్.టి.ఎఫ్)ఆధ్వర్యంలో సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు, శాసనసభ సభ్యులు, శాసనమండలి సభ్యులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలు అందరు టెట్ ను 2011 తర్వాత ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి వర్తింపజేయాలని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

**డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,**
9290826988

## నారాయణపేట ఏరియా ఆసుపత్రిలో ఓపి సేవలు ప్రారంభం

పజాపక్షం/నారాయణపేట్ : పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నగర నడిబొడ్డున పాత బస్టాండ్ దగ్గర ఉన్న పాత ఏరియా ఆసుపత్రిలో ఓపి సేవలు ప్రారంభమయ్యాయి. అత్యవసర సేవల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించడం కోసం అంబులెన్స్ అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. అలాగే వైద్య పరీక్షల కోసం ల్యాబ్ , మెడికల్ షాప్ కూడా అందుబాటులోకి తీసుకోవడం జరిగింది. ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివకుమార్ రెడ్డి కృషి వలన నారాయణపేట జిల్లా కేంద్రంలోని పాత ఏరియా ఆసుపత్రి భవనానికి అర్బన్ హెల్త్ సెంటర్‌ను తరలించి ఓపి సేవలను మార్కెట్ కమిటీ చైర్మన్ సదా శివ రెడ్డి నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ మోహన్, హెచ్‌డిఎస్ కమిటీ సభ్యులు కోర్వర్ కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోణంగేరి హన్మంతు, ఆర్‌టిఏ మెంబెర్ పోషల్ రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాపక్షం/వెల్దండ : మండలపరిధిలోని నారాయణపూర్ తండాకు చెందిన రాత్లావత్‌మధు నివాసం వద్ద ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈవిషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని స్వయంగా సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా మధుకు ధైర్యం చెప్పి గోలి శ్రీనివాస్‌రెడ్డి మానవతాదృక్పథంతో రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వెల్దండ మాజీవైస్ ఎంపిపి అనిల్‌కుమార్, మాజీసర్పంచ్ అంజినాయక్, వార్డుసభ్యులు కృష్ణ, స్థానిక నాయకులు రవి, భుజంగం, రమేష్, ప్రసాద్, వినోద్, శ్రీధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పుడ్‌కమిషన్ చైర్మన్**

మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో వెల్దండ గ్రామానికి చెందిన తాటికొండ కృష్ణారెడ్డి సతీమణి తాటికొండ విజయలక్ష్మి దశదినకర్మ కార్యక్రమంలో రాష్ట్రపుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి పుట్టారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఐజాక్, బిఆర్ఎస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షులు జోగయ్య, కన్యాకుమారి, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, జంగిలి ఆనంద్ పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొన పాలమూరు బాలికల ఉన్నత పాఠశాలను అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్ సందర్శించారు. అక్కడ ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ని పరిశీలించడం జరిగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించడం జరిగింది. అలాగే పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులతో వారికి పరీక్షలు దగ్గర ఉన్నందున ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉపాధ్యాయులతో సందేహాలను తీర్చుకోవాలని పరీక్షలకు భయపడకుండా చదువుకోవాలని సమయపాలన పాటిస్తూ సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులతో తీర్చుకోవాలని సూచించారు.

## సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం



ప్రజాపక్షం/ నర్వ : మండల పరిధిలోని పాతర్చేడు గ్రామంలో జడ్‌పిహెచ్ఎస్ హై స్కూల్ లో నూత నంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్ , ఉపసర్పంచ్ అండ్ వార్డ్ మెంబర్ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంచే గ్రామ సర్పంచ్ లండకాడి లింగమ్మ , మన్యం ఉప సర్పంచ్, వాకిటి అంజనేయులు కి, వార్డు మెంబర్స్ వడ్డేబుడ్డన్న, బోయ భరత్కే అలివేలను నాగేష్, జూలుపల్లి ఆంజనేయులు, బురెడ్డి వందన వెంకటేష్, పోతురాజు అనంత వెంకటేష్, గద్వాల కొండన్న, నక్క అంజమ్మ ఎల్లప్పకి ప్రధానోపాధ్యయులు, భాస్కర్ సాగర్, హై స్కూల్ చైర్మన్ మణెమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు కృష్ణయ్య, సదానందం, సత్యనారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బాలకృష్ణా రెడ్డి, ఉపాధ్యాయ బృందం చేత వారందరికీ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురువ లంకాల మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బోలుబండ వెంకటేష్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నెట్టెంపాడు వెంకటయ్య ఈ స్కూల్ మాజీ చైర్మన్ ఏర్పుల ఆంజనేయులు, ఎక్స్ ఎంపిటిసి రాణి బలరాజ్, మాజీ ఉప సర్పంచ్ తాజ్ కృష్ణయ్య, హై స్కూల్ మాజీ చైర్మన్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్ చారి జగన్మోహన్ రెడ్డి, పి. జలంధర్, యూకే నర్సింలు, కె.శివాజీ, కె. గోపి, ఎం.నరసింహ, కె.రవి, కడుమూరు నరసింహ, బుడ్డా అంజపి, హెచ్ నచ్చా, ఐ.వెంకటయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వెంచర్‌లో ప్లాట్ల రాళ్లను తొలగించండి



యజమానికి గ్రామ పంచాయతీ నోటీస్

ప్రజాపక్షం/పానుగల్: పానుగల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో నిజామాబాద్ స్టేజి దగ్గర సర్వే నెంబర్ 16 లో భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్‌ను ఏర్పాటు చేసి ప్లాట్ల రాళ్లను ఏర్పాటు చేయడంతో శుక్రవారం భూమి యజమానికి గ్రామపంచాయితీ నోటీస్ జారీ చేసింది. గ్రామపంచాయితీ అనుమతి లేకుండా ప్లాట్ల రాళ్ల పాతటం సరికాదని పది రోజులలో రాళ్లను తొలగించాలని లేని పక్షంలో తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందని గ్రామపంచాయితీ నుండి నోటీసును జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూతగల్ల రమేష్, ఉపసర్పంచు కృష్ణవేణి, శ్రీరామ్, పంచాయితీ కార్యదర్శి పరుశురాముడు, వార్డు సభ్యులు రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వీధి దీపాలు ఏర్పాటు



ప్రజాపక్షం/వీపనగండ్ల: గత రెండు సంవత్సరాలుగా ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలలో అభివృద్ధికి నోచుకోలేకపోయాయి. ప్రస్తుతం గ్రామ పంచాయితీలకు సర్పంచుల వార్డు సభ్యుల పాలక వర్గం ఏర్పాటు కావడంతో గ్రామాల అభివృద్ధిపై దృష్టిని సారించారు. మండలంలో ఇప్పటికే పలువురు సర్పంచులు సొంత ఖర్చులతో అభివృద్ధి పనులను మొదలుపెట్టారు. మండలంలోని బొల్లారంలో గత కొన్ని నెలలుగా వీధి దీపాలు వెలగాక రాత్రివేళ గ్రామంలో అందకరం నెలకొనడంతో గ్రామస్తులు బయటకు తిరగాలంటే ఇబ్బందులు పడేవారు. గ్రామ సర్పంచు గొంది సుదర్శన్ రెడ్డి సొంత ఖర్చులతో గ్రామంలో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పుల్గర్ చెర్ల గ్రామ సర్పంచు బత్తుల బాలరాజు, గ్రామంలోని పైగేరిలో బోర్ బావికి కొత్తగా విద్యుత్ బోర్ మోటార్‌ను అమర్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచులు, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు ఉపాధ్యాయుల సన్మానం

ప్రజాపక్షం/వనపర్తి: వనపర్తి జిల్లాలోని మండల వెల్లటూర్ గ్రామ నూతన సర్పంచుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బెక్కెం సుజాతమ్మ ప్రతాప్ రెడ్డిని గ్రామంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం రోజు గ్రామ సర్పంచు బెక్కెం సుజాతమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి వారి చదువు, భవిష్యత్తు లక్ష్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచు బెక్కెం సుజాతమ్మను ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు బృందానికి సర్పంచు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తనవంతు పూర్తి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# గడువులోగా కొండారెడ్డిపల్లి అభివృద్ధి పనులు పూర్తి



జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : కొండారెడ్డిపల్లి గ్రామాభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శుక్రవారం సాయంత్రం వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండారెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధితశాఖల అధికారులను శాఖలవారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి అభివృద్ధిపనికి సంబంధించిన ప్రస్తుత స్థితి, ఎదురవుతున్న సమస్యలు, పూర్తయ్యే గడువువంటి అంశాలపై ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ కొండారెడ్డిపల్లి గ్రామంలో ఇప్పటికే మంజూరుచేసిన అభివృద్ధి పనులన్నింటిపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, గతంలో ప్రారంభించి మిగిలి ఉన్న పనులన్నింటిని జనవరి 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు మెరుగుపడేలా అభివృద్ధి పనులు సమయానికి పూర్తయ్యేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఈసమావేశంలో పిడి డిఆర్‌డిఏ చిన్న ఓబులేసు, జిల్లాపంచాయతీ అధికారి శ్రీరాములు, డిఇఓ రమేష్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ విజయ్, మిషన్‌భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, వంగూరు తహసీల్దార్, వంగూరు ఎంపిడిఓ పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు ఎస్పీ తక్షణ చర్యలు

ట్రాఫిక్ నియమాలు పాటించాలన్న జిల్లా ఎస్పీ డి.జానకి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : రోడ్డు ప్రమాదాల నివారణలో పాటు ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఛాంబర్ లో రోడ్డు భద్రతపై రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా ఎస్పీ డి.జానకి సంబంధిత పోలీస్ అధికారులు, ట్రాఫిక్ అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మహబూబ్ నగర్ జిల్లా బైపాస్ రోడ్డులో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను జిల్లా ఎస్పీ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ రెడ్డి, జిల్లా పోలీస్ అధికారులు, ట్రాఫిక్ అధికారులతో కలిసి ప్రత్యేక్షంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడ డివైడర్ కట్టింగులు ఉన్నాయో, ఏ ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో పరిశీలించి, అక్రమంగా పగలగొట్టిన డివైడర్ కట్టింగులను తక్షణమే మూసివేయాలని, అవసరమైన చోట్ల శాశ్వతంగా బలమైన డివైడర్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ మాట్లాడుతూ, '' డివైడర్లు పగల గొట్టి తప్పు మార్గాల్లో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరం. కొద్దిసేపు ఆదా చేసుకోవాలనే ఆలోచనతో ప్రజలు తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తున్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి చర్యలు కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం, ఎఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిఎస్పీ వెంకటేశ్వర్లు, డిటిసి, డి ఎస్పీ గిరి బాబు ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ ఎస్సై లు పాల్గొన్నారు.

**జిల్లాలో నేటి నుండి నెల వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు**

మహబూబ్ నగర్ వ్యాప్తంగా శాంతిభద్రతల కాపాడుటకు, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ దృష్ట్యా జనవరి 2, 2026 ఉదయం 6 గంటల నుండి జనవరి 31, 2026 సాయంత్రం 6 గంటల వరకు భారత పోలీస్ చట్టంలోని 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి. జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కాలవ్యవధిలో జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాలు, ప్రజా స్థలాలు, రహదారులు, కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర ప్రాంతాలలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను నిరోధించేందుకు ఈ చట్టాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ : ప్రజలు ఉచిత కంటి వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. వెంకట్ కంటి ఆసుపత్రి, మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన అల్మాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న ఉచిత ఆపరేషన్ శిబిరం గోడపత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన ఈ తరహా సేవ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ , శంకర్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు సాదుల్లా, మోహ్సిన్ ఏ అజామ్ ఫౌండేషన్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, ఉపాధ్యక్షులు మహ్మద్ మునీర్ సాజిద్, అబ్దుల్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని వినూత్న ప్రచారం

ప్రజాపక్షం/జడ్చర్ల : డాక్టర్ బూర్గుల రామకృష్ణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్యతో మీ కళాశాల విద్యార్థులను డిగ్రీ కళాశాలలో చేర్పించాలని పేర్కొన్నారు. ఇందులో భాగంగా అధ్యాపకులు రాఘవేంద్ర రెడ్డి జూనియర్ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి వారిని బూర్గుల రామకృష్ణా రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతి ఒక్కరూ చేరాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య క్విజ్ పోటీలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.సుకన్య మాట్లాడుతూ జడ్చర్ల పట్టణంలో అతి పెద్ద కళాశాల అని, స్వయంప్రతిపత్తి కలిగిన కళాశాల అని, డాక్టరేట్ కలిగిన అధ్యాపకులు ఉన్నారని చెప్పారు. మా అధ్యాపకులు క్విజ్ పోటీలు నిర్వహించి, కళాశాలలో చేరటానికి ప్రోత్సహించడం అనేది ఒక వినూత్న ప్రచారం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, రాఘవేంద్ర రెడ్డి, నాగరాజు, శివుడు, ఆదిల్, నరసింహ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఇన్చార్జి ప్రిన్సిపాల్ విజయంత, అక్తర్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.



# విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలి



జిల్లా ఇంచార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజాపక్షం/నారాయణపేట్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని, ఇలాంటి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలతో వారి ప్రతిభ కనబడుతుందని నారాయణపేట జిల్లా ఇంచార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. తనకు సైన్స్ అంటే చాలా ఇష్టమని, అలాగని మిగతా సబ్జెక్టులు ఇష్టం లేదని కాదు అని అన్నారు. తాను ఓ ఇంజనీర్ అని ఆయన తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణ పేట మండలంలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సైన్స్ ఫేర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్‌ఫేర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న తనకు నారాయణపేట ఇంచార్జీ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు ఇచ్చారని, ఇక్కడికి రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. జిల్లాకు చెందిన విద్యార్థులు ఎక్కడో శ్రీహరి కోటకు వెళ్లాల్సిన అవసరం లేదని, మన జిల్లా (కొడంగల్ నియోజకవర్గం)లోని కోస్గిలోనే వచ్చే విద్యా సంవత్సరం లోపు బిర్లా ప్లానిటోరియం ఏర్పాటు అవుతుందని, అలాగే దౌల్తాబాద్‌లో సైన్స్ లైబ్రరీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిత్య జీవితంలో సైన్స్ ఒక భాగం, జాతీయ సైన్స్ ఫిక్షన్ దినోత్సవం రోజున జిల్లాలో ఇంతటి గొప్ప కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. ఇండియా, చైనా దేశాలలో రోబో ద్వారా సేవలు పొందడం జరుగుతుందని కరోనా సమయంలో రోబోల చేత మందులు పంపించిన ఘనత కూడా ఉందని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ తెలిపారు. బావి భారత శాస్త్రవేత్తలుగా జిల్లా విద్యార్థులు ఎదిగి నోబెల్ బహుమతి సాధించాలని జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డి మొగులప్ప, జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్ , ఎంపీపీ శివారెడ్డి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్ , సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, నాగార్జున రెడ్డి, ఆర్టీవో నెంబర్ పోషల్ రాజేష్, ఎంఓవో విద్యాసాగర్, ఎంఈఓలు బాలాజీ, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, వెంకటయ్య, మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త యాదయ్య శెట్టి, ప్రైవేట్ పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.సుదర్శన్ రెడ్డి, ట్రెస్మా రాష్ట్ర కార్యదర్శి రాజేష్ కుమార్, తపస్, పిఆర్‌టియు సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లాకు చెందిన జీహెచ్‌ఎంలు పాల్గొన్నారు.

**పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రణాళికపై సమీక్షించిన కలెక్టర్**

పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం ప్రణాళికను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం కమిటీ సభ్యులతో ఆయన సమీక్ష జరిపారు. సహజ సేంద్రీయ వ్యవసాయాన్ని విస్తరించడం, రైతుల ఆదాయాలు, గ్రామీణ జీవనోపాధికి మద్దతు ఇస్తూ స్థిరమైన వాతావరణ స్థితిస్థాపక వ్యవసాయాన్ని స్వీకరించడమే ఆ పథకం ఉద్దేశ్యం అని ఆయన తెలిపారు. జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం, పండించే వివిధ పంటల వివరాలు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. జిల్లాలో ప్రస్తుతం ఉన్న పథకాలతో పాటు పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం లో భాగంగా కొత్త వాటిని అమలు చేయాల్సి ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్ తెలిపారు. ఈనెల 3,4 వ తేదీల్లో పథకం ప్రణాళిక, అమలు గురించి సమీక్ష నిర్వహించేందుకు సెంట్రల్ నోడల్ అధికారి రమణ్ కుమార్, నారాయణపేట పర్యటనకు విచ్చేయుచున్నారని, 3న జిల్లా కలెక్టరేట్‌లో కమిటీ సభ్యులతో సమీక్ష నిర్వహించి, 4న క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారని, అందుకు సంబంధించి సభ్యులు అన్ని వివరాలు, నివేదికలతో సిద్ధంగా ఉండాలని ఇన్చార్జీ కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, పథకం నోడల్ అధికారి సాయి బాబా, డిఆర్డి మొగులప్ప, జిల్లా మత్స్యశాఖ అధికారి రహమాన్, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి బ్రహ్మానంద రెడ్డి, డిపిఆర్ఓ రషీద్ పాల్గొన్నారు.




## దేశ రాజకీయాలలో కీలక పాత్ర పోషించిన బర్దన్

ప్రజాపక్షం/వనపర్తి టౌన్: దేశ రాజకీయాలలో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏబీ బర్దన్ కీలకపాత్ర పోషించారని సిపిఐ జిల్లా కార్యదర్శి కే.విజయ రాములు కొనియాడారు. వనపర్తి ఆఫీసులో ఏబీ బర్దన్ వర్ధంతి, సిపిఐ వనపర్తి జిల్లా మాజీ కార్యదర్శి డి.చంద్రయ్య వర్ధంతులను సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారి పోరాటాలు త్యాగాలను స్మరించుకున్నారు. ఆయన ఆశయ సాధనకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శిగా డి.చంద్రయ్య తన పనితీరుతో వనపర్తి జిల్లాలో చెరగని ముద్ర వేశారన్నారు. పేదలకు ఎక్కడ సమస్య ఉన్న ఆయన ప్రత్యక్షమై పోరాడి న్యాయం చేశారన్నారు. తాపీ కూలిగా జీవితం ప్రారంభించి మేస్త్రిగా ఎదిగి జిల్లా కార్యదర్శిగా సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారని, డి.చంద్రయ్య స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, జె.చంద్రయ్య శ్రీరామ్ సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, కేతేపల్లి ఉపసర్పంచు కృష్ణవేణి, గంధం నాగరాజు, గోపాల్ ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వంశీ, లక్ష్మి నారాయణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ, జ్యోతి, కృష్ణ, రవి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ హుండీ లెక్కింపు



ప్రజాపక్షం/కల్వకుర్తి : మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం దర్శనానంతరం దేవాలయంలో హుండీ లెక్కింపులో విద్యానగర్‌వాసులు మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, గార్లపాటి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, అక్షర శ్రీనివాసులు, రాఘవేందర్‌రెడ్డి, జగన్, ప్రభావతి, శ్వేత, మంజుల,వరలక్ష్మి , రజిత, సునిత, అరుణ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆంజనేయస్వామి దేవాలయంలోగల హుండి లెక్కింపులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని వారు తెలిపారు.

## రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన సర్పంచుల బృందం

ప్రజాపక్షం/అచ్చంపేట : అమ్రాబాద్ మండల సర్పంచ్ చిగుర్ల కోటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎల్మపల్లి రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ బృందం అమ్రాబాద్ మండల యువకులు, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రెసిడెన్షియల్‌లో జరుగుతున్న నిర్వహణను పరిశీలించారు. వంటశాల, బాత్‌రూమ్‌లు, డార్మెంటరీ, విద్యార్థుల గదులను పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు సౌకర్యాలు సరిగ్గాలేవని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజారాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సమష్టిగా సన్నద్ధం కండి



మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/మక్తల్: త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వారి నివాసంలో జరిగిన మక్తల్ మున్సిపల్ బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కేసీఆర్ ప్రభుత్వం హాయంలో మున్సిపాలిటీ పరిధిలోని 16 వార్డుల్లో చేసినటువంటి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఎన్నికలకు వెళ్లాలని వారు సూచించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం గతంలో ఎల్లప్పుడూ లేని విధంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదే విధంగా మక్తల్ మున్సిపాలిటీని తీసుకొచ్చిన చరిత్ర కూడా బిఆర్ఎస్ పార్టీదని ఆయన తెలిపారు. ఆయా వార్డుల్లో నీ ప్రజలను చైతన్యం చేయడం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను 6 గ్యారెంటీల వాగ్దానాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పార్టీ ఆదేశాల అనుగుణంగానే ప్రతి కార్యకర్త నడుచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హనుమంతు, ఆయా వార్డులకు సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకుల్లో వినియోగదారుల కష్టాలు

ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలలో గల ఎస్బిఐ యూనియన్ బ్యాంకు తదితర ప్రభుత్వ బ్యాంకులలో లంచ్ అవ్వాలంటే వినియోగదారులను వేధిస్తున్నారని అసలు లంచవర్ అనేది ఉంటుందని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని గంజిలో గల యూనియన్ బ్యాంకు ఎస్బి సిగ్నల్ గడ్డ దగ్గర గల ఎస్బిఐ బ్యాంకులో లంచ్ ఒంటి గంట నుంచి మూడు గంటల వరకు వినియోగదారులను వేచి ఉండేలా క్లోజ్ అని పెట్టి వేధిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. కూలి నాలి చేసుకుని బ్యాంకుల చుట్టూ తిరుగుతుంటే బ్యాంకు సిబ్బంది తమకు న్యాయం చేయకుండా లంచ్ వారని బయటికి వెళ్లండని అటు వెళ్లండి అంటూ వేధించడం ఎంతవరకు సమంజసం అని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. రిజర్వ్ బ్యాంకు రూల్స్ ప్రకారం బ్యాంకులలో లంచ్‌కు ఎలాంటి అనుమతి ఉండదని ఒక కౌంటర్లో ఒక వ్యక్తి బయటికి వెళ్తే మరో వ్యక్తి దాన్ని భర్తీ చేసే విధంగా రిజర్వ్ బ్యాంకు రూల్స్ ఉన్నాయని ఇది తెలియక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో ఉన్నతాధికారులు స్పందించి ఉదయం నుంచి సాయంత్రం వరకు లావాదేవీలు యధావిధిగా కొనసాగే విధంగా చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

## పోరాట ఫలితంగా పెరిగిన హమాలీ రేట్లు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి: ఎఐటియుసి పోరాట ఫలితంగా శుక్రవారం మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మార్కెట్ కమిషన్ ఏజెంట్లు శ్రీను, శేఖర్, గోపాల్‌ల మధ్య జరిగిన చర్చలలో భాగంగా 16శాతం హమాలీ రేట్లు పెంపుదలకు నిర్ణయం జరిగిందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి తెలిపారు. ఈకార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యులు అలమోని మల్లయ్య, హమాలీ కార్మికులు రమావత్ బాలు, బావోజీ, రామస్వామి, బాలు, బోడ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రాడ్ కాల్ ఫుల్‌స్టాప్ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ఫ్రాడ్‌కాల్ ఫుల్‌స్టాప్ అవగాహన పోస్టర్‌ను సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బందితో కలిసి శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫ్రాడ్ కాల్స్ నిర్మూలన కోసం తెలంగాణ పోలీస్ ఫ్రాడ్ కాల్స్ ఫుల్‌స్టాప్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని సూచించారు. ఎలాంటి రిక్వెస్ట్ లేకుండానే లోన్స్, బహుమతులు ఇస్తామని ఫోన్‌కాల్స్ వస్తే అవి సైబర్ నేరగాళ్ల పన్నాగాలు అని గుర్తించాలి. ప్రజలు ఇలాంటి మోసపూరిత కాల్స్‌కు లోనుకాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 1930కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అజ్ఞాత ఫోన్ కాల్స్ ద్వారా వచ్చే ఆఫర్లను నమ్మవద్దు, వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు.




## మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : మున్సిపాలిటి ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్యలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపాలిటి ఎన్నికలపై జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటకు న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమనే నినాదంతో ఎన్నికల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట మున్సిపాలిటిలో కాంగ్రెస్ పార్టీ తరపున ఒక్కో వార్డుకు పది మంది చొప్పున పోటీపడుతున్నారని కాని అర్హులైన అభ్యర్థులకు అంకితభావంతో పనిచేసే వారికి, పార్టీకి విధేయులైన వారికి, గెలుపు గుర్రాలకే టిక్కెట్ ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. పార్టీ టిక్కెట్ రాని వారు టిక్కెట్లు వచ్చిన అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయాలని పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపాలిటిపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని, మున్సిపాలిటి గెలుపును దివంగత నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డికి అంకితం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చకిలం రాజేశ్వర్‌రావు, అంజద్‌అలీ, కక్కిరేణి శ్రీనివాస్, ఎలిమినేటి అభినయ్, రహీం, వేణు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ చట్టం మార్పుతో పేదల జీవితాల చిన్నాభిన్నం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: ఉపాధి హామి చట్టం మార్పు వల్ల పేద, మధ్య తరగతి జీవితాలు చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మండల సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని ప్రధానమంత్రి మోదీ నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆరోపించారు. ఉపాది హామి చట్టాన్ని పరిరక్షించుకునేందుకు సంఘటితంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన మద్దతు ధర ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వాల ధ్యేయమని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు రైతులకు విద్యుత్ మీటర్లు బిగించేందుకు సిద్ధమయ్యారన్నారు. నిరుపేదలకు రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని త్వరలోనే చేపడ్తామని చెప్పారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, సీపీఐ మిర్యాలగూడ మండల కార్యదర్శి అంజనపల్లి రామలింగం, దళిత హక్కుల పోరాట సమితి నియోజకవర్గ నాయకులు వలపట్ల వెంకన్న, మహిళా సమాఖ్య నియోజకవర్గ కార్యదర్శి యర్రబోతు పద్మ పాల్గొన్నారు.

## సమర్థవంతంగా ఓటరు జాబితా సవరణ

జిల్లా అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటరు జాబితాను సమర్థవంతంగా సవరించాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు), సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ కోరారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ ఓపెన్ హాల్‌లో జరిగిన మిర్యాలగూడ పట్టణ, మండల బూత్ స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా పేపర్ వర్క్ పూర్తయిన తరువాత ఇంటింటికి తిరిగి జాబితాలో ఉన్నవారి లేనివారిని గుర్తించి చేర్పులు, మార్పులు చేయాలని ఆయన కోరారు. జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ 40శాతం ఉండగా మిర్యాలగూడ శాసనసభ నియోజకవర్గంలో 31శాతం ఉందని ఆయన అన్నారు. అన్ని మండలాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో మ్యాపింగ్ రెండు మూడు రోజుల్లో వేగవంతం చేయాలని కోరారు. శనివారం మధ్యాహ్నం 3గంటలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ ఉందని మధ్యాహ్నం లోగా పనిలో ప్రగతి చూపాలన్నారు. సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారులు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాస్‌శర్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, గణాంక అధికారి రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్చకుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్తాం : బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యలను మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కార అయ్యే విధంగా కృషి చేస్తామని మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి తెలియజేశారు.ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ధూపదీప నైవేద్య అర్చకులు చాలీచాలని వేతనాలతో ఉద్యోగ భద్రత లేకుండా కనీసం వైద్య ఖర్చులు కూడా లేకుండా దయనీయమైన స్థితిలో ఉన్నారని ధూప దీప నైవేద్య అర్చకుల వేతనాలను రూ. 35000లకు పెంచి హెల్త్ కార్డు అందించి అన్ని ప్రభుత్వ పథకాలను వర్తింప చేసేలా కృషి చేస్తామన్నారు.అదేవిదంగా పానగల్లులో ప్రభుత్వం కేటాయించిన 25 గుంటల స్థలంలో అర్చక భవనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దేవాలయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు రమేష్,రామాలయం మాజీ చైర్మన్ ఆర్ఎస్ఎల్ ఎన్ శర్మ, అర్చక సంఘం గౌరవ అధ్యక్షులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నం బొట్ల ఫణికుమార్ శర్మ రాష్ట్ర కన్వీనర్ అమరేశ్వర్ శర్మ, చందోతి శివకుమార్,జిగురు లక్ష్మీ నరసింహమూర్తి,జిల్లా ప్రధాన కార్యదర్శి రామడుగు వెంకట రామశర్మ పాల్గొన్నారు.



# అణగారిన వర్గాల ఆయుధం 'ప్రజాపక్షం'

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

'ప్రజాపక్షం' 2026 నియోజకవర్గ క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : సమాజంలోని అణగారిన, బడుగు, బలహీన వర్గాల గొంతుకగా 'ప్రజాపక్షం' దినపత్రిక నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, సామాజిక వికాసానికి పత్రిక దిక్సూచిలా మారాలని ఆయన పిలుపునిచ్చారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం యాదగిరిగుట్టలోని తన నివాసంలో 'ప్రజాపక్షం ఆలేరు నియోజకవర్గ 2026' క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ మీడియా రంగంలో ప్రజాపక్షం పత్రిక తనదైన ముద్ర వేస్తోందని ప్రశంసించారు. 'ప్రతి అక్షరం ప్రజల కోసం' అనే నినాదంతో నడుస్తున్న ఈ పత్రిక, అనతి కాలంలోనే పాఠకుల ఆదరాభిమానాలను చూరగొని దూసుకుపోవడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా విద్యార్థి, యువజన, మహిళా పక్షపాతిగా పత్రిక నిలబడటం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య పటిష్టమైన వారధిగా ఉంటూ క్షేత్రస్థాయి సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పత్రిక కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఐలయ్య స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియా రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆలేరు నియోజకవర్గ పరిధిలోని జర్నలిస్టుల చిరకాల స్వప్నమైన నివాస స్థలాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అందరికీ ఇళ్ల స్థలాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాపక్షం యాజమాన్యానికి, జర్నలిస్టులకు, జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా బ్యూరో రిపోర్టర్ దుడుక రామకృష్ణ, ఆలేరు నియోజకవర్గ రిపోర్టర్లు చెన్ రాజు శేఖర్ (యాదగిరిగుట్ట), లోడి భాస్కర్ (ఆత్మకూరు ఎం), కొలనుపాక కొండల్ (తుర్కపల్లి), షేక్ ఉస్మాన్ (మోటకొండూర్), బాలకిషన్ (బొమ్మలరామారం) పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి సహకరించండి

ప్రజాపక్షం/నకిరేకల్ : చందుపట్ల గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన గోశిక రాములసత్తయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు గోశిక చంద్రమౌళి లక్ష్మి లయన్స్ క్లబ్ గెలాక్సీ నల్లగొండ సహకారంతో గ్రామ పంచాయతీకి ఎమ్మెల్యే వీరేశం, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మధన్ మోహన్ చేతుల మీదుగా బాడీ ఫ్రీజర్‌ను అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద,మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో బాడీ ఫ్రీజర్ ను బహుకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దిగోజులతావెంకటాచారి,ఉప సర్పంచ్ ఓర్సు మంజులశ్రీను,కాంగ్రెస్ గ్రామ శాఖఅధ్యక్షుడు రంగారెడ్డి,సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సలీం,పంచాయతీ కార్యదర్శి కత్తుల మధు,లయన్స్ క్లబ్ సభ్యులు మారెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు బాధ్యతగా ఉండాలి : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట : ఏ ఒక్కరూ కూడా రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత పడకుండా డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, రోడ్డు రవాణా సంస్థ, రాష్ట్ర రోడ్ సేఫ్టీ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నెలలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా ఈనెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల నిర్వహణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రణాళిక తయారు చేయడం జరిగిందని ప్రణాళిక మేరకు జిల్లా పోలీస్ సిబ్బంది గ్రామాలు, పట్టణాలు, కాలనీలు, విద్యాసంస్థలు, కమ్యూనిటి విభాగాలు, షాపింగ్ మాల్స్, ఫ్యాక్టరీలు, ప్రమాద జంక్షన్‌లు, జన సమూహ ప్రాంతాలలో రోడ్డు భద్రతపట్ల, డిఫెన్సివ్ డ్రైవింగ్, అరైవ్ అలైవ్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. ప్రమాదాలు జరిగే విధానాన్ని కూడా ప్రజలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు.

**టిజి టెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు**

జనవరి 3 నుండి జనవరి 20 వరకు సూర్యాపేట జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాలలో నిర్వహించే టిజి టెట్ పరీక్షల సందర్భంగా ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 7.30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ యాక్ట్ 2023 అమలులో ఉంటుందని ఎస్‌పి నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా ఉండరాదని సూచించారు. అదేవిధంగా ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరీక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తుతో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# వందేళ్ల ప్రస్థానంలో సిపిఐ అసంఖ్యాక పోరాటాలు ,ఉద్యమాలు

జనవరి 18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు




ప్రజాపక్షం/చండూరు: వందేళ్ల ప్రస్థానంలో భరతగడ్డపై ఎన్నో పోరాటాలు ఉద్యమాలు నిర్వహించిన ఘన చరిత్ర కలిగిన పార్టీ సిపిఐది అని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి ,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మ భవనంలో నిర్వహించిన సిపిఐ మునుగోడు నియోజకవర్గస్థాయి మండల కార్యవర్గ సమావేశానికి నెల్లికంటి సత్యం ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం ,భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటాలు ,ఉద్యమాలు చేసిన ఘన చరిత్ర భారత కమ్యూనిస్టుదని (సిపిఐ) అన్నారు. భారత గడ్డపై ప్రజల పక్షాన నిలబడి ,దున్నేవాడికి భూమి కావాలని ,భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలని పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి పేదవారి వారి హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర కలిగిన పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 18న ఖమ్మం పట్టణంలో కనివిని ఎరగని రీతిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు ,సానుభూతిపరులు లక్షలాదిగా తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. అంజాచారి, గురిజ రామచంద్రం, బొల్గూరి నర్సింహ్మా, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శులు నల్పరాజు సతీష్ కుమార్, చాపల శ్రీను, సూదనబోయిన రమేష్ , బుర్ర శేఖర్ , ఈదుల భిక్షంరెడ్డి, తిప్పర్తి రాములు , పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, లాలు, సురిగి చలపతి,బరిగెల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర ముఖ్యం

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్




ప్రజాపక్షం/నల్లగొండ : రెవెన్యూ సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు చురుకుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. జిల్లా నూతన కలెక్టర్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి ఆయన శుక్రవారం తన ఛాంబర్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారుల పాత్ర ముఖ్యమని, ముఖ్యంగా ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ఖచ్చితమైన పరిష్కారం ఉండాలని, తరచు వచ్చే ఫిర్యాదులు తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఫిర్యాదులను స్వీకరించడమే కాకుండా, పిర్యాదుదారుకు రాశీదు ఇవ్వాలని,ఫిర్యాదుల రిజిస్టర్లు, అన్ని వివరాలు కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి, సం క్షేమ పథకాల అమలులో అవసర సమయాలలో రెవెన్యూ అధికారులు పూర్తిగా భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రతినెల తప్పనిసరిగా తహసిల్దార్‌ల సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ భూ భారతి ,పౌరసరఫరాలు తదితర అంశాలపై సమీక్షించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్,మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డిఓ అశోక్ రెడ్డి,దేవరకొండ ఆర్‌డిఓ రమణా రెడ్డి తదితరులు ఉన్నారు.

**జిల్లా అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలి**

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు,సిబ్బంది పూర్తి స్థాయిలో భాగస్వాములై జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.2026 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది, వివిధ ఉద్యోగ సంఘాలు,రైస్ మిల్లర్ల సంఘాల ప్రతినిధులతో ఆయన మాట్లాడారు.జిల్లా అధికారులు జిల్లా,మండల,గ్రామస్థాయిలో అందరినీ సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అమలు చేయాలని కోరారు. పథకాల అమలులో క్షేత్రస్థాయిలో అందరికీ న్యాయం జరిగేలా చూడాలని, అప్పుడే జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ అన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్, ఆర్‌డిఓవై. అశోక్ రెడ్డి,జిల్లా రవాణా కమిషనర్ వాణి ఉన్నారు.

## మెరుగైన వైద్యానికి ఎల్‌ఓసి అందజేత



ప్రజాపక్షం/మునుగోడు: మండలంలోని రత్తిపల్లి గ్రామానికి చెందిన రడం నర్సింగరావు కుమారుడు రడం మణికుమార్ అనారోగ్యంతో నిమ్స్ హాస్పిటల్, హైదరాబాద్ నందు వైద్య ఖర్చుల నిమిత్తం ఇబ్బందిపడుచున్న విషయం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం దృష్టికి రాగా వెంటనే చొరవ తీసుకొని మెరుగైన వైద్యం కొరకు ప్రభుత్వం నుండి రూ.1.50 లక్షల మంజూరు చేయించిన ఎల్‌ఓసి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట మాదగోని నర్సింహ ఉన్నారు.

# మొలక చల్లేందుకే మొగ్గు...

ఖర్చుల కట్టడికే మారిన సాగు!

రబీ సాగులోమారిన రైతు ఆలోచన...

ప్రజాపక్షం/ హాలియా: వ్యవసాయ సాగులో పెరిగిన ఖర్చులను కట్టడి చేసేందుకే రైతులు సాగు విధానాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారు. ఒక ఎకరం వరి సాగు చేసే రైతులకు కేవలం నాటు ఖర్చే రూ.6500 అవుతుండటం భారంగా మారింది. ఒక కౌలు రైతు ఒక ఎకరం పంట చేతికి వచ్చేవరకు దానిపై అయ్యే ఖర్చు రూ.55వేలు దాటి పోవడం వారికి నష్టాల సాగును చేస్తుంది. గత రెండు సీజన్లుగా వరి సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. ఈ క్రమంలో వ్యవసాయంలో ఖర్చులు తగ్గించడం ఎలా అనే ఆలోచనకు వచ్చిన రైతులు డ్రంసీడర్, మొలక చల్లే విధానాలు శాస్త్రీయంగా పరిశీలించి వాటి సాగు విధానంపై అవగాహన పెంచుకున్నారు. ఈ క్రమంలో ఈ రబీ సీజన్లో ఎక్కువమంది రైతులు మొలక చల్లే విధానంపై ఆసక్తి చూపారు. ఈ విధానం వలన ఒక ఎకరాకు సుమారు రూ.3వేల వరకు ఆదా అవుతుంది. దీంతోపాటు ఇతర ఖర్చులు కూడా తగ్గుతుండటం రైతులకు వెసులుబాటు అవుతుంది.ఈవిధానం వలన పంట చేతికి వచ్చే నాటికి ఎకరానికి రూ.8వేల మేర ఖర్చు తగ్గుతోందని రైతులు చెబుతున్నారు. దీనివలన ఎకరానికి నాలుగు బస్తాల ధాన్యం దిగుబడి తగ్గినా పెద్ద నష్టం జరగదని వారు వాపోతున్నారు. ఇదే విధానం వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు కూడా చెప్తున్నారు. కూలీల కొరత, సాగులో వ్యయం పెరగటం, దిగుబడి తగ్గడం తదితర అంశాలు రైతులను ప్రభావితం చేసి మొలకచల్లే విధానవైపు మళ్ళిస్తున్నాయి.వరి నాటు వేయడానికి మొలక చల్లడానికి వ్యత్యాసం చాలా ఉండడంతో రైతులు ప్రత్యామ్నాయ సాగు విధానంపై అవగాహన కల్పించుకుంటున్నారు. మొలక చల్లే విధానం వలన ఖర్చు తగ్గుతుండటం దిగుబడిలో కూడా పెద్దగా తేడా లేకపోవడం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకున్న రైతులు మొలక చల్లే విధానం వైపే ఆసక్తి చూపుతున్నారు. ఏదేమైనా ఈ మార్పు వ్యవసాయ సాగులో మంచి పరిణామం అని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.



# జాగ్రత్తగా ఓటర్ జాబితా తయారు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : మున్సిపాలిటీలలో ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా తయారు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం మున్సిపల్ కమీషనర్లు, సిబ్బందితో ఓటర్ జాబితా తయారుపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటిలలోని 141 వార్డులలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ జాబితాను రూపొందించి గురువారం వార్డుల వారీగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఈ ముసాయిదా జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించి అధికారులు అభ్యంతరాలను వచ్చినవి వచ్చినట్టుగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా జాబితాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో 5వ తేదీన మున్సిపాలిటిలలో, 6వ తేదీన జిల్లా స్థాయిలో సమావేశాలు నిర్వహించి వారి నుంచి వచ్చే అభ్యంతరాలను పరిశీలించి ఈనెల 10వ తేదీన మున్సిపాలిటి వారీగా తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. ఓటర్ జాబితాలో నమోదై నివసిస్తున్న చిరునామా ప్రకారం ఒకే కుటుంబంలోని సభ్యుల ఓట్లు అన్ని ఒకే వార్డులో వచ్చే విధంగా క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి మ్యాపింగ్ చేయాలని సూచించారు. ప్రతి మున్సిపాలిటిలో ఎలక్షన్ సెల్ ఏర్పాటు చేసి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తూ, సందేహాలు నివృత్తి చేయాలని ఓటర్ జాబితా సజావుగా రూపొందిస్తే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ కె సీతారామారావు, ప్రొవిషన్ డిప్యూటి కలెక్టర్లు అనూష, రవితేజ, డిపిఓ యాదగిరి, మున్సిపల్ కమీషనర్లు హనుమంతరెడ్డి, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్ రెడ్డి, మున్వర్ అలీ, సి సెక్షన్ సూపరింటెంట్ సంతోష్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# క్రీడ



## బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియా..

భారత్, బంగ్లాదేశ్ వైట్‌బాల్ సిరీస్ కొత్త తేదీలు వచ్చేశాయి. పొరుగుదేశంలో నిరుడు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాయిదా పడిన సిరీస్ సెప్టెంబర్ నెలలో జరునుంది. ఈ విషయాన్ని శుక్రవారం బంగ్లాదేశ్ బోర్డు అధికారికంగా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో వాయిదా పడిన బంగ్లాదేశ్, టీమిండియా వైట్‌బాల్ సిరీస్ తేదీలను రీషెడ్యూల్ చేశాం. సెప్టెంబర్‌లో బంగ్లా పర్యటనకు భారత జట్టు రానుంది అని బిసిబి క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ షహరీర్ నఫీజ్ తెలిపాడు. కొత్త ఏడాదిని పురస్కరించుకొని శుక్రవారం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు 2026లో అంతర్జాతీయ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల చేసింది. ఈ సందర్భంగా పాకిస్థాన్, న్యూజిలాండ్ భారత్, ఆస్ట్రేలియా, వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక సిరీస్ తేదీలను బిసిబి ప్రకటించింది. కొత్త షెడ్యూల్ ప్రకారం భారత జట్టు సెప్టెంబర్‌లో బంగ్లాలో వైట్‌బాల్ సిరీస్ ఆడనుంది. మూడు వన్డేలు, మూడు టీ20ల కోసం భారత బృందం ఆగస్టు 28న బంగ్లాకు వెళ్లనుంది. అనంతరం సెప్టెంబర్ 1న తొలి వన్డేతో సిరీస్ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 3న రెండో వన్డే, సెప్టెంబర్ 6న మూడో మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొడుతుంది. అనంతరం సెప్టెంబర్ 9 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ అవుతుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో సిరీస్ ముగుస్తుంది.

**అల్లర్ల నేపథ్యంలో..**

నిరుడు ఆగస్టులోనే టీమిండియా వైట్‌బాల్ సిరీస్ కోసం బంగ్లాదేశ్ వెళ్లాల్సింది. షెడ్యూల్ ప్రకారం.. ఆగస్టు 17 నుంచి బంగ్లాదేశ్‌లో భారత్ మూడు వన్డేలు, టీ20 సిరీస్‌లో ఆడాల్సి ఉంది. కానీ, మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా చెలరేగిన అల్లర్లతో పర్యటనను బిసిసిఐ వాయిదా వేసింది. సాధారణ పరిస్థితులు ఏర్పడ్డాక సిరీస్‌ను నిర్వహించాలని ఇరుదేశాల బోర్డులు భావించాయి. బంగ్లాలో మహ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడడం.. ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో అక్కడ సాధారణ పరిస్థితులు ఏర్పడే అవకాశముంది. అందుకనే కొత్త ఏడాది రెండో రోజునే బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు వైట్‌బాల్ సిరీస్ తేదీలను ప్రకటించింది.

## ఇంగ్లండ్ స్క్వాడ్‌లో స్పిన్ సంచలనం..

## యువ పేసర్‌కు పిలుపు!

యాషెస్ సిరీస్‌లో ఎట్టకేలకు బోణీ కొట్టిన ఇంగ్లండ్ విజయంతో సిరీస్‌ను ముగించాలనుకుంటోంది. బాక్సింగ్ డే టెస్టులో ఆస్ట్రేలియాకు షాకిచ్చిన బెన్ స్టోక్స్ సేన.. సిడ్నీలోనూ దూకుడే మంత్రగా ఆడనుంది. జనవరి 4న సిడ్నీలో జరుగనున్న చివరి టెస్టు కోసం ఇంగ్లండ కీలక మార్పులు చేసింది. ఆ దేశ క్రికెట్ బోర్డు శుక్రవారం 12 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించింది. కొత్త ఏడాదిని విజయంతో ఆరంభించాలనుకుంటున్న బౌలింగ్ యూనిట్‌ను పటిష్టం చేసుకుంటూ యువ స్పిన్నర్ షోయబ్ బషీర్, మాథ్యూ పాట్స్ లకు చోటు కల్పించింది. పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో ఓటమితో యాషెస్ సిరీస్ సమర్పించుకున్న ఇంగ్లండ్ మెల్‌బోర్న్‌లో పంజా విసిరింది. కుర్ర పేసర్ జోష్ టంగ్ విజృంభణతో ఆతిథ్య జట్టును మట్టికరిపించిన బెన్ స్టోక్స్ బృందం.. సిడ్నీ టెస్టుకు పక్కాగా సిద్ధమవుతోంది. అయితే.. తొడకండరాల గాయంతో బాధపడుతున్న పేసర్ గస్ అట్కిన్సన్ ఐదో టెస్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో మాథ్యూ పాట్స్ ఎంపికయ్యాడు. మెల్‌బోర్న్ ఓటమి నుంచి తేరుకొని విజయ గర్జన చేయాలనుకుంటున్న ఆసీస్ స్టీవ్ స్మిత్ సారథిగా బరిలోకి దిగనుంది. అయితే.. నాలుగో టెస్టు స్క్వాడ్‌లో ఆ దేశ బోర్డు ఏ మార్పులు చేయలేదు.




**ఇంగ్లండ్ తుది జట్టు :**
జాక్ క్రాలే, బెన్ డకెట్, బెన్ స్టోక్స్(కెప్టెన్), జో రూట్, జాకబ్ బెథెల్, హ్యారీ బ్రూక్, జేమీ స్మిత్(వికెట్ కీపర్), షోయబ్ బషీర్, బ్రైడన్ కార్సే, విల్ జాక్స్, మాథ్యూ పాట్స్, జోష్ టంగ్.

## డ్రాగన్ వేషంలో యూనివర్సల్ బాస్..



వెస్టిండీస్ మాజీ ఓపెనర్ క్రిస్ గేల్ ఒకప్పుడు అంతర్జాతీయ క్రికెట్‌లో ఓ సంచలనం. అతడు క్రీజులోకి వచ్చాడంటే బౌలర్లు వణికిపోయేవాళ్లు. దంచడమే డ్యూటీగా భావించే ఈ డాషింగ్ బ్యాటర్ నెలకొల్పిన రికార్డులు కోకొల్లలు. క్రికెటర్‌గా తన విధ్వంసక ఆటతో అభిమానులను అలరించిన గేల్.. ఈమధ్య తన ప్రత్యేక వేషధారణతో వైరలవుతున్నాడు. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ కరీబియన్ వీరుడు డ్రాగన్ వేషంలో.. కార్నివాల్ డాన్స్ వీడియోతో మరోసారి నెట్టింటిని షేక్ చేస్తున్నాడు. ఆల్‌టైమ్ దిగ్గజ ఓపెనర్లలో ఒకడైన క్రిస్ గేల్ కొత్త ఏడాది సందర్భంగా తమ ప్రాంత విశిష్టతను ప్రపంచానికి చాటాడు. డ్రాగన్ వేషధారణతో హుషారుగా డాన్స్ చేస్తూ మురిసిపోయాడీ యూనివర్సల్ బాస్. ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఫ్రకి గ్వాన్ 2026' పేరుతో షేర్ చేసిన వీడియోలో కరీబియన్ మూలాలతో గేల్ కనిపించాడు. ఈ పదానికి 'ఏం జరుగుతోంది?' అని అర్థం. పక్షి రెక్కలను పోలిన డ్రాగన్ బొమ్మలను ధరించిన గేల్.. చేతిలో పొడవాటి కర్రతో చిందులు వేశాడు. మైదానంలో తన డేరింగ్ ఆటకు కేరాఫ్ అయిన ఈ మాజీ ఓపెనర్.. ఇప్పుడు సంప్రదాయ లుక్‌లో దర్శనమిచ్చి ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించాడు.

# ఫోకస్ సైన్స్


## పాలపుంతతో అండ్రోమెడా ఢీ!



చీకటి, చంద్ర కాంతి లేని రాత్రుల్లో, పట్టణ కాంతి కాలుష్యానికి దూరంగా ఉన్న చోట, అండ్రొమెడా మనిషి అలాంటి దుర్భిణిల సాయం లేకుండా చూడగలిగే అత్యంత దూరంలోని ఖగోళ వస్తువు. ఇది అండ్రొమెడా నక్షత్ర మండలంలో చిన్న, మసక మచ్చలా కనిపిస్తుంది. మెస్సియర్ 31గా కూడా పేర్కొనే అండ్రోమెడా వేగంగా పాలపుంత లేదా మిల్కీవే వైపు కదులుతోంది. ఈ రెండు ఆకాశగంగలు ఢీకొని, విలీనమై, ఒక భారీ ఎలిప్టికల్ గ్యాలక్సీగా మారుతాయని అంచనా. అయితే, ఇది జరగడానికి సుమారు 4.5 బిలియన్ సంవత్సరాలు పడుతుంది. ఇటీవలి అధ్యయనం ప్రకారం, నేరుగా ఢీకొనే అవకాశం సుమారు 50 శాతం ఉంది. అండ్రొమెడా మన గ్యాలక్సీ కంటే గణనీయంగా పెద్దది. దీని వ్యాసం సుమారు 2,20,000 కాంతి సంవత్సరాలు. ఇందులో సుమారు ఒక ట్రిలియన్ నక్షత్రాలు ఉన్నాయని అంచనా, ఇది మిల్కీ వే అంచనాల కంటే చాలా ఎక్కువ. హబుల్ టెలిస్కోప్ చిత్రాలు అండ్రొమెడాకు ద్వంద్వ కేంద్రం ఉందని చూపాయి. ఇది గతంలో మరొక చిన్న గ్యాలక్సీతో జరిగిన విలీనానికి కారణంగా ఏర్పడి ఉండవచ్చు. సుమారు ఒక బిలియన్ సంవత్సరాల క్రితం రెండు గ్యాలక్సీలు జరిగిన ఒక ప్రధాన విలీనంతో ఈ గ్యాలక్సీ ఏర్పడింది. అందుకే ఇది ఇంత పెద్దదిగా ఉండటం మరియు అనేక ఉప గ్యాలక్సీలను కలిగి ఉండటం అని భావిస్తున్నారు. అండ్రొమెడా గురించి మొదటి లిఖిత ఆధారం క్రీస్తు శకం 964లో కనిపిస్తుంది. పర్షియన్ ఖగోళ శాస్త్రవేత్త అల్ సూఫీ దానిని చిన్న మేఘంగా వర్ణించాడు. ఆ సమయంలో ఇది వేరే గ్యాలక్సీ అని ఎవరికీ తెలియదు. ఈ గ్యాలక్సీకి గ్రీకు పురాణాల్లోని రాజకుమారి అండ్రొమెడా పేరునిచ్చారు. ఆమె కాసియోపేయా మరియు సెఫియస్‌ల కుమార్తె. ఆమెను ఒక సముద్ర రాక్షసానికి బలిగా రాయికి గొలుసులతో కట్టి వేశారు. తరువాత పెర్సియస్ ఆమెను రక్షించాడు.

## నిరంతర అన్వేషణలు.. సంచలన ఫలితాలు


అంతరిక్ష పరిశోధన రంగంలో నిరంతర అన్వేషణలు కొనసాగుతునే ఉన్నాయి. ఇటీవలి కొన్ని సంచలన ఫలితాలు విశ్వం, జీవ ఉనికి, భవిష్యత్ అంతరిక్ష ప్రయాణాలుపై అవగాహనను విప్లవాత్మకంగా మారుస్తున్నాయి. ఇప్పటి వరకూ తయారైన అత్యాధునిక ఖగోళ దూరదర్శినిగా పేరు పొందిన జేమ్స్ వెబ్ స్పేస్ టెలిస్కోప్ (జెడబ్ల్యుఎస్‌టి) ఇటీవల, సుదూరమైన గెలాక్సీలలో సంక్లిష్ట అణువులు (కాంప్లెక్స్ మాలిక్యూల్స్)ను గుర్తించింది. వీటి వల్ల విశ్వం ప్రారంభ దశలో ఏర్పడ్డ ప్రాథమిక నక్షత్రాలు, గెలాక్సీలపై అవగాహన లభించింది. దాదాపు 13.5 బిలియన్ సంవత్సరాల క్రితం విశ్వం ఎలా రూపుదిద్దుకుందో వివరాల అవగాహనకు ఈ ఆవిష్కరణ ఉపయోగపడుతుంది. ఇది విశ్వం ఎలా పుట్టిందో అర్థం చేసుకోవడంలో కీలకం కానుంది. అదే విధంగా నక్షత్రాలు, గ్రహాలు ఎలా ఏర్పడ్డాయో నని విశ్లేషిస్తుంది. భవిష్యత్ జీవ అన్వేషణకు శాస్త్రీయ ఆధారాలను అందిస్తుంది. మొత్తం మీద ఇది విశ్వ ఆది చరిత్రపై మన జ్ఞానం గణనీయంగా పెరిగింది.



మరిన్ని పరిశోధనల నేపథ్యంలో, భూమికి వెలుపల జీవం ఉందా? అనే ప్రశ్నకు సమాధాన్ని కనుగొనే ప్రయత్నంలో శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకేశారు. మంగళ గ్రహం (మార్స్)పై ఒకప్పటి నదీ ప్రవాహాలు, సరస్సుల ఆధారాలను కనుగొన్నారు. అక్కడి నేలలో ఒకప్పుడు నీరు ఉండేదన్న సాంకేతాలు కనిపిస్తున్నాయి. అదే విధంగా జూపిటర్ ఉపగ్రహమైన యూరోపా మంచు కింద భారీ సముద్రాలు ఉన్నాయని ఆధారాలు లభించాయి. జీవానికి అనుకూల పరిస్థితులు అక్కడ ఉన్నట్టు శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఇతర నక్షత్రాల చుట్టూ తిరిగే కొన్ని 'ఎక్సోప్లానెట్స్'పై నీటి ఆవిరి, సేంద్రియ అణువులను గుర్తించారు. అక్కడ కూడా జీవానికి అనుకూల ఉష్ణోగ్రతలు ఉంటాయని దాదాపు నిర్ధారణకు వచ్చారు. ఈ విశ్వంలో భూమి ఒక్కటే జీవానికి నిలయం కాదని, ఇంకా అనేక సుదూర గ్రహాల్లో జీవం ఉండవచ్చనే ఆలోచన బలపడుతున్నది.

## క్వాంటం మెకానిక్స్‌లో కీలకం 'సిపిటి'

అత్యంత వేగంగా మార్పులకు లోనవుతున్న విజ్ఞాన శాస్త్ర విభాగాల్లో క్వాంటం మెకానిజం ఒకటి. ఇందులో ఒక కీలక ప్రాథమిక సూత్రం 'సిపిటి' అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. సిపిటిని వివరించాలంటే, చార్జ్ కంజన్‌క్షన్, పారిటీ, టైమ్ రివర్సల్‌గా పేర్కోవాలి. 'సి' లేదా చార్జ్ కంజన్‌క్షన్ అంటే ప్రతి కణాన్ని దాని ప్రతి కణంతో మార్చడం. 'పి' లేదా పారిటీ అంటే స్థల నిర్దేశాలను అద్దంలో ప్రతిబింబం చేసినట్టు తలక్రిందులుగా మార్చడం, ఇక 'టి' లేదా టైమ్ రివర్సల్ అంటే కాలాన్ని వెనుకకు పరుగెత్తేలా చేయడం. సిపిటిని అనుసరించి, ఒక విశ్వంలో ఉన్న అన్ని కణాలను ప్రతికణాలతో మార్చి, స్థల అక్షాలను అద్దంలో చూపినట్టు తలకిందులు చేసి, కాలాన్ని వెనక్కి తిప్పినా... ఆ విశ్వం మన విశ్వంలాగే ప్రవర్తించాలి. అంటే, ఇలాంటి మార్పులు చేసినప్పటికీ భౌతిక నియమాలు మారవు. 'సి', 'పి', 'టి'లను విడివిడిగా చూస్తే మార్పులు గోచరించవచ్చు. కానీ, కపిలి చేసే మార్పులు మాత్రం ప్రకృతి సూత్రాలకు లోబడే ఉంటుంది. ఇప్పటి వరకూ మనకు తెలిసిన, శాస్త్రవేత్తలు నిర్ధారించిన భౌతిక శాస్త్ర సిదాఇ్ధంతం ఇది. కాబట్టి ప్రతి కణం యొక్క 'భారం' లేదా 'ద్రవ్యరాశి', 'ఆయుష్షు' లేదా 'లైఫ్‌టైమ్' సమానంగా ఉండాలి. ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలంతా దాదాపుగా అగీకరిస్తున్న అత్యంత కీలకమైన భౌతిక శాస్త్ర నియమాల్లో సిపిటి ఒకటి. ఇది క్వాంటం స్థాయిలో విశ్వం ఎలా పనిచేస్తుందో అర్థం చేసుకోవడానికి అత్యంత ముఖ్యమైన సిద్ధాంతం.



# హక్కుల సాధనలో కమ్యూనిస్టులే కీలకం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/పెద్దపల్లి : హక్కుల సాధనలో కమ్యూనిస్టులే కీలక పాత్ర పోషించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యవర్గం, కౌన్సిల్ సమావేశం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ముందుగా సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి.బర్ధన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్‌తో కలిసి చాడ వెంకట్‌రెడ్డి, మాట్లాడుతూ భారత గడ్డపై సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముగింపు బహిరంగ సభ జనవరి 18న ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జనవరి 10న సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని పార్టీ ప్రజాసంఘాలు సభను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో జరిగిన అనేక పోరాటాలకు సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. కేంద్రంలో మూడోసారి గెలిచిన బిజెపి ప్రభుత్వం మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పేరు మార్పుతో కొత్తచట్టం తెచ్చ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్రలు పన్నుతుందని ఆరోపించారు. దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి దుర్మార్గపు పాలన చేస్తుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్ చేస్తూ ఆదివాసీలను సైతం క్రూరంగా చంపుతుందన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను నిర్వీర్యం చేస్తూ ఎల్‌ఐసి లాంటి సంస్థలను కార్పొరేట్లకు దారదత్తం చేస్తుందన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల వేదికగా ఖమ్మంలో జరిగే భారీసభకు జిల్లా నుంచి వేలాదిగా తరలిరావాలని పార్టీ శ్రేణులకు చాడ పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా రాష్ట్ర సమితి సభ్యుడు గోసిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఓదెమ్మ, కడారి సునీల్, మార్కపురి సూర్య, తాళ్లపల్లి లక్ష్మణ్, మాటేటి శంకర్, శనిగరపు చంద్రశేఖర్, జూపాక రామచందర్, రాజారత్నం, ఆసాల రమ, కల్లేపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో పలు కుటుంబాలు చేరిక



ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) : జనవరి 18న ఖమ్మంలో సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలం మామిడాల గ్రామంలో తిరుమలగిరి, తుంగతుర్తి మం డల కార్యదర్శులు ఎస్‌డి ఫయాజ్, పాల్వాయి పున్నయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి బెజవాడ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐలోకి కోక్యతండ నుంచి 15 కుటుంబాలు బెజవాడ సమక్షంలో చేరారు. వారికి బెజవాడ పార్టీ కండువాలు కప్పి ఆహ్వా నించారు. కార్యక్రమంలో సిపిఐ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లంల యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఎస్‌కె ఏక్‌బాల్, త్రిపురాల శ్రీకాంత్, జంపాల మల్లయ్య, ఇస్లావత్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ ఉద్యమ, త్యాగాల చరిత్ర యువతరానికి బోధించాలి

సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి పిలుపు



ప్రజాపక్షం/జనగామ : సిపిఐ శతాబ్ధి ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు జనగామ నుంచి వేలాదిగా తరలి రావాలని సిపిఐ జనగామ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. 18న ఖమ్మం పట్టణంలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ జనగామలోని సిపిఐ కార్యాలయంలో నుంచి శుక్రవారం జీపు జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ వంద సంవత్సరాల భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ, త్యాగాల చరిత్రను నేటి యువతరానికి తెలుపడం కోసం జనవరి 2,3 తేదీల్లో సిపిఐ ప్రచార జాతా ప్రారంభించామన్నారు. ఈ జాతా శుక్రవారం జనగామలో బయలుదేరి వడ్లకొండ, హన్మంతాపూర్, నర్మెట, తరిగొప్పుల, శ్రీపతిపల్లి, చిన్న పెండ్యాల, స్టేషన్‌ఘనపూర్, రఘునాథపల్లి, కంచనపల్లి గబ్బెట బాణాజీపేట, శ్రీమన్నారయణపురం నుండి జనగామ చేరుకుంటుందన్నారు. వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను, ఎర్రజెండా ఉద్యమాల చరిత్రను గ్రామగ్రామాన ప్రజలకు ఈ జాతా ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు. వంద సంవత్సరాల త్యాగాల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమం ముగింపు సభ విప్లవాల పోరాట గడ్డ అయిన ఖమ్మం పట్టణంలో జరుగుతున్న నేపథ్యంలో. బహిరంగ విజయవంతానికి జిల్లా నుంచి వేలాదిగా జనం తరలి రావాలని ఆయన కోరారు. జీపు జాతా కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి దళం పాడిన విప్లవ గీతాలకు ప్రజలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, సభ్యులు చొప్పరి సోమయ్య, చెల్లోజు మల్లేశం, పుప్పాల ఐలయ్య, పాతూరి ప్రశాంత్, మాలోతు సీతారాం, నీల కనకయ్య, భువనగిరి కుమారస్వామి, పిట్టల కుమార్, సముద్రాల రాజు, కావటి యాదగిరి కందూకూరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు ఉద్యమానికి బర్ధన్ సేవలు చిరస్మరణీయం

నివాళులర్పించిన సిపిఐ నేతలు



భద్రాద్రి కొత్తగూడెం



వరంగల్...

ప్రజాపక్షం/నారాయణపేట్ : కమ్యూనిస్టు ఉద్యమానికి బర్ధన్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు పోరాడుదామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. బాలనరసింహ్మ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో సిపిఐ కార్యాలయంలో ఎ.బి బర్ధన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ జిల్లా సమితి సమావేశానికి చౌడపురం శ్రీనివాస్ అధ్యక్షత వహించ గా, ముఖ్య అతిథిగా హాజరైన బాల నరసింహ్మ మాట్లాడుతూ బర్ధన్ 16ఏండ్ల వయసులోనే విద్యార్థి సంఘం లో చేరి స్వాంతత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన పోరాట యోధుడన్నారు. కార్యక్రమంలో సిపిఐ నారాయణపేట జిల్లా కార్యదర్శి టి.సరసింహ్మ, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్, పార్టీ ధన్వాడ మండల కార్యదర్శి మద్దూరు, మండల కార్యదర్శి ఎస్.వెంకటేష్, జిల్లా నాయకుడు డి.చెన్నయ్య, శివశంకర్, శివకృష్ణ, రాములు, రమేష్ పాల్గొన్నారు.

**కుత్బుల్లాపూర్:** బర్ధన్ ఆశయాల సాధనకు పోరాడుదామని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు యూసఫ్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి బర్ధన్ వర్ధంతి సందర్భంగా షాపూర్‌నగర్ కార్యాలయంలో బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, షాపూర్‌నగర్ నాయకులు సుంకిరెడ్డి, రమేష్, గురప్ప, యాగంటి, అంజయ్య, సోమిరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ :** ఎబి బర్ధన్ సేవలు చిరస్మరణీయమని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో బర్ధన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో భూమయ్య, ఓమయ్య, హన్మాండ్లుతో పాటు ఆనంద్, రోహిత్ పాల్గొన్నారు.

**వరంగల్ :** ఆదర్శ కమ్యూనిస్టు నేత ఎబి బర్ధన్ జీవితం ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. శుక్రవారం శివనగర్‌లోని సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర బవన్‌లో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి బర్ధన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా షేక్ బాష్ మియా మాట్లాడుతూ సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి ఎబి బర్ధన్ తన చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను అనుసరించి ప్రజలతో, కార్యకర్తలతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి, గన్నారపు రమేష్, జిల్లా సమితి సభ్యులు తాళ్లపల్లి రాహేలా, ఓర్సు రాజు, పరికరాల రమేష్, ఎండి అక్బర్ పాషా, చిట్యాల సువర్ణ, నల్ల తీగల కుమార్, జన్ను రాజు, బిర్రు ప్రభాకర్, కరుణాకర్ దాసు, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు

**భద్రాద్రి కొత్తగూడెం :** కమ్యూనిస్టు ఉద్యమానికి, ప్రజలకు ఎబి బర్ధన్ అందించిన సేవలు చిరస్మరణీయమని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఎబి బర్ధన్ వర్ధంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జరిగిన సభలో పాషా మాట్లాడుతూ బర్ధన్ తన జీవితమంతా కార్మికులు, రైతులు, పేద ప్రజల హక్కుల కోసం అంకిత భావంతో పోరాడిన ఆదర్శ నేత అన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు జి వీరస్వామి, దమ్మలపాటి శేషయ్య, వంగ వెంకట్, భూక్య శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, రాములు, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, మాతంగి లింగయ్య, మల్లయ్య, ధనలక్ష్మి, షాహీన్ పాల్గొన్నారు.



నారాయణపేట్...




కుత్బుల్లాపూర్




నిజామాబాద్

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సిఎం రేవంత్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



ప్రజాపక్షం/తాండూరు:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి సహచార ఎంఎల్‌ఎలతో కలసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో సిఎం రేవంత్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యేబుయ్యని మనోహర్‌రెడ్డి పుష్పగుచ్చాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డితో పాటు సహచార ఎంఎల్‌ఎలు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.


## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మేడికొండ కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాపక్షం/కూకట్‌పల్లి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మేడికొండ కుమార్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మేడికొండ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలకు అహర్నిశలు కృషి చేస్తూ, కార్యకర్తలు అందరిని ఏకతాటి పైకి తీసుకొచ్చి పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గల ఏ ఒక్క డివిజన్‌కైనా సరే కార్పొరేటర్‌గా రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సిఎం రేవంత్‌రెడ్డికి విన్నవించుకున్నారు. అందుకు సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.



## మహేశ్ కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు

ప్రజాపక్షం/నిజాంపేట్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ని మాజీ టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డితో కలిసి కాంగ్రెస్ సీనియర్ నేత పర్వతిని ఆంజనేయ వర్మ కలిశారు. మహేశ్ కుమార్ గౌడ్‌ని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంజనేయ వర్మ మాట్లాడుతూ మహేశ్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను ముందుకుతీసుకువెళ్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింతగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.





## డిసి వాణికి కౌకుట్ల చంద్రారెడ్డి అభినందనలు

ప్రజాపక్షం/నాగారం: ఘట్కేసర్ సర్కిల్ నూతనంగా డిప్యూటీ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన వాణిరెడ్డిని నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అదే విధంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్క కిషోర్‌గౌడ్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, మెరుగు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**డిసిని కలిసిన కౌన్సిలర్లు...** ఘట్కేసర్ సర్కిల్ డిసిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వాణిరెడ్డిని నాగా రం మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో పంగ హరిబాబు, శ్రీనివాస్‌గౌడ్, తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, వీరన్న గౌడ్ తదితరులున్నారు.

**నాయకుల నూతన సంవత్సర శుభాకాంక్షలు**



ఘట్‌కేసర్‌లో: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఘట్‌కేసర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వాణిని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్,కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె జంగయ్య,మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిషనర్ వాణిని శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓను కలిసిన సర్పంచ్ సుధాకర్



ప్రజాపక్షం/కోట్‌పల్లి: వికారాబాద్ నియోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధిలోని బీరోల్ గ్రామ సర్పంచు మోముల సుధాకర్, ఉపసర్పంచు కోట్‌పల్లి మండల అభివృద్ధి అధికారి హేమంత్ కలిసి శాలువా తో సన్మానించి నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలిపారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు కలిసి గ్రామ అభివృద్ధి చేయాలని సూచించారు. ఈకార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖాజామియా గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



## ఘనంగా సామ వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/నవాబుపేట్ : నమ్మిన వారికి అండగా నిలిచే నైజం, ఇచ్చిన మాటకు కట్టుబడే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి నవాబుపేట్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి పుట్టినరోజును శుక్రవారం చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జి పామేనా భీమ్ భరత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అజీజ్ నగర్‌లోని తన పార్టీ కార్యాలయంలో నాయకుల సమక్షంలో కేక్ కట్‌చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ మండల ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, సర్పంచులు పాల్గొని సామ వెంకట్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పామేనా భీమ్ భరత్ మాట్లాడుతూ, 2026 సంవత్సరాన్ని పురస్కరించుకొని చేవెళ్ల నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త అవకాశాలు, సుఖ సంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామాభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# బర్దన్ ఆశయ సాధనకు పోరాడుదాం

వియస్ బోస్



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : సిపిఐ అగ్రనేత ఎబి బర్దన్ ఆశయాల మేరకు పోరాడుదామంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వియస్ బోస్ పిలుపిచ్చారు. బర్దన్ 10వ వర్ధంతి సందర్భంగా సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ జాతీయ సమితి సభ్యులు ఎండి యూసూఫ్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ.ఉమా మహేష్ లతో కల్సి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోస్, యూసూఫ్ లు మాట్లాడుతూ బర్దన్ 16 ఏళ్ల వయస్సులోనే విద్యార్థి సంఘంలో చేరి స్వతంత్ర పోరాటంలో జైలు జీవితం గడిపారని, మహారాష్ట్ర ఎమ్మెల్యేగా ప్రజలకోసం పాటుపడి, గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు, విద్య హక్కు చట్టాలను తీసుకొని రావటంలో కీలక పాత్ర పోషించారన్నారు. తుది శ్వాస వరకు కమ్యూనిస్టుగా పనిచేసిన బర్దన్ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నేతగా పలు హోదాలలో పనిచేసి తక్షణ హక్కులు, సామాజిక భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, రాజకీయ హక్కులను కాపాడే పనితోపాటు కార్మికుల్లో రాజకీయ విద్య, మార్క్సిజం భావజాలాన్ని అందించటంలో ఆయన విశేష కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.దామోదర్‌రెడ్డి, టి.శంకర్, హరినాథ్, కె.ధర్మేంద్ర, టి. సత్యప్రసాద్, రచ్చ కిషన్, శ్రీనివాస్, యాదయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సల్మాన్‌బేగ్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు యాదగిరి, రాం నారాయణ, ఈశ్వర్, పరమేశ్వర్, బాబు, నాగరాజ్, నరేంద్రప్రసాద్, ప్రజానాట్యమండలి నాయకురాలు ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మల్కాజిగిరి నియోజకవర్గ సమస్యల పరిష్కారంలో ప్రాధాన్యత ఇస్తానంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం సిఎంను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి కల్సి సమస్యలను ముందు కు తీసుకొని వెళ్లిన సందర్భంగా వెంటనే సిఎం జిహెచ్‌ఎంసి కమిషనర్ కర్ణన్ అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేయాలం టూ ఫోన్ ద్వారా ఆదేశాలిచ్చారు. ఆర్‌కె పురం ఆర్‌ఓబి ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయే కుటుంబీకులకు 2బెడ్ రూంలు కేటాయించటం, దీంతోపాటు పల్లవి విల్లా అపార్ట్‌మెంట్, ఆర్‌కె పురం ఆఫీసర్స్ కాలనీ ఫ్లాట్లకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా రీ డిజైన్ చేయాలంటూ కమిషనర్‌కు సిఎం సూచించారు. ఆర్‌కె పురం ఆర్మీ స్కూల్ నుండి మిలిటరీ హాస్పిటల్ సమీపం వరకు ఆర్మీ స్థలాన్ని వెడల్పు చేస్తూ ఫ్లైఓవర్‌ను పొడిగించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఎమ్మెల్యే రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటిని కల్సి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని వల్లభ్ నగర్ బేగంపేట నుండి ఆల్వాల్ మండలానికి మార్చాలంటూ కోరారు.

## 'జాతీయ రోడ్డు భద్రత' మాసోత్సవాలు

ప్రజాపక్షం/చర్లపల్లి:ఆర్‌టిసి ప్రజా రవాణాలో ముఖ్య భూమిక పోషిస్తుందని ట్రాఫిక్ ఎస్‌ఐ మధు అన్నారు. శుక్రవారం కుషాయిగూడ ఆర్‌టిసి డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మంచి సేవలు చేస్తున్నారని, ప్రమాదాలు జీరో కావాలని అని ఆకాంక్షించారు. డ్రైవింగ్ చేసే పనిపై పూర్తి శ్రద్ధ ఉంటే ప్రమాదరహిత డ్రైవర్లుగా గుర్తింపును పొందుతున్నారని, బస్సును నిలిపేటప్పుడు బస్సు బేలోనే నిలపాలని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను దాటేయాలని ఆత్రుతతో చాలామంది ప్రమాదాలకు గురువుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ నర్సింహులు, డిపో మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ మేనేజర్ చంద్రమౌళి, ఇంజనీర్, ట్రాఫిక్, ఆర్‌టిసి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## అభివృద్ధి సంక్షేమంలో దూసుకెళ్లాలి

వజ్రేష్‌యాదవ్



ప్రజాపక్షం/శామీర్‌పేట: నూత న సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రాష్ట్రం ప్రగతి బాటలో అభివృద్ధి వైపు దిశగా ముందుకు సాగాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆకాంక్షించారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ ఆద్వర్యంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ నివాసంలో





పూలబొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజి సర్పంచ్ ఎల్ల మల్లేష్, మాజి ఎంపిటిసి అశోక్‌రెడ్డి, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి కమఠం కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్‌రెడ్డి, చాట్లపల్లి నర్సింగరావు, తదితరులు పాల్గొన్నా రు.

**శామీర్‌పేటలో:** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌కు మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, మూడుచింతలపల్లి మాజి ఉపసర్పంచ్ వంగ వెంకటరమణరెడ్డి, తూంకుంట మాజి సర్పంచ్ ఎద్దు నాగేష్‌లు ఆయన నివాసంలో కలిసి శాలువాతో ఘనం గా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అద్యక్షుడు తుంకి రమేష్ ఆద్వర్యంలో జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి పూలబొకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు చాట్లపల్లి నర్సింగరావు, కమఠం కృష్ణారెడ్డి, మాజి ఎంపిటిసి అశోక్ రెడ్డి, ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మాజి సర్పంచ్ ఎళ్ల మల్లేష్, నాయకులు భాస్కర్‌గౌడ్, సాయిపేట శ్రీనివాస్, యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో :** నూతన సంవత్సరం పురస్కరించుకుని మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరిలు శుక్రవారం మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు డక్కి రమేష్, కాటేపల్లి గోపాల్ రెడ్డి, కవాడి మాధవరెడ్డి, కవాడి వామన రెడ్డి, బొక్క సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి భవన్‌లో రేపు ఉద్యాన ఉత్సవ్

ప్రజాపక్షం/శామీర్‌పేట : ఈ నెల 4 న(ఆదివారం) బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌లో ఉద్యాన ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని మూడుచింతలపల్లి మండల వ్యవసాయాదికారి రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యాన ఉత్సవ్‌లో ఉద్యాన పంటలలో రైతులు అవలంబించాల్సిన నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పిస్తార ని, కావున రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యాన పంటల్లో మెళకువలను తెలుసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు మూడుచింతలపల్లి రైతు వేదికలో ఎఇఒ సురేష్ రెడ్డిని (9492924989) సంప్రదించాలని ఆ ప్రకటనలో తెలిపారు.

## చర్చి నిర్మాణానికి జాం రవి విరాళం

ప్రజాపక్షం/శామీర్‌పేట : మూడుచింతలపల్లి మున్సిపల్‌లో అసంపూర్తిగా ఉన్న చర్చి నిర్మాణానికి మాజీ సర్పంచ్ జాం రవి రూ.1 లక్ష విరాళంగా అందజేశారు. మూడుచింతలపల్లిలోని ఓ చర్చి భవనం అసంపూర్తిగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఆ చర్చి ఫాస్టర్ ఇమానియల్ అభ్యర్థన మేరకు మాజీ సర్పంచ్ జాం రవి ముందుకు వచ్చి తన సొంత డబ్బులు రూ.1లక్ష విరాళంగా అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన కామిడి బాల రాజేందర్‌రెడ్డి ఆ చర్చి భవనానికి కావాల్సిన పూర్తి ఇటుకను తాను అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జాం రవి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని, అన్ని మతాలను గౌరవిస్తు సహాయం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మురళీగౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నర్సింలు, మాజీవార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాపక్షం/మల్కాజిగిరి : నేరేడ్‌మెట్‌లోని బెతెల్ చర్చ్‌ప్రాంగణంలో శనివారం శ్రీ గంగా చారిటబుల్ ట్రస్ట చైర్మన్ బిర్రు బాలమల్లయ్య ట్రస్ట్ అడ్వయిజర్ షేర్ల అనిల్‌లు పేదలకు దుప్పట్ల పంపిణీ చేసారు. డాక్టర్ నరసింహాగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ సుకుమార్, ఇజ్రాయిల్, మోజెస, విజయరాణి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/మల్కాజిగిరి : మల్కాజిగిరి దస్తావేజు లేఖకుల సంక్షేమ సంఘం రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రార్ రెడ్డిపల్లి శ్రీకాంత్ ఆవిష్కరించారు. సంఘ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మ ణ్, చేకొండ నరేష్‌బాబులు సబ్ రిజిస్ట్రార్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి ఈశ్వర్, నజీర్, వంశీ, సుందర్, సాయి, మహిళా అధ్యక్షురాలు కుమారి, జనార్ధన్, ఉపేందర్‌రెడ్డి, యూసూఫ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



## మాధ్వాపూర్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

ప్రజాపక్షం/బంట్వారం:మాధ్వాపూర్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కూమార్ శుక్రవారం అన్నారు. బంట్వారం మండల పరిధిలో మాధ్వాపూర్ గ్రామ సర్పంచు మహ్మద్ గోరేమియా స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించారు. మండల పార్టీ అధ్యక్షులు పోచారం వేంకటేశం ఆధ్వర్యంలో తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ సభ్యులు గడ్డం ప్రసాద్ కూమార్ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరి, పుష్పగుచ్ఛం అందజేస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తేలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే విధంగా గ్రామ సర్పంచులు పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాద్వాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు బాబుబాయా, మాజీ సర్పంచు గోవింద్ రెడ్డి, గ్రామస్తులు రాములు, ప్రభు, అంజీలయ్య, దశరథం గౌడ్, అనీల్ కూమార్, రఘుపతి, గోవింద్, రమేష్, ఉప సర్పంచు కిష్టయ్య, పాలకవర్గ సభ్యులు, తదితరులు ఉన్నారు.

**స్పీకర్‌ను కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్**



**వికారాబాద్:** స్పీకర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన వికారాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, అనంతరం వికారాబాద్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, అభివృద్ధి పనులపై చర్చించామని, వికారాబాద్ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతుల సంక్షేమంపై చర్చించడం జరిగింది అని తెలిపారు.



## న్యూ ఇయర్ క్యాలెండర్లను ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : తెలంగాణా గెజిటెడ్ ఆఫీసర్స్ (టిజిఒ) అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, క్యాలెండర్లను శనివారం జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌కు చెందిన జి.వినోద్‌కుమార్, కురుమూర్తి, డి.రవీందర్, విజయకుమారి, సాంబశివరావు, కిషన్, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలి

ప్రజాపక్షం/కూకట్‌పల్లి: సరికొత్త ఆలోచనలతో ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ నూతన ఉత్తేజంతో ముందుకు సాగాలని పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం అన్నారు. శుక్రవారం ఖైత్లాపూర్‌లోని వారి నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గం డివిజన్‌ల నాయకులు సత్యం శ్రీరంగంను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యంశ్రీరంగం మాట్లాడుతూ ఈ నూతన సంవత్సరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు మరింత పాటుపడాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వానికి అందరం ఎల్లవేళలా అండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశాల్ సుధాం, సుంకన్న, విఠల్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు ప్రకాష్ ముదిరాజ్, అరుణ్ గౌడ్, జమీల్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాప్రా డిసికి సీనియర్ సిటిజన్స్‌అభినందనలు



ప్రజాపక్షం/చర్లపల్లి: కాప్రా డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిని సీనియర్ సిటిజన్స్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, సత్తిరెడ్డి, వరప్రసాదవ్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## బొమ్మ తుపాకీతో బెదిరించి దోపిడీ యత్నం

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి: నగల దుకాణంలో చొరబడిన ఓ యువకుడు బొమ్మ తుపాకీతో బెదిరించి దోపిడీకి పాల్పడిన ఉదంతం మేడ్చల్ జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారంలో శుక్రవారం చోటు చేసుకొంది. శుక్రవారం సాయంత్రం నాగారం డివిజన్ సత్యనారాయణ కాలనీలో సందీప్ నడిపిస్తున్న బాలాజీ జ్యువెలర్స్ దుకాణంలోకి బైకుపై లోపలికి వచ్చిన యువకుడు వెంట తెచ్చుకొన్న బొమ్ముు తుపాకీని చూపించి బెదిరించాడు. యజమాని ప్రతిఘటించటంతో అతడిని గాయపరచి పట్టుబడుతానన్న భయంతో తుపాకిని అక్కడే వదిలి పెట్టి పరారయ్యాడు. ఈ మేరకు సమాచారం అందుకొన్న కీసర పోలీసులు సంఘటనాస్థలకి చేరుకొని నిందితుడు వదిలేసిన బొమ్మ తుపాకీని స్వాధీనం చేసుకొని నిందితుడి కోసం గాలిస్తున్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD


## పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత ఉంటుందని బిఎన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం సాహెబ్ నగర్‌లోని ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు ఏ.వి దినేష్ ఆధ్వర్యంలో ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో బాగంగా గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్‌చేంజ్‌ను నేషనల్ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమంలో హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెంట్ మండలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒలు జగదీష్ రెడ్డి, శ్రీనివాస్, డిఎస్ఒ శ్రీనివాస్‌రావు ఉపాధ్యాయులు ఇందిరా పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి సమగ్రాభివృద్ధికి పునరుత్తేజంతో పనిచేయాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆంగ్ల నూతన సంవత్సర శుభ సందర్భాన్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి అధికారులు, ఉద్యోగులు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డిలను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, విభాగాల అధిపతులు మేయర్, డిప్యూటి మేయర్‌లకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో జిహెచ్ఎంసి నగరాభివృద్ధికి అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. మేయర్‌ను కలిసిన వారిలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, ఎన్.రవికిరణ్, శ్రీనివాస్‌రెడ్డి, అదనపు కమిషనర్లు సి.ఎన్.రఘుప్రసాద్, ఎస్.పంకజ, వేణుగోపాల్, పిఆర్‌ఓ దశరథం, ఎఎంసి శారద ఉన్నారు.

## గవర్నర్, సిఎంలను కలిసిన కలెక్టర్






ప్రజాపక్షం/హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావులను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కలెక్టరేట్‌లో తెలంగాణ తహసీల్దార్ అసోసియేషన్ రూపొందించిన 2026 సంవత్సర వార్షిక డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ హరిచందన ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటాచారి, ఆర్‌డిఒ రామకృష్ణ, తహసీల్దార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.ప్రేమ్ కుమార్, కార్యదర్శి బాల శంకర్, ట్రెజరర్ నయీముద్దీన్ పాల్గొన్నారు.

## గంధంగూడలో రూ.1200కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా






ప్రజాపక్షం/హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం గంధంగూడలో ఆక్రమణకు గురవుతున్న 12.17 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు కాపాడారు. సుమారు రూ.1200 కోట్ల విలువైన ఈ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి స్వాధీనం చేసుకున్నారు. సర్వే నంబరు 43లోని మొత్తం 26ఎకరాల్లో గతంలోనే సబ్ స్టేషన్, జిహెచ్ఎంసి యార్డుకు కొంత కేటాయించగా, మిగిలిన భూమి కబ్జా అవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. భూమికి ఫెన్సింగ్ వేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

## సిఎంను కలిసిన శివచరణ్‌రెడ్డి



ప్రజాపక్షం/హయత్ నగర్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టిపిసిసి ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి, జక్కిడి సత్య తేజ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలు పరిష్కారానికి కృషి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సాగర్ ఎంక్లేవ్ కాలనీ సమస్యల పరిష్కారానికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని సాగర్ ఎంక్లేవ్ కాలనీలో కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో ఆందోజు సత్యం చారి, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మూడావత్ రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, జనార్ధన్, మనోహరా చారి పాల్గొన్నారు.

# బతికి గెలవాలి.. మరణించి ఓడిపోవద్దు

ఇటీవల జరిగిన సంఘటనలపై 'ఎక్స్' వేదికగా సిపి సజ్జనార్





ప్రజాపక్షం/హైదరాబాద్:బతికి గెలవాలని.. మరణించి ఓడిపోవద్దని హైదరాబాద్ సిపి సజ్జనార్ 'ఎక్స్' వేదికగా సూచించారు. పిల్లలను పెంచలేక కన్నవారే వారికి విషమిచ్చి చంపిన ఘటనలకు సంబంధించిన వార్తా క్లిప్పింగ్‌లను ఆయన సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. క్షణికావేశంలో నూరేళ్ల జీవితాన్ని, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు 'దయచేసి ఆలోచించండి' అని విజ్ఞప్తి చేశారు. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన ఓ మహిళ తన భర్త మృతితో పిల్లల్ని పోషించలేక వారికి విషమిచ్చి, తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో కుమార్తె మృతి చెందగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఘటనలో నంద్యాల జిల్లాలో తన భార్య ఇటీవల మరణించడంతో వారి ముగ్గురు పిల్లలకు ఓ తండ్రి విషమిచ్చి చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనలను పంచుకుంటూ ఆయన ట్వీట్ చేశారు

### వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలి

తల్లిదండ్రులను భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని, అలాగే వృద్ధాశ్రమాలు లేని సమాజం రావాలని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనర్ ఆకాంక్షించారు. పెంచి పెద్ద చేసిన వారి త్యాగాలను విస్మరించవద్దని, వృద్ధాప్యంలో వారికి కావాల్సింది ఆస్తులు కాదు.. కేవలం పిల్లల ఆప్యాయత మాత్రమేనని గుర్తు చేశారు. నూతన సంవత్సర వేడుకలను ఆడంబరాలకు దూరంగా, సేవా దృక్పథంతో జరుపుకోవాలని పిలుపునిస్తూ, పలువురు పోలీసు ఉన్నతాధికారులతో కలిసి కర్ఖానాలోని ఆర్‌కె ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, హెల్త్ కేర్ సెంటర్‌ను సిపి సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న 48మంది వృద్ధులకు పోలీస్ అధికారులతో కలిసి పండ్లు, మిఠాయిలు అందజేశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, వారితో ఆత్మీయంగా గడిపారు. కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న సీనియర్ నటి పావలా శ్యామలను తిరుమలగిరి ఎసిపి రమేష్ చొరవ తీసుకుని ఆర్‌కె ఫౌండేషన్ హెల్త్‌కేర్ సెంటర్‌లో చేర్పించారు. విషయం తెలుసుకున్న సిపి సజ్జనర్ మానవతా దృక్పథంతో స్పందించిన ఎసిపిని ప్రత్యేకంగా అభినందించారు. ఆశ్రమంలో చికిత్స పొందుతున్న పావలా శ్యామలను సిపి ఆత్మీయంగా పలకరించి, ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను అక్కున చేర్చుకుని, గత 18 ఏళ్లుగా సుమారు 15 వేల మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఫౌండేషన్ నిర్వాహకుడు డాక్టర్ రామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో నార్త్ జోన్ డిసిపి రష్మీ పెరుమాళ్, అదనపు డిసిపి అశోక్, తిరుమలగిరి ఎసిపి రమేష్, కార్ఖానా ఇన్‌స్పెక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆరుట్ల కమలాదేవి వర్ధంతి



ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి వర్ధంతి సందర్భంగా సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంక్షేమ కేంద్రంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట పటిమను స్మరించుకున్నారు. ఆరుట్ల కమలాదేవి బర్కత్ పురాలోని రాజా బహదూర్ వెంకట్రాంరెడ్డి మహిళా కళాశాలలో మొదటి విద్యార్థినిగా ఆనాడు బాలికలకు హాస్టల్ వసతి కోసం పోరాటం చేసి వైఎంసి వద్ద ఉన్న ఉమెన్స్ హాస్టల్‌ను ఏర్పాటు చేయడం కోసం పోరాటం చేశారని తెలిపారు. దేశానికి స్వాతంత్రం వచ్చినా తెలంగాణలో స్వాతంత్రం రాకపోవడంతో భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చిన సాయుధ పోరాటంలో ఆరుట్ల కమలాదేవి ఆరుట్ల రామచంద్రారెడ్డి తుపాకి పట్టుకొని పాల్గొన్నారని తెలిపారు. మొదటి శాసనసభ ఎన్నికల్లో ఆలేరు నుంచి ఎన్నికయ్యారని తెలిపారు. సిపిఐ శాసనసభ పక్షా నేతగా పనిచేశారన్నారు. భారత జాతీయ మహిళా సమైక్య నాయకురాలుగా అనేక మహిళల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించాలని తెలిపారు. ఆరుట్ల కమలాదేవి ఆశయాలను సాధించడానికి కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవరావు, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, అడ్వైజర్ ఉష, సిఆర్ పాలీక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె రజిని, సభ్యులు, లలిత, వంకా లక్ష్మి, వృద్ధాశ్రమ వాసులు సాంబశివరావు, హోమ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ అభివృద్ధి : పొన్నం

ప్రజాపక్షం/హైదరాబాద్ : బృహత్ నగరంగా విస్తరిస్తున్న హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, ఎంపి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మురా గోపాల్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌లతో కలిసి హుస్సేన్ సాగర్ సర్ ప్లస్ నాలాపై నిర్మించిన చిక్కడపల్లి – దోమలగూడ లింక్ బ్రిడ్జిని ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఒఆర్ఆర్ లోపల, పరిసర ప్రాంతాల విలీనంతో గ్రేటర్ హైదరాబాద్ దేశంలోనే అతి పెద్ద నగరంగా మారిందని, జనాభాకు అనుగుణంగా రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు, పార్కులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.



## ప్రజాప్రభుత్వం సహకారంతో అభివృద్ధి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డిని హస్తినాపురం డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ వంకుడావత్ విజయ్ కుమార్ శుక్రవారం బంజార హిల్స్‌లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ప్రభుత్వం జిహెచ్ఎంసిని మరింతా అభివృద్ధి చేయాలని ఉద్దేశంలో 150 డివిజన్లు ఉన్న హైదరాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్‌ను 300 డివిజన్‌గా విస్తరించ దంపట్ల అభివృద్ధి చేయడానికి ప్రజలకు అధిక ప్రధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. హస్తినాపురం డివిజన్ సమస్యల కోసం ప్రజాప్రభుత్వం సహకారంలో కృషి చేస్తామని విజయ్ కుమార్ తెలిపారు. అభివృద్ధికి కాలనీ ప్రజల సహకారంతో ముందుకుసాగుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లురవి



ప్రజాపక్షం/షాద్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదగడమే కాకుండా రాబోయే అన్ని ఎన్నికల్లో విజయభేరి మోగించడం ఖాయమని కాంగ్రెస్ క్రమ శిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హైద్రాబాద్‌లో డాక్టర్ మల్లు రవిని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సీనియర్ నేతలు చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్‌లు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా విజయదంకా మోగించడం ఖాయమన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ దక్కించుకోవడం ఎంతో సంతృప్తి ఇచ్చిందని. ఇదే తంతు వచ్చే మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో జరగడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు హైడ్రా తీసుకురావడమే కాకుండా పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళెందుకు కాంగ్రెస్ కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. దేశానికే తెలంగాణ రాష్ట్రాన్ని రోల్‌మాడల్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

## ఉద్యమకారులను విస్మరించిన బిఆర్ఎస్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఉద్యమకారులను గత బిఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఉద్యమకారుల స్థూపం ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ తెలంగాణ ఉద్యమ కారులను పూర్తిగా విస్మరించడమే కాకుండా కనీస గౌరవం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. షాద్‌నగర్‌లో అమరవీరు స్థూపం ఏర్పాటు చేసేందుకు 12ఏళ్ల పట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు దక్కని గౌరవం ప్రజాపాలన ప్రభుత్వంలో ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అమరవీరుల స్థూపం ఏర్పాటు చేసేందుకు షాద్‌నగర్ జెఎసి నేతలు తన దృష్టికి తీసుకువస్తే తాను సానుకూలంగా స్పందిస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని వెంట పడ్డారని తెలిపారు. తెలంగాణ అమరవీరు స్థూపం వద్ద వేదికను సైతం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అమరవీరులను ఏ స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం గౌరవిస్తుందో అందుకు నిదర్శనం స్థూపమే అవుతుందని పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, టిజెఎసి చైర్మెన్ జనార్దన్, మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాం రెడ్డి, కో కన్వీనర్ జాంగారి రవి, రాష్ట్ర నేత శ్రీనివాస్ రాజు, వివిధ సంఘాల నేతలు తిరుమలయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సత్యం, బాదేపల్లి సిద్దార్థ, టెలిఫోన్ వెంకటయ్య, రవీంధ్రనాథ్, మేకల వెంకటేష్, అన్నారం బాలునాయక్, వెంకట్‌రెడ్డి, అదెట్ల రాజు, నర్సింలు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్పస్వాములకు అన్నవితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బస్వం, మాణిక్యం, సీతారాములు పాల్గొన్నారు.

## బడుగుల శ్రేయస్సుకు పోరాటాలు

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు, సమస్యలపై పోరాటం చేసేందుకు కృషి చేయాలని జాతీయ బిసి జనసేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప అన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో బిసి జనసేన ప్రధాన కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా బీసీ జనసేన అధ్యక్షుడిగా బోయ చెన్నయ్య, గౌరవ అధ్యక్షుడు మేకల వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా మేలగాసి నర్సింలును ఎన్నుకొని నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కత్తి చంద్రశేఖర్ అప్ప మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం బీసీ జనసేన పోరాటాలు చేయడంతోపాటు సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలనిన్నారు. కార్యక్రమంలో కాటం బాగ్యలక్ష్మి గౌడ్, జక్కుల జలజ, అరుణ్ గౌడ్, గడ్డమీది రమేష్, రాములు గౌడ్, వినయ్‌కుమార్, స్రవంతి రాజ్, మెలగాసి నర్సిం తదితరులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచాలి : ఎమ్మెల్సీ నవీన్

ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఇస్తున్న వేతనాలను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం శాసన మండలిలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు పెంపు, కామారెడ్డి బీసి డిక్లరేషన్లపై ప్రస్తావించారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలీచాలని వేతనాలతో పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు కనీసం వేతనం రూ.15వేలు చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కామారెడ్డి బీసి డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, సంచార జాతుల విజ్ఞప్తి మేరకు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళినట్లు తెలిపారు. రాష్ట్రంలో 33లక్షల సంచార జాతులకు సంబంధించిన జనాభా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## మియాపూర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిషలు కృషి

జిహెచ్ఎంసి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్



ప్రజాపక్షం/మియాపూర్ : మియాపూర్ డివిజన్ అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తానని జిహెచ్ఎంసి మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం 2026 సందర్భంగా మియాపూర్ డివిజన్ ప్రజలకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నివాసంలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించగా, మియాపూర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటి కాలనీ, ముజాఫర్ అహ్మద్ నగర్ కాలనీలకు చెందిన స్థానికులు, జిహెచ్ఎంసి శానిటేషన్ అధికారులు మర్యాదపూర్వకంగా పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో డివిజన్‌ను అన్నిరంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మాధవరం గోపాల్ రావు, నరేష్ రెడ్డి, ఆనంద్, పండు, నాగేశ్వరరావు, జిహెచ్ఎంసి శానిటేషన్ అధికారులు ఎస్ఆర్పి కనక రాజు, తిప్పర్తి మహేష్, ఎస్ఎఫ్ఒలు వినయ్ ఆగమయ్య,సాయి తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## పట్టాలెక్కుతున్న పవన్-సురేందర్ సినిమా



నటుడు పవన్ కళ్యాణ్ ఒకపక్క రాజకీయంగా తన బాధ్యతలు నిర్వర్తిస్తూనే తన వృతికి సైతం ఇబ్బందులు కలుగకుండా చూసుకుంటున్నారు. పవన్ కళ్యాణ్ సినిమాలు చేయడానికి కొంత ఆలస్యమైనా పెండింగ్ ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పట్టాలెక్కిస్తున్నారు. ఇటీవలే ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ పూర్తి చేసిన పవన్ కళ్యాణ్ సురేందర్ రెడ్డి సినిమాను సెట్స్ పైకి తీసుకువచ్చేనందుకు సిద్ధమైయ్యారు. జైత్ర రామ్ మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కనున్న ఈ సినిమాను రామ్ తాళ్లూరి నిర్మించనున్నట్టు తెలిపారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తామని రామ్ వెల్లడించారు. ఈ సినిమాను జైత్రరామ మూవీస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ఈ చిత్రానికి సంబధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని రామ్ తెలిపారు.

## వేసవిలో 'ఉస్తాద్' విడుదల



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విడుదలకు ముస్తాబవుతోంది. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ సినిమాను వేసవి సెలవుల్లో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ బ్లాక్ బస్టర్ సినిమా చేసిన హరీష్ శంకర్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాను తెరకెక్కించారు. మైత్రి మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. మరో ముఖ్యమైన పాత్రలో రాశి ఖన్నా కనిపించనుంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకు ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ సినిమా నుంచి ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఎర్ర షర్ట్ వేసుకున్న ఉస్తాద్ భగత్ సింగ్ భుజం మీద తుపాకీ పెట్టుకుని, ఇంకో చేతిలో పాతకాలం రేడియో పట్టుకున్న ఫోటోను నిర్మాతలు విడుదల చేశారు.

## ఎఫ్ఎన్‌సిసి ఉత్తమ చిత్రం రాజు వెడ్స్ రాంబాయి

ప్రతి ఏడాది ఫిలిం నగర్ కల్చరల్ క్లబ్ (ఎఫ్ఎన్‌సిసి) సినిమా క్రీడాకారులకు అవార్డు ప్రదానం చేస్తుంది. అలాగే 2025లో విడుదల అయిన సినిమాల్లో రాజు వెడ్స్ రాంబాయి సినిమాకు ఉత్తమ చిత్రం అవార్డును ప్రదానం చేశారు. అల్లు అరవింద్, అశ్వనీ దత్ ఈ అవార్డును బాహుకరించారు. ఉత్తమ నిర్మాత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ నటుడు అవార్డు లతో ఎఫ్ఎన్‌సిసి సత్కరించింది. ఇలాంటి సినిమాలు రావాల్సిన అవసరం ఉందని వక్తలు కొనియాడారు.



## 'అసుర సంహారం' టీజర్



లెజెండరీ యాక్టర్ తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'అసుర సంహారం'. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ళ సమర్పణలో, శ్రీ సాయి తేజో సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరిష్ బోయెళ్ళ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కిషోర్ శ్రీకృష్ణ ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్స్, సాంగ్ లాంచింగ్ కార్యక్రమం తనికెళ్ల భరణి చేతుల మీదుగా ఘనంగా జరిగింది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన 'విలేజ్ క్రైమ్ డ్రామా'గా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఇందులో తనికెళ్ల భరణితో పాటు మిధున ప్రియ మరో ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. 'అసుర సంహారం అంటే చెడుపై మంచి సాధించిన విజయం. డైరెక్టర్ కిషోర్ శ్రీకృష్ణ మంచి సబ్జెక్టను తెరకెక్కించారు. ఈ సినిమాలో ఒక విలేజ్‌లో డిటెక్టివ్ పాత్ర పోషింసించాను అని చెప్పారు. దర్శకుడు కిషోర్ శ్రీకృష్ణ, నటీ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మిథున్ ప్రియా పాల్గొన్నారు.

## 'స్పిరిట్' ఫస్ట్ లుక్



రెబల్ స్టార్ ప్రభాస్, హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్లను అందించిన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్'లో తన కెరీర్లోనే మోస్ట్ ఇంటెన్స్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. మేకర్స్ కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఒక ఒక పవర్ ఫుల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇది నిమిషాల్లో వైరల్‌గా మారింది. 'ఇండియన్ సినిమా.. మీ అజానుబాహుదును చూడండి. నూతన సంవత్సర శుభాకాంక్షలు 2026 . స్పిరిట్ ఫస్ట్ లుక్ అని సందీప్ రెడ్డి వంగా తన సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒళ్లంతా గాయాలతో, బ్యాండ్ ఎయిడ్లు కట్టుకుని ప్రభాస్ వెనక్కి తిరిగి నిలబడి వున్న రా అండ్ రస్టిక్ పోస్టర్ అదిరిపోయింది. పొడవాటి జుట్టు, గడ్డం పాత్ర ఇంటన్సిటీని మరింత పెంచుతోంది.చేతిలో మద్యం సీసా పట్టుకుని ఉన్న ప్రభాస్ లుక్ అదిరిపోయిందని చెప్పొచ్చు. అతని పక్కన ఉన్న త్రిప్తి డిమ్రీ ఒక ఎమోషనల్ మూమెంట్‌లో అతని సిగరెట్ను వెలిగిస్తూ కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది.ఈ ఫస్ట్ లుక్, ప్రభాస్ పోషిస్తున్న పాత్రను ఇంటన్సిటీ, పవర్‌ని తెలియజేస్తోంది. హింస, అంతర్గత సంఘర్షణ చుట్టూ తిరిగే ఒక ఫెరోషియస్ కథను ప్రజెంట్ చేస్తోంది. ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ ప్రారంభ దశలో ఉంది.

## 'జడల్ జమానా' ఇది




'దసరా' విజయం తర్వాత కథానాయకుడు నేచురల్ స్టార్ నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. మోహన్‌బాబు ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి కొత్త ఏడాది సందర్భంగా ఓ కొత్త లుక్‌ను విడుదల చేశారు. 'జడల్ జమానా' అంటూ వచ్చిన ఆ ప్రచార చిత్రంలో నాని యాక్షన్ లుక్‌లో ఆకట్టుకునేలా కనిపించారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమా మార్చి 26న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.

## 'హే భగవాన్' షూటింగ్ పూర్తి

సుహాస్ హీరోగా నూతన దర్శకుడు గోపి అచ్చర దర్శకత్వంలో 'హే భగవాన్' సినిమా చేస్తున్నారు. ఈ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్ 2. రైటర్ పద్మభూషణ్ ఫేం షణ్ముక ప్రశాంత్ ఈ కథను రాశారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్‌లో సస్పెన్స్, కామెడీతో నవ్వించారు. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. చిత్ర బృందం నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక వీడియో అందరినీ ఆకట్టుకుంది.ఈ చిత్రంలో శివాని నగరం హీరోయిన్‌గా నటిస్తున్నారు. డా.నరేష్ వికె, సుదర్శన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



## 10 నిమిషాల నుంచి 10 కోట్ల వరకు...




ఇండస్ట్రీలో కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు విష్ణు మంచు సాహోసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్ ఈ మేరకు కొత్త ఏడాది సందర్భంగా ఓ కీలక ప్రకటన చేసింది. ఇండియా వైడ్‌గా ఉన్న కొత్త టాలెంట్, న్యూ జనరేషన్ ఫిల్మ్ మేకర్స్ అందరికీ అవా ఎంటర్‌టైన్‌మెంట్ ఆహ్వానం పలుకుతోంది. రూటెడ్ స్టోరీలు చెప్పే విజన్, క్రియేటివిటీ ఉన్న న్యూ మేకర్లని ఒక చోటకు చేర్చాలని విష్ణు మంచు ప్రయత్నిస్తున్నారు. ఓ పది నిమిషాల నిడివి ఉన్న లఘు చిత్రం కూడా మన జీవితాన్ని మార్చేయగలదు. చిన్నగా ప్రారంభైన ప్రయాణమే గొప్ప స్థాయికి వెళ్లొచ్చు. ఓ గొప్ప సినిమా అనేది దాని స్కేల్ లేదా నేపథ్యం నుంచి కాకుండా.. ఆలోచన, అందులోని స్పష్టత, భావోద్వేగం, సృజనాత్మకత నుంచి పుడుతుందని అవా ఎంటర్‌టైన్‌మెంట్ నమ్ముతోంది. మరిన్ని వివరాలను ఈ నెల 15న అధికారికంగా వెల్లడించనున్నారు.

## పొలిటికల్ డ్రామా 'లెగసీ'



విశ్వక్ సేన్, సాయి కిరణ్ దైదా దర్శకత్వం వహించిన విమర్శకుల ప్రశంసలు పొందిన 'పిండం' చిత్రాన్ని నిర్మించిన కలాహీ మీడియా పతాకంపై తెరకెక్కుతోన్న రెండవ సినిమాలో నటిస్తున్నారు. 'లెగసీ' అనే టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రానికి కూడా 'పిండం' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న సాయి కిరణ్ దైదా రచన, దర్శకత్వం వహిస్తున్నారు. నూతన సంవత్సర సందర్భంగా, ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ, అద్భుతమైన టీజర్ ను విడుదల చేశారు. 'లెగసీ' ఒక రాజకీయ నేపథ్యంతో సాగే కథ. అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకుడైన తన తండ్రి వారసత్వాన్ని అనివార్యంగా మోయవలసి వచ్చే సిద్ధార్థ్ అనే యువకుడి కథగా ఇది రూపొందుతోంది. వారసుడు లేని కుర్చీ చుట్టూ తిరిగే అవకాశవాద రాజకీయ రాబందులను తాను ఎంతగా ద్వేషిస్తాడో చెప్పే విశ్వక్ సేన్ వాయిస్ ఓవర్‌తో టీజర్ ప్రారంభమవుతుంది.

# ప్రజల పాలిట శాపం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పడుతోందన్నారు. చౌటుప్పల్, మునుగోడు ప్రాంతాల్లో పచ్చని పొలాల మధ్య విచ్చలవిడిగా ఫార్మా పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల ప్రజల జీవన హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలోని కొత్త మండల కేంద్రాలు, కిష్టాపురం వంటి గ్రామాల్లో వ్యవసాయ భూముల నడుమ పరిశ్రమలు నెలకొల్పుతున్నారని తెలిపారు. చౌటుప్పల్ ప్రాంతంలో భూగర్భ జలాలు, లక్కారం చెరువు వంటి నీటి వనరులు పూర్తిగా రంగు మారిపోయి తాగడానికి కూడా పనికిరాని స్థితికి చేరుకున్నాయన్నారు. ఈ పరిశ్రమల వల్ల స్థానికులకు ఎలాంటి ఉపాధి ప్రయోజనాలు లేవని, కాలుష్యం తప్ప మరొకటి దక్కడం లేదని ఎంఎల్‌సి సత్యం సభ దృష్టికి తీసుకొచ్చారు. పెద్ద ఫార్మా కంపెనీల్లో కూడా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలేదని, అటెండర్, క్లీనింగ్ వంటి చిన్న ఉద్యోగాలే ఇస్తున్నారని తెలిపారు. కాలుష్య ప్రభావంతో 10 ఏళ్ల బాలుడు శారీరక వైకల్యానికి గురైన ఘటనకు సంబంధించిన ఫొటోను సభలో చూపెట్టారు. ఇప్పటికే ఫ్లోరైడ్ సమస్యతో నల్లగొండ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ఇప్పుడు ఫార్మా కాలుష్యంతో ఈ ప్రాంతాన్ని మరో పటాన్ చెరువుగా మార్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఫ్యాక్టరీ యాజమాన్యాలతో కుమ్మక్కు కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, కొత్త ఫార్మా పరిశ్రమలకు అనుమతులు నిలిపివేయాలని ప్రభుత్వాన్ని సత్యం కోరారు. నివాస ప్రాంతాలకు దగ్గరగా ఉన్న కంపెనీలను తక్షణమే తరలించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా కంపెనీలపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

### కాలుష్యకారక ఫార్మా కంపెనీలపై కఠిన చర్యలు : మంత్రి కొండా సురేఖ

నిబంధనలు ఉల్లంఘించిన ఫార్మా కంపెనీలపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మంత్రి కొండా సురేఖ తెలిపారు. శాసనమండలిలో శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. చౌటుప్పల్‌లో రూ.76 పరిహారం విధించి, కంపెనీని బోర్డు జప్తు చేసిందని తెలిపారు. నిబంధనలు పాటించని కంపెనీలపై రూ.6 కోట్ల వరకు పరిహారం విధించామన్నారు. చౌటుప్పల్‌లో 12 పరిశ్రమలకు నోటీసులు ఇచ్చామన్నారు. కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఫీజుబులిటి ఉంటేనే కంపెనీలకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందన్నారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై సంబంధిత కంపెనాలకు నోటిసులు ఇచ్చామన్నారు. పంట నష్టాలపై 8 కంపెనీల మూసివేతకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జల కాలుష్యానికి గురైన విషయం గుర్తించి, రూ.76 లక్షల బ్యాంకు గ్యారంటీని రద్దు చేసినట్లు సభకు మంత్రి వివరించారు. మరో 18 పరిశ్రమలపై ఫిర్యాదు అందిన తరువాత కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కూడా అధ్యయనం చేసిందని, 12 కంపెనీలలో మూడు నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర కాలుష్యనియంత్రణ మండలిని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి కోరిందని తెలిపారు. నీటి కాలుష్యం, మట్టి కాలుష్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.



# గొప్ప ప్రజా నాయకుడు బర్దన్

### వర్ధంతిలో కొనియాడిన వక్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్: జీవితాంతం కమ్యూనిస్టుగా పనిచేసి విశేషమైన ప్రజాదరణ పొందిన గొప్ప ప్రజా నాయకుడు ఎ.బి.బర్దన్ అని సిపిఐ జాతీయ కార్యర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ కొనియాడారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎ.బి.బర్దన్ 10వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం, మగ్ధూభవన్‌లో శుక్రవారం బర్దన్ చిత్రపటానికి పల్లా, రామకృష్ణతో పాటు సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, ఎఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, డిహెచ్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాస్, బిసి సంఘ నాయకులు రాయబండి పాండురంగ చారి తదితరులు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి, రామకృష్ణ మాట్లాడుతూ.. బర్దన్ కమ్యూనిస్టు నిర్వాహకులుగా, కార్మికవర్గ నాయకులుగా, కార్మికవర్గం హక్కులు, సామజిక భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, రాజకీయ హక్కులను కాపాడే పనితో పాటు, కార్మికులకు రాజకీయ చైతన్యాయన్ని అందించడం, మార్క్సిస్ట్ భావజాలాన్ని ప్రాచుర్యంలోకి తీసుకురావడం పై ప్రత్యేక శ్రద్ధ చూపారని కొనియాడారు. బర్దన్ మంచి వక్త, సరళతర, ఆలోచనల స్పష్టతతో తరచు చమత్కారమైన వ్యాఖ్యలు చేసేవారని గుర్తు చేశారు. ఇ.టి.నరసింహ మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజా పోరాటాల పట్ల, శ్రమించే ప్రజల హక్కులను కాపాడడంలో బర్దన్ చూపిన అచంచల నిబద్ధత కమ్యూనిస్టులందరికీ మార్గదర్శకమన్నారు. ఐక్యత, ప్రజాస్వామ్యం, సోషలిజం, ప్రజలహక్కుల కోసం జీవితాంతం పోరాడిన పోరాటయోధుడు అని కొనియాడారు.

**ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో...**

కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయడంతో పాటు భారతదేశంలో కార్మికరాజ్య స్థాపన ఆశయంతో విశేష కృషి చేసిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు ఎ.బి.బర్దన్ అని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ అన్నారు. కార్మిక నాయకుడు, ఎఐటియుసి జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ కమ్యూనిస్టు మేధావి, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.బి. బర్దన్ 10వ వర్ధంతి సందర్భంగా హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేంపావని, రాష్ట్ర కార్యదర్శులు బి.వెంకటేశం, నందూరి కరుణ కుమారి, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉష రాణి, బొడ్డుపల్లి కిషన్, పి.వెంకటయ్య, చెట్టుక్రింది శ్రీనివాస్, జగన్‌మోహన్, జంగయ్య, జె.వి.క్రిష్ణ, జి.నర్సయ్య, రాజేష్, యం.నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.



## బర్సేదేవా లొంగుబాటు?

(మొదటి పేజీ తరువాయి)

ఐఇడి పేలుళ్లు, అటవీ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలు రూపొందించడంలో బర్సే దేవా కీలక పాత్ర పోషించినట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి.

**హిడ్మాతో అనుబంధం..**

ఇటీవల ఎపి పోలీసుల చేతిలో ఎన్‌కౌంటర్‌కు గురైన మావోయిస్టు నేతగా పేరున్న మాడ్వి హిడ్మాకు బర్సే దేవా అత్యంత నమ్మకమైన సహచరుడిగా వ్యవహరించాడు.

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలో జరిగిన అనేక దాడుల్లో హిడ్మా–బర్సే దేవా జంట కీలక వ్యూహకర్తలుగా ఉన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి.

ఈ కారణంగానే బర్సే దేవా పేరు మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుల జాబితాలో చేరింది.

బర్సే దేవాపై భద్రతా బలాలపై దాడులు,ఆయుధాలు, పేలుడు పదార్థాల నిల్వ,పౌరులను బెదిరింపులకు గురిచేయడం, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసం వంటి పలువురు నేర కేసులు చత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లో నమోదయ్యాయి. అతడి అరెస్టుకు సంబంధించి రూ.50లక్షల్లో రివార్డు కూడా ఉన్నట్లు సమాచారం.

## అసెంబ్లీ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

కల్పించడమే లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్‌ను కార్పోరేషన్‌ను ఔటర్ రింగు రోడ్డు పరిధివరకు మరింత విస్తరిస్తూ ప్రభుత్వం తీసుకు నిర్ణయం మేరకు 150 వార్డులను 300 వార్డులకు విస్తరిస్తూ సవరణ చట్టాలను తీసుకువచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ విస్తర్ణలో భాగంగా రంగారెడ్డి, మేడ్చల్ –మల్కాజ్‌గిరి జిల్లాలోని 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల కార్పొరేషన్లను విలీనం చేస్తు మరో సవరణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అదేవిధంగా రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఒఆర్‌ఆర్ లోపల, సమీప గ్రామీణ ప్రాంతాలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేస్తూ మరో సవరణ చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని మామిడి పల్లి వద్ద ఏర్పాటు చేసిన అమిటీ ప్రైవేట్ విశ్వవిద్యాలయం, యాదాద్రి భువనగిరి జిల్లా దేశ్‌ముఖ్‌లో ఏర్పాటు చేసిన సెయింట్ మేరీస్ రీహాబిబిలిటేషన్ ప్రైవేట్ విశ్వవిద్యాలయలను షెడ్యూల్డ్‌లో చేర్చుతూ ప్రభుత్వంతెలంగాణ ప్రైవేట్ విశ్వవిద్యాలయముల స్థాపన, క్రమబద్ధము సవరణ చట్టం 2025 తీసుకువచ్చింది. అదేవిధంగా సరకు రవాణా చేసే వాహనాలకు సంబంధించి ప్రతి మూడు నెలలకోసారి రోడ్డు టాక్స్ చెల్లిస్తున్న క్రమంలో దానిని ఏకకాలంలో జీవిత కాల టాక్స్ చెల్లించే విధంగా చట్టాన్ని సవరిస్తూ తెలంగాణ మోటార్ వాహనాలపై పన్ను విధింపు (సవరణ) చట్టం2025 ను ప్రభుత్వం తీసుకువచ్చింది.

## విషం సరఫరా

(మొదటి పేజీ తరువాయి)

ఎక్స్‌లో హిందీలో చేశారు. ప్రతి ఇల్లు శోకంతో నిండిపోయిందని, పేదలు నిస్సహాయంగా ఉండగా, దీనికి తోడు బిజెపి నాయకులు అహంకారపూరిత ప్రకటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రాణాలు, జీవనోపాధి కోల్పోయిన వారికి ఓదార్పు అవసరమని, కానీ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తుందని విమర్శించారు. గురువారం నాడు మధ్యప్రదేశ్ సీనియర్ క్యాబినెట్ మంత్రి కైలాష్ విజయవర్గియ, నీటి కాలుష్యం ఘటన గురించి ఒక టీవీ జర్నలిస్ట్ ప్రశ్నించగా, కెమెరా ముందు 'ఘంటా' (స్థూలంగా చెప్పాలంటే పనికిమాలినది) అనే అభ్యంతరకరమైన పదాన్ని ఉపయోగించి వివాదాన్ని రేకెత్తించారు. మురికిగా, దుర్వాసనతో కూడిన నీటి గురించి ప్రజలు పదేపదే ఫిర్యాదు చేసినప్పుడు వాటిని ఎందుకు పట్టించుకోలేదని రాహుల్‌గాంధీ తన పోస్ట్‌లో ప్రశ్నించారు. 'మురుగునీరు త్రాగునీటిలో ఎలా కలిసింది? సరఫరాను సకాలంలో ఎందుకు నిలిపివేయలేదు? బాధ్యులైన అధికారులు, నాయకులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ఇవి చిన్న ప్రశ్నలు కావు... వీటికి జవాబుదారీతనం అవసరమని, స్వచ్ఛమైన నీరు ఒక దయ కాదు, అది జీవించే హక్కు అని ఆయన ఉద్ఘాటించారు. ఈ హక్కును నాశనం చేయడానికి బిజెపి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం, దాని నిర్లక్ష్య పరిపాలన, సున్నితత్వం లేని నాయకత్వమే పూర్తిగా బాధ్యత వహిస్తాయని పేర్కొన్నారు. 'మధ్యప్రదేశ్ ఇప్పుడు దుర్పరిపాలనకు కేంద్రంగా మారింది. దగ్గు సిరప్‌ల వల్ల మరణాలు, ప్రభుత్వ ఆసుపత్రులలో ఎలుకలు పిల్లలను చంపడం, ఇప్పుడు మురుగునీరు కలిసిన నీరు తాగడం వల్ల మరణాలు సంభవించాయి. పేదలు చనిపోయినప్పుడల్లా, మోదీజీ ఎప్పటిలాగే మౌనంగా ఉంటారు' రాహుల్ ఆరోపించారు.

**మరణాలపై మోదీ మౌనమెందుకు? : ఖర్గే**

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శుక్రవారం మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జల్ జీవన్ మిషన్ గురించి పదే పదే గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ ఇండోర్‌లో కలుషిత నీటి వల్ల సంభవించిన మరణాలపై మౌనంగా ఉన్నారని అన్నారు. మోదీ ప్రభుత్వం, బిజెపి దేశానికి స్వచ్ఛమైన నీటిని గానీ, స్వచ్ఛమైన గాలిని గానీ అందించడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. 'జల్ జీవన్ మిషన్, స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి గొప్పలు చెప్పుకోవడానికి ఎప్పుడూ అలసిపోని నరేంద్ర మోదీ జీ, ఇండోర్‌లో కలుషిత నీరు తాగడం వల్ల సంభవించిన మరణాలపై తన మాములు మౌనాన్ని పాటిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో వరుసగా ఎనిమిదోసారి 'అత్యంత పరిశుభ్రమైన నగరం' టైటిల్‌ను గెలుచుకున్న నగరం ఇదే ఇండోర్. బిజెపి అసమర్థత కారణంగా ఇక్కడి ప్రజలు స్వచ్ఛమైన నీటి కోసం అల్లాడుతుండటం సిగ్గుచేటు' అని ఖర్గే ఎక్స్‌లో పోస్ట్‌లో చేశారు. 11 సంవత్సరాలుగా దేశానికి సుదీర్ఘ ప్రసంగాలు, అబద్ధాలు, మోసాలు, డొల్ల వాగ్దానాలు, 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం గురించి గొప్పలు తప్ప మరేమీ అందించలేదని ఆయన అన్నారు. మంత్రులను ప్రశ్నించినప్పుడు, వారు దుర్భాషలు, బెదిరింపులకు పాల్పడతారని, అధికార అహంకారంతో మదమెక్కి, వారు జర్నలిస్టులపైనే ఎదురుదాడి చేస్తారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వాల దుర్పరిపాలనను కప్పిపుచ్చడానికి మొత్తం యంత్రాంగం రంగంలోకి దిగుతుందని ఆరోపించారు. ప్రభుత్వ పథకాలన్నీ అవినీతి, అక్రమాలలో కూరుకుపోయాయని, జల్ జీవన్ మిషన్ నిధులలో 10 శాతం కలుషిత నీటిని శుద్ధి చేయడానికి కేటాయించారని ఖర్గే అన్నారు. మోదీ ప్రభుత్వం, బిజెపి దేశానికి స్వచ్ఛమైన నీటిని గానీ, స్వచ్ఛమైన గాలిని గానీ అందించడంలో విఫలమయ్యాని, సామాన్య ప్రజలే దీనివల్ల బాధపడుతున్నారు' అని కాంగ్రెస్ అధినేత అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com